మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



సెన్సెక్స్ @ 84,000

చారిత్రక గరిష్ఠ స్థాయికి సూచీలు

సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్ల లాభం

6.24 లక్షల కోట్లు పెరిగిన సంపద

› 10



నీట్ 'స్థానికత'పై విద్యార్థులకు ఊరట

పిటిషనర్లు కౌన్సెలింగ్‌కు హాజరుకావొచ్చు

సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ఈ ఒక్కసారి అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం

› 12

శనివారం SATURDAY 21.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 16+4 Pages: 16+4 | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 107 ॥ వెల (Price) రూ.6.50

చవితి

శనివారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-13. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: చవితి సాయంత్రం 6-14 వరకు. నక్షత్రం: భరణి రాత్రి 12-36 వరకు. వర్జ్యం: పగలు 11-29 నుంచి పగలు 12-56 వరకు. రాహుకాలం: ఉదయం 9-07 నుంచి ఉదయం 10-38 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 6-05 నుంచి ఉదయం 7-42 వరకు. అమృతకాలం: రాత్రి 8-13 నుంచి రాత్రి 9-40 వరకు. సంకష్టహర చతుర్థి చంద్రోదయం రాత్రి 8-46 గంటలకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

సౌత్ అలైన్‌మెంట్‌పై సర్కారు కమిటీ

మార్పు ఎందుకోసం?

14 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం.. రైతుల్లో పలు సందేహాలు

గత సర్కారు హయాంలోనే అలైన్‌మెంట్ పూర్తి

గ్రౌండ్‌లో మార్కింగ్.. కేంద్రానికి ఇప్పటికే ప్రతిపాదన

మళ్లీ ఇప్పుడు కొత్తగా మార్పు చేర్పులు ఎవరికోసం?

స్పష్టం చేయని ప్రభుత్వం.. ముక్తసరి ప్రకటనతో సరి

క్యాబినెట్ నిర్ణయానికి ముందే కొత్త అలైన్‌మెంట్!

ఇటీవలే ముఖ్యమంత్రికి అధికారుల ప్రజెంటేషన్

కమిటీని ముందుపెట్టి ముద్రవేయించుకునే యత్నమా!



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు ప్రభుత్వం 12 మంది అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర క్యాబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఈ కమిటీలో రోడ్లు, భవనాలు, పురపాలక, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శులతోపాటు ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పరిధిలోని జిల్లాల కలెక్టర్లు (యాదాద్రి-భువనగిరి, నల్లగొండ, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి)తో పాటు రోడ్లు, భవనాలు, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు.. ఇలా 12 మంది సభ్యులు ఈ కమిటీలో ఉంటారని చెప్పారు. ఇంతకు ముందే గత ప్రభుత్వ హయాంలో భారత జాతీయ రహదారుల అధీకృత సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) రూపొందించిన ట్రిపుల్-ఆర్ దక్షిణభాగం అలైన్‌మెంట్‌ను మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్ణయించిందన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం

› 5వ పేజీలో

సీబీఐ దర్యాప్తు జరపాలి

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు అసలు గుట్టు తేల్చాలి: ప్రశాంత్‌రెడ్డి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి
- లేదంటే కాంగ్రెస్ – బీజేపీలు కుమ్మక్కు అయినట్టే
- అలైన్‌మెంట్ మార్పుతో ప్రభుత్వ పెద్దల భూదందా
- వందల ఎకరాల చెర.. అందుకే ట్రిపుల్ ఆర్‌పై కుట్ర
- ఫోర్త్‌సిటీ కోసం రూట్ మార్చారన్నది పచ్చి అబద్ధం
- కొత్త అలైన్‌మెంట్‌తోనే రింగ్‌రోడ్డు మరింత దూరం
- మార్పుల మర్మమేమిటో ముఖ్యమంత్రి చెప్పాలి
- అలైన్‌మెంట్‌కు గ్రామసభల ఆమోదం పొందాలి
- మార్పుతో లాభనష్టాలను ప్రజలకు వివరించాలి
- యథేచ్ఛగా మారిస్తే కేంద్రం ట్రిపుల్‌ఆర్ చేపట్టదు
- అందుకే రాష్ట్ర ప్రభుత్వమే ప్రాజెక్టు చేపట్టేలా స్కెచ్
- తద్వారా సొంత కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ప్లాన్
- వరల్డ్‌బ్యాంకు అప్పు కోసం దేబరింపు దానికోసమే
- పెద్దల స్వలాభానికి ప్రజలపై 12,500 కోట్ల భారం
- ట్రిపుల్‌ఆర్ తెచ్చానన్న కిషన్‌రెడ్డి స్పందించట్లేదేం?
- కొత్త అలైన్‌మెంట్‌పై మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి ఫైర్



ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) గతంలోనే రూపొందించిన ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను మార్చటం వెనుక మతలబు ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ కోసమే ఈ మార్పు అని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు చెప్తున్నా.. మునుపటిదాని కంటే కొత్త అలైన్‌మెంట్ ఆ సిటీకి మరింత దూరం ఎందుకు పోతున్నదో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. గత కొన్నిరోజులుగా ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్పుపై గ్రామాల్లో ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో శుక్రవారం తెలంగాణభవన్‌లో ప్రశాంత్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. అలైన్‌మెంట్ మార్పు వెనుక కుట్రలు ఉన్నాయని పక్కా ఆధారాలతో గుట్టు విప్పారు. దక్షిణ భాగం

› 3వ పేజీలో

అలైన్‌మెంట్ లైన్ తప్పిందిలా...

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌ను రూపొందించిన కేంద్రం
- అప్పట్లో ఏ ఊరిలోనూ ఒక్కరైతైనా ఆందోళన చెందలేదు
- దక్షిణ భాగాన్ని భారత్‌మాల కింద చేపట్టాల్నా? మరో పథకం కింద చేపట్టాల్నా? అని కేంద్రం యోచన
- ఈ తరుణంలో సౌత్‌లో భారీ మార్పులు చేసిన ప్రభుత్వం
- పూర్తిగా కాకుండా కొన్నిచోట్ల పాత అలైన్‌మెంటుకు 2-5 కిలోమీటర్ల దూరం జరిగిన రింగు
- అక్కడే ప్రభుత్వ పెద్దలకు, కాంగ్రెస్ నేతలకు, ఓ కీలక నేత కుటుంబానికి భారీ ఎత్తున ల్యాండ్ బ్యాంక్
- ఫ్యూచర్/ఫోర్త్ సిటీ కోసమే మార్పు అనేది ఒక సాకు. కొత్త మ్యాప్‌లోనే మరింత దూరంగా రింగ్ రోడ్డు
- రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ ఇష్టానుసారంగా మార్చితే ప్రాజెక్టు నుంచి తప్పుకోనున్న కేంద్రప్రభుత్వం
- కేంద్రం తప్పుకుంటే దక్షిణ భాగం నిర్మాణానికి రాష్ట్రంపై రూ.12,500 కోట్ల భారం
- ప్రపంచబ్యాంకు రుణంతో చేపట్టాలని ప్రభుత్వ యత్నం
- తమ భూముల రేట్ల కోసం తెలంగాణ ప్రజలపై రుణ భారం
- అధికారంలోకి వచ్చిన నెలకే కుందారం భూముల చెర
- ట్రిపుల్ ఆర్ తెచ్చానన్న కిషన్ రెడ్డి ఎందుకు మాట్లాడరు?
- ట్రిపుల్ ఆర్ భూ దందాపై కేంద్రమంత్రి బండి సంజయ్ సీబీఐ విచారణ జరిపించాలి. లేకపోతే కాంగ్రెస్-బీజేపీలు ఒక్కటేనని తేలిపోయినట్టే.

హైడ్రాకు సూపర్ పవర్స్

- చట్టబద్ధత, సర్వాధికారాల కల్పన.. 3 యూనివర్సిటీల పేర్లు మార్పు › 5
- వానకాలం నుంచే సన్నాలకు 500 బోనస్.. జనవరి నుంచి రేషన్ సన్నబియ్యం
- ఎస్సెల్బీసీ టన్నెల్ పనుల అంచనాల పెంపు.. రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం

రేవంత్‌కు రిపోర్ట్ చేయొద్దు

ఓటుకు నోటు దర్యాప్తుపై సుప్రీం ఆదేశం

నోరు జాగ్రత్త అంటూ సీఎంకు చురక

› 5

హెరిటేజ్ జాతర..

ఏపీ ఎఫెక్ట్

'విజయ'కు పాతర

- తెలంగాణలో చంద్రబాబు సంస్థ హెరిటేజ్ భారీ పెట్టుబడి
- రూ.200 కోట్లతో భారీ డెయిరీ ఏర్పాటుకు సన్నాహాలు
- ఇదే జరిగితే ప్రభుత్వ డెయిరీ విజయ కథ ముగిసినట్టే
- ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో నష్టాల్లోకి విజయ డెయిరీ
- మూడు నెలలుగా పాడి రైతులకు బిల్లుల చెల్లింపుల్లేవ్
- ఇతర డెయిరీలకు రైతులు మళ్లాలనే బిల్లుల జాప్యమా?
- ఉద్దేశపూర్వకంగానే పాడిగేదేను బలిపెడుతున్న ప్రభుత్వం
- కేసీఆర్ హయాంలో ఏర్పాటైన మెగా డెయిరీపైనా నిర్లక్ష్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీని నిర్వీర్యం చేసే దిశగా పావులు కదులుతున్నాయి. విజయ డెయిరీకి పోటీగా ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సన్నద్ధం అవుతున్నట్టు తెలిసింది. రూ.200 కోట్లకు పైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతో పాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. దీనిపై ఇటీవల జరిగిన హెరిటేజ్ బోర్డు మీటింగ్‌లో నిర్ణయం కూడా తీసుకున్నట్టు తెలిసింది. ఇదే జరిగితే విజయ డెయిరీ చరిత్రలో

› 2వ పేజీలో



త్వరలో మద్యం ధరల పెంపు?

- పెరిగిన ధరల్లో ప్రధాన వాటా కంపెనీలకే.. సర్కారు ఖజానాను కొల్లగొట్టేందుకు భారీ కుట్ర › 5
- తెలుగు రాష్ట్రాల్లో ఒకే తీరు ధరలకు కసరత్తు.. చక్రం తిప్పుతున్న పొరుగు రాష్ట్రపు అనుంగుడు
- అస్మదీయులకే మద్యం సరఫరా కాంట్రాక్టులు.. అక్టోబర్ చివర్లో ధరలపై వెలువడనున్న నిర్ణయం

చంద్రుడిపై రయ్ రయ్‌మంటూ..



టోక్యో, సెప్టెంబర్ 20: చంద్రుడిపై పరిశోధనలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటివరకు చంద్రుడిపై ల్యాండ్ అయిన చోటనే పరిశోధనలకు వీలుండేది. ఇప్పుడు ల్యాండ్ అయిన చోట నుంచి వ్యోమగాములు కొంత దూరం ప్రయాణం చేయడానికి వీలుగా ఒక ప్రెషరైజ్డ్ రోవర్‌ను జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం టయోటా కంపెనీ తయారు చేస్తున్నది. నాసా చేపట్టనున్న అర్టెమిస్ 7 మిషన్ కోసం ఈ రోవర్‌ను వినియోగించనున్నారు. టైర్లతో కూడిన ఈ రోవర్(వాహనం)లో వ్యోమగాములు చంద్రుడిపై ఒక చోట నుంచి మరో చోటకు ప్రయాణించవచ్చు. ఇందులోనే కొంతకాలం నివసించవచ్చు. చంద్రుడిపై అధ్యయనం జరపడానికి అవసరమైన శాస్త్రీయ పరికరాలు కూడా ఇందులో ఉంటాయి. ఒకరకంగా చెప్పాలంటే ఇది కారవాన్, మొబైల్ ల్యాబ్ కలగలిసిన వాహనం. చంద్రుడిపై ప్రతికూల వాతావరణం, రేడియేషన్ ప్రభావం వ్యోమగాములపై పడకుండా దీనిని రూపొందిస్తున్నారు. ఈ రోవర్ తయారీ కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ(జేఏఎక్స్‌ఏ) కలిసి పని చేస్తున్నాయి.

ఎముకల క్యాన్సర్‌కు గాలియంతో చెక్!



లండన్, సెప్టెంబర్ 20: ఎముకల క్యాన్సర్(ఆస్టియోసార్కోమా)కు ఇంగ్లండ్‌కు చెందిన పరిశోధకులు కొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. గాలియం అనే మూలకం ద్వారా క్యాన్సర్ కణాలను 99 శాతం కచ్చితత్వంతో అంతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం జరిపిన ప్రయోగంలో మంచి ఫలితాలు వచ్చాయి. ఎముకలు, దంతాల దృఢత్వాన్ని పెంచే సామర్థ్యం కలిగిన బయోయాక్టీవ్ అద్దాలను పొడిగా మార్చి, దానికి గాలియంను కలిపి చికిత్సకు ఉపయోగించవచ్చని ఈ ప్రయోగానికి నేతృత్వం వహించిన ప్రొఫెసర్ రిచర్డ్ మార్టిన్ తెలిపారు. ఆకలితో ఉండే క్యాన్సర్ కణాలు ఈ మిశ్రమంతో మరణిస్తాయని చెప్పారు.క్యాన్సర్ కారణంగా నష్టం జరిగిన ఎముక మళ్లీ ఏర్పడేందుకు సైతం ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఆస్టియోసార్కోమా బాధితులకు కీమోథెరఫీ, సర్జరీ చేసినప్పటికీ వ్యాధి నుంచి కోలుకునే అవకాశాలు పెరగడం లేదు. దీంతో ఈ కొత్త చికిత్స విధానం ఆశాజనకంగా మారింది. త్వరలోనే దీనికి సంబంధించి ట్రయల్స్ నిర్వహిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.

కదులుతున్న కారులో దళిత బాలికపై గ్యాంగ్ రేప్

యూపీలో దారుణం

మథుర, సెప్టెంబర్ 20: కదులుతున్న కారులో ముగ్గురు వ్యక్తులు ఒక దళిత బాలిక(13)పై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఎస్పీ(గ్రామీణ) త్రిగుణ్ బైసెన్ కథనం ప్రకారం అల్పాహారానికి కావాల్సిన సరకులు కొనడానికి గురువారం బాలిక ఇంటి పక్కన ఉన్న దుకాణానికి వెళ్లింది. అక్కడ నీరజ్ అనే వ్యక్తి ఆమెకు మత్తు మందు కలిపిన నీళ్లు తాగడానికి ఇచ్చాడు. ఆ తర్వాత బాలిక మైకంతో పడిపోగానే ఆమెను నీరజ్, అతడి సహచరుడు కారులో తీసుకెళ్లి లైంగిక దాడి చేసి ఆమెను బర్సానా రోడ్‌లోని ఫ్లైఓవర్ కింద పడేశారు.

బార్ ఎగ్జామ్‌కు ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులకు అనుమతి

న్యూఢిల్లీ: ఆలిండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబీఈ)ని రాసేందుకు ఎల్‌ఎల్‌బీ ఫైనలియర్ విద్యార్థులను ఈ ఏడాది అనుమతించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ)ని సుప్రీం కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 2023లో ఈ అంశంపై ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఏఐబీఈ నిబంధనలను బీసీఐ రూపొందించలేదని తెలుసుకుని ధర్మాసనం అవాక్కయింది. 9 మంది విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ పరీక్ష నవంబరు 24న జరుగుతుంది.

నిజ నిర్ధారణ యూనిట్‌కు చెక్!

- కేంద్ర ప్రభుత్వానికి బొంబాయి హైకోర్టు షాక్
- ఐటీ చట్టానికి చేసిన సవరణలను కొట్టివేసిన న్యాయస్థానం
- ఆన్‌లైన్ వార్తలను తొక్కి పెట్టాలనుకున్న కేంద్రానికి చుక్కెదురు



ముంబై: ఆన్‌లైన్‌లో వచ్చే ఫేక్ న్యూస్‌ను గుర్తించేందుకు ఫ్యాక్ట్ చెక్ (నిజ నిర్ధారణ) యూనిట్‌లను ఏర్పాటు చేయాలనుకున్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నానికి బొంబాయి హైకోర్టు చెక్ పెట్టింది. కేంద్ర ప్రభుత్వం ఐటీ చట్టానికి చేసిన సవరణలను కొట్టివేసింది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 19కి విరుద్ధమని జస్టిస్ ఏఎస్ చందూర్కర్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ సవరణ నిబంధనలు, 2023 ప్రకారం ఆన్‌లైన్‌లో వచ్చే బోగస్ న్యూస్‌ను గుర్తించేందుకు కేంద్రం నిజ నిర్ధారణ యూనిట్‌లను ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశాన్ని అత్యంత క్షుణ్ణంగా పరిశీలించానని, ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 19 (భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం), ఆర్టికల్ 19 (1)(జీ) (వృత్తి స్వేచ్ఛ, హక్కు)ను ఉల్లంఘించేవిగా ఉన్నాయని జస్టిస్ చందూర్కర్ పేర్కొన్నారు. ఐటీ నిబంధనల్లోని 'బోగస్, తప్పుడు, తప్పుదోవ పట్టించే' అనే మాటలకు ఎటువంటి నిర్వచనం లేని నేపథ్యంలో అవి అస్పష్టంగాను, తప్పుగాను ఉన్నాయన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన బొంబాయి హైకోర్టు ధర్మాసనం ఈ ఏడాది జనవరిలో భిన్నమైన తీర్పునిచ్చింది. దీంతో కేసు మూడో న్యాయమూర్తి వద్దకు వచ్చింది. ఐటీ చట్టాన్ని సవరిస్తూ కేంద్రం ప్రతిపాదించిన నిబంధనలు వార్తలపై సెన్సార్ విధించేలా ఉన్నాయని జస్టిస్ పటేల్ పేర్కొనగా, ఆ నిబంధనల వల్ల వాక్ స్వాతంత్ర్యానికి వచ్చిన నష్టమేమీ లేదని జస్టిస్ గోఖలే అన్నారు. దీంతో జస్టిస్ చందూర్కర్ వచ్చిన ఈ కేసులో ఆయన శుక్రవారం తుది తీర్పునిచ్చారు.

వాక్ స్వాతంత్ర్యంపై ఆంక్షలు

కేంద్రం ప్రతిపాదించిన నిబంధనల వల్ల భావప్రకటనా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యంపై అకారణంగా ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని కమెడియన్ కునాల్ కామ్రాతో పాటు మరికొందరు పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వార్తలపై ప్రభుత్వం సెన్సార్ విధించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ వార్తలకు ప్రభుత్వమే 'ప్రాసిక్యూటర్‌గా, జడ్జిగా, తీర్పును అమలుచేసే అధికారి'గా వ్యవహరించే అధికారం ఈ నిబంధనల వల్ల లభిస్తుందని పేర్కొన్నారు.



పేజర్ పేలుళ్లకు కేరళ లింకు!

న్యూఢిల్లీ: లెబనాన్‌లో పేజర్ల పేలుళ్ల సంఘటనలో కేరళ వ్యక్తి రిన్‌సన్ జోస్ (37) ప్రమేయంపై దర్యాప్తు జరుగుతున్నది. ఆయన కేరళలోని వయనాడ్‌కు చెందిన వారు. ప్రస్తుతం నార్వేజియన్ పౌరుడు. ఆయన బల్గేరియన్ కంపెనీ నోర్టా గ్లోబల్ లిమిటెడ్‌కు ఏకైక యజమానిగా రికార్డులు చెప్తున్నాయి. హెజ్బొల్లా ఉగ్రవాదులపై దాడుల్లో ఉపయోగించిన పేజర్లను సరఫరా చేసిన కంపెనీ ఇదే. దీనిపై బల్గేరియా దర్యాప్తు చేస్తున్నది. వయనాడ్ డిప్యూటీ ఎస్పీ (స్పెషల్ బ్రాంచ్) పీఎల్ షిజు మాట్లాడుతూ, లెబనాన్ పేలుళ్లలో రిన్‌సన్ ప్రమేయంపై వార్తలు వచ్చిన తర్వాత ఆయన గురించి సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. లెబనాన్ వ్యాప్తంగా జరిగిన పేజర్ల పేలుళ్లలో 12 మంది మరణించగా, సుమారు 3,000 మంది గాయపడిన సంగతి తెలిసిందే. రిన్‌సన్ పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చేశారు. ఓస్లో మెట్రోపాలిటన్ విశ్వవిద్యాలయంలో సోషల్ వెల్ఫేర్ అండ్ హెల్త్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ చేశారు.

యుద్ధం అంచున ఇజ్రాయెల్ - లెబనాన్

- పేజర్ల పేలుళ్లతో ఉద్రిక్తతలు తీవ్రం
- ప్రతిదాడి తప్పదన్న హెజ్బొల్లా
- ఇజ్రాయెల్‌పైకి రాకెట్ల వర్షం
- బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి
- హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం సహా 8 మంది మృతి



బీరుట్‌లో ఇజ్రాయెల్ దాడి వల్ల దెబ్బ తిన్న ఓ భవనాన్ని పరిశీలిస్తున్న ప్రజలు

జెరూసలేం, సెప్టెంబర్ 20: ఇజ్రాయెల్ – లెబనాన్ సరిహద్దుల్లో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌లో జరిగిన పేజర్లు, వాకీటాకీల పేలుళ్లతో ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ పేలుళ్లు ఇజ్రాయెల్ పనేనని ఆరోపించిన హెజ్బొల్లా ప్రతిదాడులు తప్పవని హెచ్చరించిన తర్వాత పరిస్థితి మరింత క్షీణించింది. హెజ్బొల్లాను లక్ష్యంగా చేసుకుంటూ లెబనాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణులతో దాడులకు దిగింది. మరోవైపు హెజ్బొల్లా సైతం ఉత్తర ఇజ్రాయెల్‌పై రాకెట్ల వర్షం కురిపించింది. ఒకవైపు గాజాలో ఇజ్రాయెల్ – హమాస్ మధ్య యుద్ధం ముగుస్తుందని అంతా భావిస్తున్న తరుణంలో ఇజ్రాయెల్ – హెజ్బొల్లా మధ్య యుద్ధ పరిస్థితులు తలెత్తడం ఆందోళనకరంగా మారింది.

పరస్పరం దాడులు

లెబనాన్ రాజధాని బీరుట్‌పై గురువారం నుంచి ఇజ్రాయెల్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నది. దక్షిణ బీరుట్‌లోని జేమస్ స్ట్రీట్ ప్రాంతంలో ఓ భవనంపై జరిగిన దాడిలో అనేక మంది గాయపడ్డారు. క్ఫర్ కిలా పట్టణంలోని హెజ్బొల్లా శిబిరంపైనా దాడి చేసింది. ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఇబ్రహీం అఖిల్ సహా ఎనిమిది మంది మరణించారని, 59 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. మరోవైపు ఇజ్రాయెల్‌పై శుక్రవారం 140 కత్యూషా రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్ వాయు రక్షణ కేంద్రాలతో పాటు సైనిక బ్రిగేడ్ కేంద్రంపై దాడి చేసినట్టు చెప్పింది. గోలన్ హైట్స్, సఫేర్, అప్పర్ గలిలీ ప్రాంతంలో హెజ్బొల్లా దాడి చేసినట్టు ఇజ్రాయెల్ నిర్ధారించింది. ఈ పరస్పర దాడుల్లో ఇరువైపులా భారీగానే ఆస్తినష్టం జరిగిందని, పదుల సంఖ్యలో గాయపడ్డారని స్థానిక మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

యుద్ధం తప్పదు: ఇజ్రాయెల్

అక్టోబరు 8 నుంచి ఇజ్రాయెల్ – హెజ్బొల్లా మధ్య దాడులు జరుగుతున్నప్పటికీ ఇప్పుడు యుద్ధం అంచుకు చేరాయి. పేజర్ల పేలుడు ఇజ్రాయెల్ చేసిన యుద్ధ ప్రకటనే అని హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ హస్సన్ నస్రల్లా వ్యాఖ్యానించగా, ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన ప్రజలను తిరిగి వారి ఇండ్లకు చేర్చేందుకు యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జాగ్ వ్యాఖ్యానించడం యుద్ధానికి ఇరువైపులా సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది. గాజా నుంచి పెద్ద ఎత్తున సైనికులను లెబనాన్ సరిహద్దు వైపు ఇజ్రాయెల్ మోహరిస్తున్నది. హెజ్బొల్లా కూడా యుద్ధానికి సన్నద్ధమవుతున్నది. గోలన్ హైట్స్, ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాల్లో గుమిగూడొద్దని, సురక్షిత ప్రాంతాలకు చేరువగా ఉండాలని ప్రజలకు ఇజ్రాయెల్ సూచించింది.

శ్రీలంక సారథి ఎవరు?

అధ్యక్ష పదవికి నేడు ఎన్నిక

కొలంబో, సెప్టెంబర్ 20: ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకలో శనివారం దేశాధ్యక్ష పదవికి ఎన్నిక జరగనుంది. మొత్తం 38 మంది అభ్యర్థులు ఈ ఎన్నికలో పోటీ పడుతున్నారు. దాదాపు 1.70 కోట్ల మంది ప్రజలు నేరుగా ఓటు వేసి అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు. ఒక్కో ఓటరు ముగ్గురికి ఓటు వేయవచ్చు. 50% ఓట్లు దక్కించుకున్న అభ్యర్థి విజయం సాధిస్తారు. శ్రీలంక అధ్యక్ష పదవి కోసం 38 మంది పోటీ పడుతున్నప్పటికీ ప్రధాన పోటీ మాత్రం ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, అనుర కుమార దిస్సనాయకే, సజిత్ ప్రేమదాస మధ్యనే నెలకొన్నది.

బస్సు లోయలో పడి నలుగురు జవాన్లు మృతి

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు బీఎస్‌ఎఫ్ జవాన్లు మృతి చెందగా, 28 మందికి పైగా గాయపడ్డారు. బుద్గాం జిల్లాలో శుక్రవారం భద్రతా దళాలను తీసుకువెళ్తున్న బస్ బ్రిల్ బుద్గాం గ్రామ సమీపంలో అదుపుతప్పి లోయలో పడటంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు, పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను దవాఖానలకు తరలించారు. జమ్ముకశ్మీర్‌లో ఈ నెల 25న జరిగే రెండో విడత ఎన్నికల బందోబస్తుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

హైకోర్టు జడ్జి వ్యాఖ్యలపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ: కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేదవ్యాసచార్ శ్రీషానంద గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన రెండు వీడియోలపై స్పందించింది. ఓ వీడియోలో శ్రీషానంద ఓ మహిళా న్యాయవాదిని మందలిస్తున్నట్లు, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు వినిపించింది. మరొక వీడియోలో, ఆ జడ్జి బెంగళూరులోని ముస్లిం మెజారిటీ ప్రాంతాన్ని పాకిస్థాన్‌గా అభివర్ణించినట్లు కనిపించింది. సీనియర్ అడ్వకేట్ ఇందిరా జైసింగ్ ఎక్స్ వేదికగా సీజేఐ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లారు. దీంతో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల ధర్మాసనం శుక్రవారం ఉదయం సమావేశమైంది. రెండు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కర్ణాటక హైకోర్టును ఆదేశించింది. వచ్చే బుధవారం దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపింది. ఇటువంటి విషయాలపై మార్గదర్శకాలను జారీ చేస్తామని చెప్పింది.

కొలీజియం.. సెర్చ్ కమిటీ కాదు

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకం కోసం సిఫారసు చేసే కొలీజియం అంటే సెర్చ్ కమిటీ కాదని సుప్రీంకోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. హైకోర్టు న్యాయమూర్తులుగా నియామకం కోసం కొలీజియం పునరుద్ఘాటించిన అభ్యర్థుల పేర్లను, వారిలో కేంద్ర ప్రభుత్వం ఆమోదం లభించనివారి పేర్లను వచ్చే బుధవారం నాటికి సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కొలీజియం తన నిర్ణయాన్ని పునరుద్ఘాటించినపుడు, దానిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం సంప్రదాయమని తెలిపింది. కొలీజియంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ మోస్ట్ జడ్జిలు ఉంటారు. కొలీజియం పునరుద్ఘాటించిన పేర్లను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ, నిర్ణీత వ్యవధిలోగా కొలీజియం సిఫారసులను ఆమోదించకపోతే, ఆ వ్యవధి తర్వాత ఆ సిఫారసుకు ఆమోదం లభించినట్లుగానే పరిగణించే నిబంధన ఉండాలన్నారు. అడ్వకేట్ హరీశ్ విభోర్ సింఘాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. జార్ఖండ్ ప్రభుత్వం దాఖలు చేసిన మరొక పిటిషన్‌లో తమ రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎంఎస్ రామచంద్ర రావును నియమించాలని కొలీజియం సిఫారసు చేసిందని, దానిని ఆమోదించనందుకు కేంద్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టాలని కోరింది. జార్ఖండ్ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ మాట్లాడుతూ, ఒరిస్సా హైకోర్టు జడ్జి డాక్టర్ జస్టిస్ బీఆర్ సారంగిని జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం చాలా ముందుగానే సిఫారసు చేసిందని, కానీ కేంద్ర ప్రభుత్వం ఆయన పదవీ విరమణకు 15 రోజుల ముందు మాత్రమే ఆమోదం తెలిపిందని చెప్పారు. ఇది చాలా తప్పు అని వ్యాఖ్యానించారు.

ఆఖరి నిమిషంలో పరీక్ష పద్ధతిలో మార్పులా?

ఆఖరి నిమిషంలో నీట్-పీజీ 2024 పరీక్ష ప్యాటర్న్‌ను మార్పు చేయడానికి కారణమేమిటని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎన్‌బీఈ)ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఇది అసాధారణ విషయమని, దీని కారణంగా విద్యార్థులు పరీక్షలో వైఫల్యం చెందే అవకాశం ఉందని పేర్కొంది. విద్యార్థుల తరఫున న్యాయవాదులు విభా దత్త మహిజ, తన్వీ దుబే దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. దీనిపై వారంలోగా సమాధానం ఇవ్వాలని ఎన్‌బీఈ, కేంద్రాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఆగస్టు 11న జరిగిన నీట్-పీజీ పరీక్షల్లో పరీక్షా విధానం, మార్కుల నార్మలైజేషన్ తదితరమైనవి ఆఖరి నిమిషంలో మార్పులు చేశారని, దీని కారణంగా తాము ఇబ్బందులు ఎదుర్కొన్నామని పిటిషనర్లు ఆరోపించారు.

ఆర్మీ అధికారికి కాబోయే భార్యపై పోలీసుల లైంగిక వేధింపులు

- కాళ్లూ చేతులు కట్టేసి, బట్టలిప్పి చితకబాదిన వైనం
- ఒడిశా పోలీస్ స్టేషన్‌లో దారుణం

భువనేశ్వర్: బీజేపీ పాలిత ఒడిశాలో దారుణం చోటుచేసుకుంది. పోకిరీల నుంచి కాపాడమంటూ ఆర్మీ అధికారి అయిన కాబోయే భర్తతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోయిన ఒక మహిళా న్యాయవాది పట్ల పోలీసులు కర్కశంగా ప్రవర్తించారు. ఆమెను జుట్టుపట్టుకుని కొట్టి, కాళ్లూ, చేతులు కట్టేసి దారుణంగా హింసించడమే కాక, ఆమె బట్టలను ఊడదీసి లైంగికంగా వేధించారు. తర్వాత ఆమెపై తప్పుడు కేసు బనాయించి జైలుకు పంపారు. ఈ ఘటన ఈ నెల 15న జరుగగా, రిమాండ్ నుంచి విడుదలైన బాధితురాలి ఫిర్యాదుతో ఈ అమానుష కాండ వెలుగుచూసింది.

అసలేం జరిగింది?

రెస్టారెంట్ యజమాని, మహిళా న్యాయవాది అయిన 32 ఏండ్ల మహిళ ఆర్మీ కెప్టెన్, కాబోయే భర్తతో ఈ నెల 15న రెస్టారెంట్ మూసి బయటకు వస్తుండగా, కొందరు పోకిరీలు వేధించారు. దీంతో వారు వెంటనే భరత్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వడానికి ప్రయత్నించారు. అక్కడ సివిల్ దుస్తుల్లో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్ వారితో అనుచితంగా ప్రవర్తించింది. ఆర్మీ అధికారిని పోలీసులు అకారణంగా బంధించారు. ఇదేమని ప్రశ్నించిన ఆ మహిళను కొట్టడం ప్రారంభించారు. ఆమె కాళ్లు, చేతులు కట్టేయడానికి ప్రయత్నించారు. దీంతో ప్రతిఘటించిన ఆమె ఆత్మరక్షణకు కానిస్టేబుల్ చేతిని కొరికింది. దాంతో ఆమెను బంధించి లాకప్‌లో పడేశారు. మర్నాడు ఉదయం స్టేషన్‌కు వచ్చిన ఇన్‌స్పెక్టర్ ఆమె ఛాతిపై, శరీరంపై తన్నడం ప్రారంభించాడు. చాలా సేపు ఆమెను కొట్టి, ఆమె ప్యాంట్‌ను ఊడదీశాడు. తర్వాత తన ప్యాంట్ కూడా కిందకు లాగి అతని ప్రైవేట్ పార్టును చూపిస్తూ ఎంతసేపు నీవు మౌనంగా ఉండగలవు అంటూ దూషించాడు. తర్వాత మహిళా కానిస్టేబుల్‌ను కొట్టిందని ఆమెపై తప్పుడు కేసు నమోదు చేసి కోర్టుకు పంపడంతో రిమాండ్ విధించారు. తర్వాత ఆమెకు బెయిల్ రావడంతో పోలీస్ స్టేషన్‌లో తనపై జరిగిన దారుణంపై ఫిర్యాదు చేసింది. బాధ్యులైన పోలీసులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.



అమెరికాకు చెందిన కంప్యూటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ విద్యార్థిని ధ్రువి పటేల్‌ను మిస్ ఇండియా వరల్డ్ వైడ్-2024 విజేతగా ప్రకటించారు. 'మిస్ ఇండియా వరల్డ్ వైడ్‌గా గెలుపొందడం అద్భుతమైన గౌరవం. ఇది కిరీటం కంటే ఎక్కువ. ఇది నా వారసత్వాన్ని, విలువలను ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఇతరులకు స్ఫూర్తిని ఇచ్చేందుకు అవకాశం' అని న్యూజెర్సీలోని ఎడిసన్‌లో కిరీట ధారణ జరిగాక ధ్రువి అన్నారు. మిసెస్(శ్రీమతి) ఇండియా వరల్డ్ వైడ్ కిరీటాన్ని ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన సుయెన్ మౌటెట్ కైవసం చేసుకున్నారు. కిశోర బాలికల(టీన్) విభాగంలో గ్వాడెలోప్(ఫ్రాన్స్‌కు చెందిన ద్వీపం)కు చెందిన సియెర్రా సూరెట్ మొదటి స్థానంలో నిలిచారు.

శ్రీవారి లడ్డూ కల్తీపై నివేదికివ్వండి

ఏపీ సర్కారును కోరిన కేంద్రం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: తిరుమల శ్రీవారి మహాప్రసాదం లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన కల్తీ నెయ్యి వాడినట్టు వచ్చిన ఆరోపణలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ సర్కారును కేంద్ర మంత్రి నడ్డా కోరారు. ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతో తాను మాట్లాడానని, వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపాలని కోరానన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు, ఈ ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు అవసరమని, దోషులకు తగిన శిక్ష పడాల్సిందేనని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. కల్తీ నెయ్యి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ డిమాండ్ చేశారు. ఇది కేవలం కుంభకోణమే కాదని, హిందూయిజం నాశనానికి జరిపిన కుట్రగా ఆయన అభివర్ణించారు.

క్షమించరాని నేరం

: అయోధ్య ఆలయ ప్రధాన అర్చకులు

తిరుమల నెయ్యి కల్తీపై అయోధ్య ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఒక వేళ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలవడం నిజమైతే అది క్షమించరాని నేరం. దానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని ఆయన డిమాండ్ చేశారు. 'వైష్ణవులు, కొందరు భక్తులు కనీసం వెల్లుల్లి, ఉల్లిపాయ కూడా ముట్టరు. అలాంటి పరిస్థితుల్లో నెయ్యిలో కొవ్వు కలిపారనడం నిజంగా దురదృష్టకరం. ఇది హిందువుల విశ్వాసాలను ఎగతాళి చేయడమే' అని అన్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్

తిరుమల కల్తీ నెయ్యి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తిరుమల లడ్డూ కల్తీతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకుని హిందువుల మతపరమైన హక్కులను కాపాడాలని సత్యం సింగ్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.



దిబ్రూగఢ్ చెక్‌పోస్ట్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం గురువారం మూసేయడంతో ఎన్‌హెచ్-19పై బారాకర్ వంతెన నుంచి మైథోన్ వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. జార్ఖండ్‌ను కాపాడుకోవడం కోసం దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ దాని రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేస్తున్నదని, ఫలితంగా తమ రాష్ట్రంలో వరదల ముప్పు ఏర్పడిందని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

'స్టార్ హెల్త్'పై హ్యాకర్ల పంజా

న్యూఢిల్లీ: దిగ్గజ ఆరోగ్య బీమా సంస్థల్లో ఒకటైన 'స్టార్ హెల్త్'పై హ్యాకర్లు పంజా విసిరారు. ఆ కంపెనీకి చెందిన 3.1 కోట్ల మందికిపైగా కస్టమర్ల డాటాను తస్కరించారు. కస్టమర్ల పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, మెడికల్ రిపోర్టులు, ఇతర వ్యక్తిగత వివరాలతో కూడిన ఆ సున్నిత సమాచారాన్ని ప్రముఖ మెసేజింగ్ యాప్ 'టెలిగ్రామ్'లోని చాట్‌బాట్స్ ద్వారా ఉచితంగా అందుబాటులో ఉంచారు. 'టెలిగ్రామ్'లో నేరపూరిత కార్యకలాపాలను అనుమతిస్తున్నారన్న ఆరోపణలతో ఇటీవల ఆ యాప్ వ్యవస్థాపకుడిని అరెస్టు చేసిన కొద్ది రోజులకే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని 'జెన్‌జెన్' అనే టెలిగ్రామ్ చాట్‌బాట్ సృష్టికర్త బ్రిటన్‌కు చెందిన సెక్యూరిటీ రిసెర్చర్ జాసన్ పార్కర్‌కు చెప్పడంతో అతడు ఆ అంశాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లాడు. దీనిపై 'స్టార్ హెల్త్' స్పందిస్తూ సమస్యను పరిష్కరించేందుకు దర్యాప్తు సంస్థలతో కలిసి పనిచేస్తున్నట్టు తెలిపింది.

కోర్టులపై నిందలా?

సీబీఐకి సుప్రీం మొట్టికాయలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: కోర్టులపై నిందారోపణలు చేసినందుకు సీబీఐకి శుక్రవారం సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. బెంగాల్‌లో 2021 ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్ల కేసులను రాష్ట్రం వెలుపల విచారణ జరిపించాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్‌లు ఎస్ ఓకా, పంకజ్ మిథల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. 'మీరు ఏ ఉద్దేశంతో కేసును దాఖలు చేశారు. యావత్ న్యాయ వ్యవస్థపై ఎందుకు నిందలు వేస్తున్నారు? మీ అధికారులకు అక్కడ ఉన్న న్యాయాధికారో, లేదా ఆ రాష్ట్రమో నచ్చకపోవచ్చు. అంతేకానీ యావత్ న్యాయవ్యవస్థ పనిచేయడం లేదని అనవద్దు. దీనిపై జడ్జీలు, జిల్లా జడ్జీలు, సివిల్ జడ్జీలు ఇక్కడకు వచ్చి తమను సమర్థించుకోలేరు' అంటూ సీబీఐ తరఫున హాజరైన అడిషనల్ సోలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో కేసు బదిలీ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు ఆయన ధర్మాసనానికి తెలిపారు.

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శనివారం SATURDAY 21.9.2024

హైదరాబాద్ HYDERABAD

పేజీలు: 16 + 4
Pages: 16 + 4

సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 107 ‖ వెల (Price) రూ.6.50

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com
/ntdailyonline

తిరుమల లడ్డూపై దుమారం



100 రోజుల వైఫల్యం నుంచి దృష్టి మళ్లించేందుకే బాబు కట్టుకథ : జగన్

నాణ్యత లోపం నిజమే: టీటీడీ ఈవో

› 6

చిరంజీవికి అక్కినేని జాతీయ పురస్కారం



› 10

మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీలు!



కాళేశ్వరం కూలిందన్నరు.. మరి ఈ నీళ్లన్నీ ఎక్కడివి?

- కాంగ్రెస్ ప్రభుత్వానిది దుష్ప్రచారమని తేలిపోయింది.. వరదలను, బురద రాజకీయాలనూ తట్టుకున్న కాళేశ్వరం
- కాంగ్రెస్ నేతలు మూర్ఖపు మాటలు మానుకోవాలి.. కేసీఆర్ కట్టించిన కాళేశ్వరమే నేడు రాష్ట్రానికి రక్ష : హరీశ్
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నేతలతో కలిసి మల్లన్నసాగర్ సందర్శన.. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

శుక్రవారం మల్లన్నసాగర్ వద్ద బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కాళేశ్వరజలాల రాకను పరిశీలిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

› 2

చెరువుల మ్యాపులు తప్పుల తడక

- జియో కోఆర్డినేషన్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల మార్పు
- హెచ్ఎండీఏ పరిధిలో మారిన చెరువుల స్వరూపం
- పౌరహక్కుల నేతల అధ్యయనంతో వెలుగులోకి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలో చెరువుల బఫర్ జోన్, ఎఫ్టీఎల్ నిర్ధారణ గందరగోళంగా మారుతున్నది. నిర్ణీత గడువులోగా హైకోర్టుకు నగరంలో మిగిలిన చెరువులు, కుంటల భౌతిక స్వరూపం, శాస్త్రీయపరమైన జియో కోఆర్డినేషన్ పాయింట్లతో కూడిన జాబితాను నివేదించాల్సి ఉన్నది. ఈ క్రమంలో ప్రభుత్వ హడావుడితో చెరువుల నిర్ధారణ విషయంలో తప్పులకు దారితీస్తున్నది. ప్రాథమిక, ఫైనల్ నోటిఫికేషన్లలో పొందుపరుస్తున్న చెరువుల వివరాలన్నీ మార్పిడి జరిగినట్టుగా పౌరహక్కుల నేతలు ఆరోపిస్తున్నారు. బఫర్, ఎఫ్టీఎల్, జియో కోఆర్డినేషన్ అంశాల్లో మార్పిడి చేసి కొత్త మ్యాపులను అప్‌లోడ్ చేయడంతో మరిన్ని సమస్యలు ముంచుకొచ్చే ప్రమాదం ఉన్నది. ముఖ్యంగా మ్యాపుల జియో కోఆర్డినేషన్ పాయింట్లు మారిపోవడంతో ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల స్థలాలు తగ్గే ప్రమాదం ఉన్నదని, దీంతో గతంలో ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూడా ఇప్పుడు సక్రమం అయ్యే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల నోటిఫికేషన్‌పై కసరత్తు జరుగు



తున్న తరుణంలో రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ లేక్ ప్రొటెక్షన్ కమిటీలో ఉన్న విభాగాల తప్పిదాలు.. చెరువు భూములకు చేటుచేసేలా ఉన్నాయి. ముఖ్యంగా మ్యాపుల తయారీ సమయంలో జరుగుతున్న మార్పులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో హెచ్ఎండీఏ పరిధిలో లేక్ మ్యాపుల్లో జరుగుతున్న తప్పిదాలను లేవనెత్తుతూ పౌర హక్కుల నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తప్పుల తడకగా చెరువు మ్యాపులను రూపొందించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మ్యాపుల నిర్వహణలో › 6వ పేజీలో

ఏ పద్ధతిన ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారిస్తారు?

› 6

- అందుకు అనుసరించే విధానాలేమిటి?
- నిబంధనలేమైనా ఉంటే సమర్పించండి
- దుర్గంచెరువుపై సర్కారుకు హైకోర్టు ఆదేశం



ఇండ్ల అమ్మకాలు ఢమాల్!



హైదరాబాద్‌లో 42 శాతం సేల్స్ డౌన్

ఈ జూలై-సెప్టెంబర్‌పై ప్రాప్ఈక్విటీ అంచనా

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: గతమెంతో ఘనం అన్నట్టుగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం తయారైందా? అంటే అవుననే సమాధానమే వస్తున్నదిప్పుడు. ప్రముఖ రియల్ ఎస్టేట్ డాటా అనలిటిక్ సంస్థ ప్రాప్ఈక్విటీ శుక్రవారం విడుదల చేసిన అంచనాలను చూస్తే ఇదే అర్థమవుతున్నది మరి. దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ప్రస్తుత జూలై-సెప్టెంబర్ త్రైమాసికం ఇండ్ల అమ్మకాలపై ప్రాప్ఈక్విటీ ఓ రిపోర్టును విడుదల చేసింది. దీని ప్రకారం 42 శాతం క్షీణతతో హైదరాబాద్ నగరం ముందుండటం గమనార్హం. ఆ తర్వాత బెంగళూరు (26 శాతం), కోల్‌కతా (23 శాతం), పుణె (19 శాతం), చెన్నై (18 శాతం), ముంబై (17 శాతం), థానె (10 శాతం) ఉన్నాయి. ఢిల్లీ ఎన్సీఆర్‌లో 22 శాతం, నవీ ముంబైలో 4 శాతం చొప్పున పెరిగే వీలున్నట్టు పేర్కొన్నది. కాగా, మొత్తం ఈ 9 నగరాల్లో ఈ జూలై-సెప్టెంబర్‌లో ఇండ్ల విక్రయాలు 1,04,393 యూనిట్లుగా ఉండొచ్చన్నది. నిరుడు ఇదే › 10వ పేజీలో

అమృత్ స్కీం.. టెండర్ల స్కాం

సీఎం బావమరిది, తమ్ముడి కంపెనీలకు అర్హత లేకున్నా 1,500 కోట్ల కాంట్రాక్టులు

- కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ జరపాలి
- లేదంటే కాంగ్రెస్‌తో భాగస్వామ్యం ఉన్నట్టే
- కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, టోచన్ సాహూకు మాజీ మంత్రి కేటీఆర్ లేఖ
- నిజాలు నిగ్గు తేల్చి టెండర్ల రద్దుకు డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం అమృత్ టెండర్లలో అవినీతికి పాల్పడిందని, వాటి నిజాలను నిగ్గు తేల్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, టోచన్ సాహూకు శుక్రవారం లేఖ రాశారు. అమృత్ టెండర్లలో జరిగిన అవకతవకలపై బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలన్నీ అనేకసార్లు డిమాండ్ చేసినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదని పేర్కొన్నారు. అమృత్ పథకంలో భాగంగా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో దాదాపు రూ.1500 కోట్ల టెండర్లు సీఎం సొంత బావమరిది సృజన్‌రెడ్డి కంపెనీకి అర్హతల్లేకున్నా కట్టబెట్టారని, దీనిపై వెంటనే విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. టెండర్ల తాలూకు సమాచారం బయటకు పొక్కకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చీకటి ఒప్పందాలు చేసుకున్నదని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా సమాచారం ఇవ్వడం లేదని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమంత్రి బావమరిది భాగస్వామిగా ఉన్నారని పేర్కొన్నారు. అమృత్ పథకంలో తొమ్మిది నెలలుగా జరిగిన ప్రతి టెండర్‌ను సమీక్షించి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన టెండర్లను రద్దు చేయాలని, పథకంలో అవినీతిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అనుభవం, అర్హతల్లేకున్నా కేవ లం ముఖ్యమంత్రి బంధువు అనే సాకుతో రాష్ట్ర › 6వ పేజీలో

గాంధీ ఘటనపై నిజనిర్ధారణకు రాజయ్య నేతృత్వంలో కమిటీ

- ముగ్గురు డాక్టర్-లీడర్స్‌తో బీఆర్ఎస్ కమిటీ
- రాష్ట్రంలో వైద్యారోగ్య స్థితుగతులపైనా పరిశీలన

› 3



› 2

బీసీ డిక్లరేషన్ అమలు చేసేదాకా పోరు

- బీసీల పోరాట ఫలితంగానే మహేశ్‌కుమార్‌కు పదవి.. వారిని కాంగ్రెస్ కేవలం ఓటర్లుగానే చూసింది
- బడుగులకు అన్యాయం చేస్తే ప్రతిఘటన తప్పదు.. మండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి



గౌలిదొడ్డి కళాశాల ఎదుట శుక్రవారం తమ ఆందోళనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో విద్యార్థుల తల్లిదండ్రుల వాగ్వాదం

గౌలిదొడ్డి గోస మళ్లీ మొదటికి

- ఈ సారి రోడ్డెక్కిన గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులు
- సీనియర్ ఫ్యాకల్టీని కొనసాగించాలంటూ ఆందోళన
- ఇదే విషయమై ఆగస్టులో కళాశాల విద్యార్థుల నిరసన
- అప్పుడు దిగివచ్చి నిర్ణయం వెనక్కి తీసుకున్న సర్కార్
- ఫ్యాకల్టీని వేధించి పంపుతున్నారని తాజాగా విమర్శలు

› 6

శబ్ద కాలుష్యాన్ని వెదజల్లుతున్న పబ్బులపై చేపట్టిన చర్యలేమిటి?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు


హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శబ్ద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న పబ్బులపై చేపట్టిన చర్యలేమిటో తెలియజేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి రాయదుర్గ్‌లోని రెడ్ రైనో పబ్, పోస్ట్‌కార్డ్ రెస్టారెంట్, గ్లోబల్ తపస్ బార్‌ల నుంచి వెలువడుతున్న శబ్ద కాలుష్యం ఆ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నదంటూ బర్కత్‌పురాకు చెందిన ఆనంద్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఆ పబ్బులకు జారీ చేసిన అనుమతులను రద్దు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. అధికారులకు నోటీసులు జారీచేసి, తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

చర్లపల్లి జైలుకు జానీ మాస్టర్

14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మహిళా డ్యాన్సర్‌పై లైంగిక దాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు రాజేంద్రనగర్ కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చర్లపల్లి జైలుకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 19న గోవాలో జానీ మాస్టర్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. శుక్రవారం ఆయనను ఉప్పర్‌పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులో హాజరుపరిచారు. అంతకుముందు ఆయనకు గోల్కొండ ఏరియా హాస్పిటల్‌లో వైద్యపరీక్షలు జరిపించారు. కాగా, ఈ కేసు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పలు అంశాలను పొందుపరిచారు. నిందితుడు గత 4 ఏండ్ల నుంచి బాధితురాలిపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని, 2020లో తొలిసారి ముంబైలో లైంగిక దాడికి పాల్పడినప్పుడు బాధితురాలి వయస్సు 16 సంవత్సరాలేనని ఆ రిపోర్టులో పేర్కొన్నారు. జానీ మాస్టర్ భార్య కూడా బాధితురాలిని బెదిరించిందని, ఈ కేసులో జానీ మాస్టర్ తన నేరాన్ని అంగీకరించాడని తెలిపారు.



మల్లన్నసాగర్ కట్టపైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలతో ముచ్చటిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి

కాళేశ్వరం కొట్టుకుపోతే ఈ నీళ్లెక్కడివి?

ఇదిగో.. 21 టీఎంసీల మల్లన్నసాగరే సాక్ష్యం

- కాంగ్రెస్‌ది దుష్ప్రచారమని తేలిపోయింది
- వరదలనే కాదు, బురద రాజకీయాలనూ తట్టుకొని నిలబడ్డ కాళేశ్వరం
- మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మల్లన్నసాగర్ సందర్శన
- ఆటంకాలు సృష్టించిన పోలీసులు

సిద్దిపేట, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టు మీద చేస్తున్న దుష్ప్రచారం అంతా అబద్ధమేనని తేలిపోయిందని, ఇందుకు గోదావరి జలాలలతో నిండిన మల్లన్నసాగర్ రిజర్వాయరే నిదర్శనమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. భారీ వరదలనే కాదు, బురద రాజకీయాలను కూడా కాళేశ్వరం ప్రాజెక్టు తట్టుకొని నిలబడిందని చెప్పారు. ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి తొలిసారిగా 21 టీఎంసీల గోదావరి జలాలు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఆ ప్రాజెక్టును ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి మల్లన్నసాగర్‌ను సందర్శించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకపోతే మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని కాంగ్రెస్ నేతలను సూటిగా ప్రశ్నించారు. ఎల్లంపల్లి, లక్ష్మీబరాజ్, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ మీదుగా కొండపోచమ్మ వరకు ఇవ్వాళ గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భగంగా ఉండటం వల్లనే ఇది సాధ్యమైందని వివరించారు. నిండుకుండలా ఉన్న మల్లన్నసాగర్.. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం కాదా? అని ప్రశ్నించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో పాటు కాల్వలను కూడా 90% మేర బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తిచేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 10% పనులైన పిల్ల కాల్వలు, పంట కాల్వలను వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ మూర్ఖపు మాటలు మానుకోవాలి

కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకపోయిందన్న మూర్ఖపు మాటలను కాంగ్రెస్ నేతలు ఇకనైనా మానుకోవాలని హరీశ్‌రావు హితవు పలికారు. కేసీఆర్ కట్టించిన అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ ఇవన్నీ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమేనని వివరించారు. అన్నపూర్ణలో 3 టీఎంసీలు, రంగనాయక సాగర్‌లో 3 టీఎంసీలు, మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 10 టీఎంసీల నీళ్లు నింపుకోవడం చాలా సంతోషంగా ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్‌ది డైవర్షన్ పాలిటిక్స్ అయితే, బీఆర్ఎస్‌ది వాటర్ డైవర్షన్ అని చెప్పారు. బీఆర్ఎస్‌ది పంటలు పండించే రాజకీయమైతే.. కాంగ్రెస్‌ది రాజకీయ మంటలు మండించే రాజకీయం అని ఎద్దేవా చేశారు. 'నాడు మల్లన్నసాగర్ ప్రాజెక్టు కట్టేటప్పుడు అడ్డంపడ్డారు.. కోర్టుల్లో కేసులు వేసింద్రు.. ఇవ్వాళ సంతోషాన్ని పంచుకుందామని వస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నరు. కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టులో 21 టీఎంసీల నీళ్లు వచ్చాయనే సంతోషంతో పసుపు కుంకుమ వేసి ఆ గోదావరి జలాలకు దండం పెట్టుకుందామని వచ్చాం. దీనిని కూడా అడ్డుకుంటారా? ఈ నీళ్లతో మెదక్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పంటలు పండటం కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేదా?' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మల్లన్నసాగర్‌కు వచ్చి పసుపు కుంకుమ వేసి కొబ్బరి కాయకొడితే వారి పాపాలు తొలగిపోతాయని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ కట్టించిన కాళేశ్వరమే దిక్కు


'హైదరాబాద్‌కు మంచినీళ్లు తీసుకపోతా, మూసీకి నీళ్లు తీసుకపోతా అని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారు. సంతోషమే.. కానీ, అదెట్లా సాధ్యమైంది? దానికి కూడా కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం ప్రాజెక్టే కదా దిక్కు.. హైదరాబాద్‌కు నీళ్లు తీసుకపోవాలంటే మల్లన్నసాగరే కదా దిక్కు' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి జిల్లాను సస్యశ్యామలం చేశారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు మీద లక్ష కోట్లు వృధా అయ్యాయని, కాళేశ్వరం కొట్టుకుపోయిందని ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. వెంటనే అన్ని చెరువుల్లో, రిజర్వాయర్లలో చేపపిల్లలను వేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అత్యుత్సాహం

మల్లన్నసాగర్ రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు బృందంతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారు. వారిని మల్లన్నసాగర్ బండ్ మీదికి రానియ్యకుండా అడ్డంకులు సృష్టించారు. పంపులు పోసే వరకు పోయిన బృందాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఒకదశలో బీఆర్ఎస్ కార్యకర్తలపై, కొంతమంది మీడియా ప్రతినిధులపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి రాయలేని భాషలో దుర్భాషలాడారు. అంతేకాకుండా బీఆర్ఎస్ కార్యకర్తల గల్లా పట్టుకొని చేయి చేసుకున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన మరో కార్యకర్తతో కూడా దురుసుగా మాట్లాడారు. దీనిని చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కూడా చిటపటలాడారు. ఏసీపీతో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. 'అట్లా మాట్లాడొద్దు సార్' అంటూ తోటి సీఐలు చెప్పేందుకు ప్రయత్నించినా ఏసీపీ వినలేదు. బీఆర్ఎస్ బృందం వెళ్లేప్పుడు మల్లన్నసాగర్ కట్టపై ట్రాఫిక్‌ను కూడా క్లియర్ చేయలేదు. పోలీసులు చూస్తూ ఉండటంతో బీఆర్ఎస్ కార్యకర్తలే ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

> 'కేసీఆర్ కల ఫలించింది. మల్లన్నసాగర్‌కు తొలిసారిగా 21 టీఎంసీల నీళ్లు వచ్చాయి.. సముద్రాన్ని తలిపించేలా నిండుకుండలా, కన్నులపండువగా ఉన్నది. ఇవ్వాళ చాలా సంతోషంగా ఉన్నది. యాసంగి పంటకు ఢోకాలేదు. నాలుగు జిల్లాలకు అద్భుతంగా నీళ్లు రాబోతున్నాయి. చెరువుల్లో నీళ్లు నిండిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కింద పండే ప్రతి పంట మీద కేసీఆర్ పేరుఉంటది. ప్రతి రైతు గుండెలో కేసీఆర్ నిలబడి ఉంటడు.'
>
> -మాజీ మంత్రి హరీశ్‌రావు

లోకం పోకడ



ఒంటిపై కండువా వేయమంటారా? కట్టె వేయమంటారా తేల్చుకోమనండి.. వెళ్లండి!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.5°c	21.7°c
రంగారెడ్డి	38.2°c	21.1°c
మెదక్	37.2°c	21.0°c
నిజామాబాద్	34.4°c	24.3°c
హైదరాబాద్	34.2°c	24.2°c
నల్లగొండ	34.0°c	25.0°c
మహబూబ్‌నగర్	32.5°c	22.1°c
కరీంనగర్	32.0°c	25.0°c
వరంగల్	32.0°c	25.0°c
ఖమ్మం	31.0°c	24.0°c

సాగర్‌లో నీళ్లున్నా.. చెరువులు ఖాళీ

సర్కారు తీరుపై మంత్రి కోమటిరెడ్డి అసహనం

భట్టి, ఉత్తమ్ సమక్షంలోనే ప్రశ్నల వర్షం

ఏఎమ్మార్పీ నాలుగో మోటర్ ఆన్ చేయాలి

నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ఫుల్ లెవల్ నీళ్లున్నా.. ఒక్క చెరువు, కుంటకు నీళ్లొస్తలేవు. పోయిన ఎండాకాలంలోనే నీళ్ల లేక బోర్లు ఎండిపోయినయ్. తోటలు ఎండిపోయినయ్. ఈ సారి ఇక్కడ వర్షాలు సరిగ్గా పడలేదు. కర్ణాటకలో కురిసిన వర్షాలతో సాగర్‌కు నీళ్లొస్తున్నయ్. వచ్చిన నీళ్లతో చెరువులు నింపకుంటే ఎట్ల? ఏఎమ్మార్పీ నాలుగో మోటర్ ఇంకెప్పుడు నడుపుతరు? రైతులకు ఎప్పుడు నీళ్లిస్తరు? ఇవ్వాల్టి నుంచి ఫోర్త్ డే మోటర్ రన్ చేసి నీళ్లు ఇవ్వాల్సిందే. నేను చెప్తున్న.. సీఈ గారూ నీళ్లు ఇవ్వాల్సిందే' అని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.. తమ ప్రభుత్వ అసమర్థతపై అసహనం వ్యక్తంచేశారు. అది కూడా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలోనే ప్రశ్నించడం గమనార్హం. శుక్రవారం నల్లగొండ జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఎల్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాంతంలో సమీక్ష నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ఇరిగేషన్ ఈఎన్‌సీ అనిల్‌కుమార్ హాజరయ్యారు. వీరందరి సమక్షంలోనే మంత్రి కోమటిరెడ్డి ప్రభుత్వ అసమర్థతను ఒప్పుకొంటూ సీఈ అజయ్‌కుమార్‌ను నిలదీసినంత పనిచేశారు. వాస్తవంగా గత నెల 2న సాగర్ ఎడమ కాల్వతోపాటు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వకు, లోలెవల్ కెనాల్ ఆయకట్టుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెలికాప్టర్‌లో వచ్చిమరీ సాగునీటిని విడుదల చేశారు. కానీ నేటికీ ఏఎమ్మార్పీ, లోలెవల్ కెనాల్ ఆయకట్టులోని సుమారు 50 వేల ఎకరాల ఆయకట్టు సాగునీటికి నోచుకోలేదు. ఇందుకు ప్రధాన కారణం ఏఎమ్మార్పీ నాలుగు మోటర్లలో ఒక మోటర్ గత అక్టోబర్‌లో మరమ్మతుకు గురవడం. సాధారణంగా జూలై నాటికే మోటర్లను సిద్ధం చేసుకుని సాగర్‌కు నీరు రాగానే తోడిపోస్తారు. కానీ.. ఈ మోటర్ రిపేర్‌ను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. తీరా నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద మొదలైనప్పుడు ప్రభుత్వం హడావుడిగా మొదలుపెట్టింది. వెంటనే పూర్తి చేసి గత నెల 31 నాటికే నాలుగో మోటర్ రన్ చేసి సాగునీటిని సమృద్ధిగా అందిస్తామని ప్రకటించింది. నేటికీ ఆ మోటర్ వినియోగంలోకి రాలేదు. దీంతో లోలెవల్ కెనాల్‌తోపాటు ఏఎమ్మార్పీ డీ-37, 39, 40 పరిధిలోని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ఎదుట నిరసనలు చేస్తూ.. కనిపించిన ప్రతి అధికారికీ వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఫలితం లేదు. రైతుల ఆందోళనలతో మంత్రి కోమటిరెడ్డి తప్పనిసరి పరిస్థితుల్లో ప్రభుత్వ అసమర్థతను బయటపెట్టక తప్పలేదన్న వ్యాఖ్యలు సమావేశంలోనే వినిపించడం చర్చనీయాంశమైంది.

కులగణనపై రేపు అఖిలపక్ష సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కులగణనను సత్వరమే చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ హోటల్ అశోకాలో ఆదివారం అఖిలపక్ష పార్టీలు, కుల, బీసీ సంఘాలతో సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లోనూ 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షలు, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలనే డిమాండ్లపై చర్చించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని పార్టీలు, బీసీ కుల, ఉద్యోగ సంఘాల నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న మధుసూదనాచారి. చిత్రంలో జోగు రామన్న, పల్లె రవికుమార్

బీసీ డిక్లరేషన్ అమలుదాకా పోరాటం

- బీసీల పోరాట ఫలితంగానే మహేశ్‌కుమార్‌కు పీసీసీ అధ్యక్ష పదవి
- శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలుచేసే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని శాసనమండలిలో బీఆర్ఎస్ పక్ష నేత ఎస్ మధుసూదనాచారి తెలిపారు. బీసీలను కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ ఓటు బ్యాంకుగానే చూస్తున్నదని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్‌తో కలిసి శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడిగా వారంరోజులు కూడా కాని మహేశ్‌కుమార్‌గౌడ్.. దమ్ముందా? అని బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మాట్లాడటం తగదని హితవు పలికారు. బీసీల పోరాటం ఫలితంగానే ఆయనకు ఆ పదవి వచ్చిందనే విషయాన్ని మరువొద్దని సూచించారు. బీసీ డిక్లరేషన్‌పై ఒత్తిడి తేవడంతోనే ఆయనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించారని గుర్తుచేశారు. అన్ని పార్టీలు మారి కాంగ్రెస్‌లోకి వచ్చిన రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసిందని తెలిపారు. బీసీలకు ఏటా 20 వేల కోట్లు, ఐదేండ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో అందులో సగం కూడా కేటాయించలేదని విమర్శించారు. కేటాయించిన నిధులనూ ఖర్చు చేయడంలేదని ధ్వజమెత్తారు.బీసీలను ఓటు బ్యాంకుగా చూడొద్దని, అన్యాయం చేస్తే ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పలుకుబడి ఉంటే మహేశ్‌కుమార్‌గౌడ్ బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎంపై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

వెడ్మ బొజ్జు వ్యాఖ్యలు అనాగరికం

డీజీపీ చర్యలెందుకు తీసుకోవద్దు? బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): బీజేపీ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టు తల నరికి తీసుకొస్తే తన తండ్రి సంపాదించిన ఎకరం 38 గుంటల భూమిని రాసిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా, అనాగరికంగా ఉన్నాయని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. ఈ విషయంపై శుక్రవారం ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'ఈ ప్రకటన తెలంగాణలో అనాగరిక, నేరపూరిత సుపారీ, దిగజారుడు రాజకీయాలు, నాయకత్వానికి నిదర్శనం. రాహుల్‌పై బీజేపీ నేత వ్యాఖ్యలు నిస్సందేహంగా ఖండించదగినవే. ఓ వ్యక్తి తల నరికివేయమని ఒక ఎమ్మెల్యే బహిరంగంగా పిలుపునివ్వడాన్ని ఎలా సమర్థిస్తారు? ఒక తప్పును సమర్థించడానికి ఇంకొక తప్పు చేయకూడదు. ఈ విషయంలో రాహుల్‌గాంధీ నిర్లక్ష్యంగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని అనుకరించడం, అసభ్యకరమైన భాషను ఉపయోగించడంలో ఆంతర్యం ఏంటి? ఇది ఎలాంటి అక్రమం(జంగల్ రాజా)? ఒక ఎమ్మెల్యే ఐపీసీని ఉల్లంఘిస్తూ ఇలా హింసను ప్రేరేపించగలిగితే, డీజీపీ, తెలంగాణ పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదు.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ లింగయ్యయాదవ్. చిత్రంలో మల్లయ్యయాదవ్, భగత్

పంటలు ఎండుతున్నా పట్టించుకోరా?

- ఎడమ కాలువ గండి మరమ్మతులెప్పుడు?
- ప్రజల్ని గాలికొదిలి మంత్రి విహారయాత్రా?
- లింగయ్య యాదవ్, బొల్లం మల్లయ్య, నోముల భగత్ మండిపాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, నాగార్జునసాగర్ ఎడమ కాలువకు గండి పడి 20 రోజులైనా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు బొల్లం మల్లయ్య యాదవ్, నోముల భగత్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారీ వర్షాలతో చెరువులు, కాలువలకు పడిన గండ్లను పూడ్చకుండా రైతులకు నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. ఖమ్మంలో వరదలకు దెబ్బతిన్న కాలువలు, సాగర్ ఎడమ కాలువకు వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. పంటకు నీళ్లందక రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారని, ప్రజలను గాలికొదిలేసి మంత్రి ఉత్తమ్ కుటుంబంతో విహార యాత్రలు చేస్తున్నాడని విమర్శించారు. మంత్రి నియోజకవర్గంలో సర్కారు వైద్యులు అందుబాటులో లేక నర్సులే గర్భిణికి ప్రసవం చేయడం వల్ల శిశువు చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అడిగిన రైతులను అరెస్ట్ చేసి జైల్లో పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మంత్రులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకూ రైతుబంధు ఇస్తామని చెప్పి ఇప్పుడు కౌలు రైతు, యజమాని మాట్లాడుకోవాలని మంత్రి అం టున్నాడని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. హెలికాప్టర్‌ను వాడుకోవడంలో నల్లగొండ జిల్లా మంత్రులు పోటీ పడుతున్నారని, 25, 30 కిలోమీటర్లు కూడా హెలికాప్టర్‌లో పోతున్నారని ఎద్దేవాచేశారు.

హెరిటేజ్ జాతర.. 'విజయ'కు పాతర

III తరువాయి...

కలిసిపోవటం ఖాయమనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ సహకారంపై ఆధారపడే విజయ డెయిరీ.. హెరిటేజ్ వంటి రాజకీయ పలుకుబడి గల సంస్థతో పోటీపడటం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ డెయిరీల నుంచి పోటీని తట్టుకోలేక చతికిలపడిన విజయ డెయిరీకి హెరిటేజ్ పెట్టుబడులు శరాఘాతంగా మారటం ఖాయమన్న అభిప్రాయం వెల్లడి అవుతున్నది.

హెరిటేజ్‌కు రేవంత్ ప్రభుత్వ సహకారం?


ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మధ్య అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకోవాలనే సామెత చందంగా తెలంగాణలో తమ అనుకూల ప్రభుత్వం ఉన్నప్పుడే హెరిటేజ్ సంస్థను విస్తరించాలనే ఆలోచనలో సదరు సంస్థ ఉన్నట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే ఈ భారీ ప్లాన్ చేసినట్టు చర్చ జరుగుతున్నది. హెరిటేజ్ సంస్థకు రేవంత్ ప్రభుత్వం కూడా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అందుకే విజయ డెయిరీని నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించకపోవటం, ఆ సంస్థ నష్టాల్లో కూరుకుపోతున్నా పట్టించుకోకపోవటం, స్వయంగా ఈ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి అయినా ఆ శాఖపై ఇప్పటివరకు సమీక్ష చేయకపోవటం, కనీసం సంస్థ బాగోగుల గురించి ఆరా తీయకపోవటం వంటి ఘటనలు అనేక ఆరోపణలకు బలం చేకూర్చుతున్నాయి.

నష్టాల్లోకి విజయ డెయిరీ!

ఉమ్మడి ఏపీలో నష్టాల బాటలో ఉన్న విజయ డెయిరీని ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్ సర్కారు విజయ డెయిరీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రైతులకు పాల ఇన్సెంటివ్ ప్రకటించటంతో పాటు సబ్సిడీలో గేదెలను ఇప్పించింది. విజయ డెయిరీ ఆధ్వర్యంలో మెగా డెయిరీని ఏర్పాటు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో విజయ డెయిరీ నష్టాల నుంచి లాభాల పట్టింది. అయితే ఇది ఎంతో కాలం నిలవలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విజయ డెయిరీకి మళ్లీ కష్టాలు, నష్టాలు మొదలయ్యాయనే విమర్శలున్నాయి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు విజయ డెయిరీకి ప్రభుత్వం నుంచి కనీస సహకారం కూడా కరువైందని ఉద్యోగులు వాపోతున్నారు. పాల బిల్లులు చెల్లించకపోవటంతో పాల సేకరణ తగ్గుతున్నదని చెప్తున్నారు. విజయ డెయిరీ తయారుచేసే పాల ఉత్పత్తుల విక్రయం కూడా భారీగా తగ్గిపోతున్నట్టు తెలిసింది. లాభాలు తగ్గడం, ఖర్చులు పెరగటంతో మళ్లీ నష్టాలబాట పట్టినట్టు ఉద్యోగులు పేర్కొంటున్నారు.

అందుకే పాల బిల్లులు చెల్లించటం లేదా?

బీఆర్ఎస్ హయాంలో విజయ డెయిరీకి పాలు పోసే పాడి రైతులకు ప్రతి 15 రోజులకోసారి ఠంచనుగా బిల్లులు వారి ఖాతాలో పడేవి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. 3 నెలలుగా పాడి రైతులకు బిల్లులే దిక్కులేవు. 140 కోట్ల పాల బిల్లులను బకాయి పెట్టింది. రైతులు ఎంత మొత్తుకుంటున్నా ప్రభుత్వంలో గానీ, విజయ డెయిరీ అధికారుల్లో గానీ చలనం లేకపోవటం గమనార్హం. పాల బిల్లులు ఎప్పుడిస్తారని ప్రశ్నించిన రైతులపై అధికారులు తిట్ల దండకం అందుకుంటున్నారు. 'బిల్లులు వచ్చేటప్పుడు వస్తాయి. ఇష్టముంటే పాలు పోయండి లేకుంటే లేదు' అని విజయ డెయిరీ అధికారులు రైతులకు తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఈ వ్యాఖ్యల వెనుక భారీ కుట్ర దాగుందనే విషయం ఇప్పుడిప్పుడే బయటపడుతున్నది. రైతులను విజయ డెయిరీకి దూరం చేసేందుకు ప్రభుత్వం పాల బిల్లుల చెల్లింపును ఆలస్యం చేయిస్తున్నదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నెలలపాటు పాల బిల్లులు రాకపోతే రైతులే విసిగి వేసారి వాళ్లంతటా వాళ్లే ప్రైవేటు డెయిరీలకు మళ్లుతారని అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. ఆ తర్వాత మెల్లగా హెరిటేజ్ డెయిరీ.. రైతులను తనవైపు లాగేసుకునే ప్రయత్నం చేస్తుందని చెప్తున్నారు.



ఖమ్మం జిల్లా కల్లూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎన్నెస్పీ జలాలు విడుదల చేయాలి

- ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ అధికారులు ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకుల వినతి
- కోమట్లగూడెం, నేరడ గ్రామాల్లో దెబ్బతిన్న పంటల పరిశీలన

పెనుబల్లి/చింతకాని, సెప్టెంబర్ 20: పంటలకు నీరందక పొట్టదశలో ఉన్న వరితోపాటు పత్తి, మిర్చి ఎండిపోతున్నాయని, వెంటనే ఎన్నెస్పీ జలాలను విడుదల చేసి కాపాడాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా కల్లూరు ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ కాల్వలు దెబ్బతిన్నాయని, దాదాపు 20 రోజులు దాటినా వాటిని మరమ్మతు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా.. కనీసం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవల సీతారామ ప్రాజెక్టు కాల్వలను ప్రారంభించి హడావిడి చేశారే తప్ప కాల్వల నుంచి నీళ్లు రావడం లేదని, దీంతో కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని పంట భూములకు నీరందడం లేదని విమర్శించారు. వెంటనే సాగర్ జలాలు వదలాలని డిమాండ్ చేస్తూ నీటిపారుదల శాఖ అధికారులకు, ఆర్డీవోకు బీఆర్ఎస్ నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో రైతులు ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్లగూడెం, నేరడ గ్రామాల సమీపంలోని సాగర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోతున్న వరి, పత్తి, మక్కజొన్న, మిర్చి పంటలను పరిశీలించారు. వెంటనే సాగర్ నీటిని విడుదల చేయాలని తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, రైతులు పాల్గొన్నారు.

నమ్మక ద్రోహాన్ని రైతులు సహించరు

- వెన్నుపోటు సీఎంకు గుణపాఠం తప్పదు
- కౌలురైతులకు భరోసా ఇవ్వకుంటే పుట్టగతులుండవ్
- మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతులు దేన్నైనా క్షమిస్తారు కానీ నమ్మక ద్రోహాన్ని మాత్రం సహించరని, అధికారమే పరమావధిగా రైతు భరోసా పేరుతో హామీలిచ్చి రైతులను, కౌలు రైతులను వెన్నుపోటు పొడుస్తున్న రేవంత్‌రెడ్డి సర్కార్‌కు గుణపాఠం తప్పదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని నిసిగ్గుగా చెప్పిన కాంగ్రెస్ సర్కారుకు పుట్టగతులుండవని మండిపడ్డారు. రైతు భరోసా విషయంలో రైతులు, కౌలు రైతులే తేల్చుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొనటాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులను నమ్మించి తడిగుడ్డతో గొంతు కోసిందని శుక్రవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మొన్న రుణమాఫీ పేరిట మోసం, నిన్న వానాకాలం పెట్టుబడి సాయం ఎగ్గొట్టారు. నేడు కౌలు రైతుకు భరోసా ఇవ్వలేమని చేతులెత్తేస్తారా? కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందేమిటి? చేస్తున్నదేమిటి? 420 హామీల్లో సీఎం ఒక్కో వాగ్దానాన్ని పాతరేస్తున్నారు' అంటూ దుయ్యబట్టారు. చేతకానప్పుడు హామీలివ్వడమెందుకు ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నయవంచనకు పరాకాష్ట అని విమర్శించారు. అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేసి గద్దెనెక్కాక గొంతుకోసిన వారిని రైతులు అస్సలు వదిలిపెట్టరని, ఈ వెన్నుపోటుకు సీఎం మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.



తన కుమారుడు భార్గవ్ వివాహానికి హాజరు కావాలని కోరుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కొండా లక్ష్మణ్‌బాపూజీ తెలంగాణకు నిత్యస్ఫూర్తి

- ఆయన పట్టుదల, రాజనీతిజ్ఞత ప్రభావితం చేశాయి
- బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన తెలంగాణకు నిత్యస్ఫూర్తి అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి తాను సాగించిన చివరిదశ తెలంగాణ సాధన పోరాటంలో ఇమిడి ఉన్నదని తెలిపారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి (శనివారం)ని పురస్కరించుకుని వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలంగాణ కోసం తాను బయలుదేరిననాడు నాటి ఉమ్మడి రాష్ట్రంలోని తెలంగాణ వ్యతిరేక ప్రభుత్వాల ఒత్తిడికి తలొగ్గకుండా బాపూజీ తన జలదృశ్యం నివాసాన్ని ఉద్యమవేదికగా నిలపడం తన తెలంగాణ పోరాట ప్రస్థానంలో మరిచిపోలేనిదని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. బాపూజీ ప్రదర్శించిన నిక్కచ్చితనం, నిరాడంబరత లక్ష్య సాధనకోసం కనబరిచిన పట్టుదల తననెంతో ప్రభావితం చేశాయని తెలిపారు. న్యాయవాదిగా, రాజనీతిజ్ఞుడిగా స్వాతంత్రోద్యమకాలం నుంచి రాష్ట్ర సాధన చివరిదశ దాకా బాపూజీ చేసిన కృషిని భవిష్యత్తు తరాలకు అందించే దిశగా నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి స్మారకార్థం పలు కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కొనసాగిన బీఆర్‌ఎస్ పదేండ్ల ప్రగతి పాలనలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల కొనసాగింపు ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు.



కడియంకు గుణపాఠం తప్పదు

ప్రజాక్షేత్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులే బుద్ధిచెప్తరు • స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎగిరేది గులాబీ జెండానే • త్వరలో విస్తృతస్థాయి సమావేశం : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంపై మరోసారి గులాబీ జెండా ఎగరటం ఖాయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. పార్టీ మారిన ప్రస్తుత ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హతవేటు ఖాయమని, త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నకలు రానున్నాయని వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఉప ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీని మోసం చేసి, ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కి రాజకీయ స్వార్థంతో పార్టీ మారిన కడియం శ్రీహరిని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓడించేందుకు ప్రజలు, అన్ని స్థాయిల గులాబీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు రాజయ్య వివరించారు. అనేక అవకాశాలు ఇచ్చినా, మూడు సార్లు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించినా కేవలం రాజకీయ స్వార్థంతో పార్టీని వీడిన కడియం శ్రీహరికి



గులాబీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో బుద్ధిచెప్తారని కేటీఆర్ స్పష్టంచేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ పార్టీ ఎన్నికల అభ్యర్థిగా ఇప్పటికే అధినేత కేసీఆర్ తాటికొండ రాజయ్య పేరును ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తంచేశారు. పార్టీని సంస్థాగతంగా నిర్మాణం చేయడం కోసం త్వరలోనే నియోజకవర్గంలో కార్యక్రమాలు చేపట్టనున్నట్టు కేటీఆర్ తెలిపారు. త్వరలోనే స్టేషన్‌ఘన్‌పూర్‌లో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక నాయకులతో చర్చించి సమావేశ తేదీలను నిర్ణయించాలని రాజయ్యకు సూచించారు.

సర్కార్ దుర్భర వైద్యసేవలపై బీఆర్‌ఎస్ నిజనిర్ధారణ కమిటీ

- మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య, ఎమ్మెల్యే సంజయ్, మెతుకు ఆనంద్‌తో కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో మాతా, శిశు మరణాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న దుర్భర వైద్య ఆరోగ్య పరిస్థితులపై బీఆర్‌ఎస్ నిజనిర్ధారణ కమిటీ వేసింది. కమిటీని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ప్రకటించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య నేతృత్వంలోని కమిటీలో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ గాంధీ వైద్యశాలతో పాటు రాష్ట్రంలోని పలు దవాఖానలను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నిర్మాణాత్మక సూచనలతో కూడిన నివేదికను రూపొందిస్తారని, ఆ నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని కేటీఆర్ తెలిపారు.

నేరపూరిత నిర్లక్ష్యం

- మృతదేహం తరలింపునకు వాహనం లేకపోవడం అమానుషం
- ప్రభుత్వ తీరును ఎక్స్ వేదికగా ఎండగట్టిన మాజీ మంత్రి కేటీఆర్

ములుగు, సెప్టెంబర్ 20 (నమస్తేతెలంగాణ): మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్‌లు లేకపోవడం అమానుషమని, ఇది నేరపూరిత నిర్లక్ష్యమని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును కేటీఆర్ ఎక్స్ వేదికగా ఎండగట్టారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపురం గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్ కుమార్తె గీతిక(6) జ్వరంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎంలో గురువారం మృతి చెందింది. పాప మృతదేహాన్ని ఇంటికి తేవడానికి ప్రభుత్వ వాహనం అందుబాటులో లేకపోవడంతో బీఆర్‌ఎస్ నేత భూక్యా జంపన్న సొంత ఖర్చులతో ప్రైవేటు అంబులెన్స్‌ను సమకూర్చారు. విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా చిన్నారి మృతిపై సంతాపం వ్యక్తం చేసి మృతదేహాన్ని తరలించే స్థితిలో లేని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఘటన అవమానకరమని పేర్కొన్నారు. జీవితంలో ఉన్న పరువు చావులో లేదని, ఇదే సీఎం రేవంత్‌రెడ్డి వైద్యం అని, ఇది ఎవరికి అర్హత లేని నేరపూరిత నిర్లక్ష్యం అంటూ కేటీఆర్ పోస్టులో పేర్కొన్నారు.



ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని ఎండగడుతూ కేటీఆర్ చేసిన పోస్టు

సీబీఐ దర్యాప్తు జరపాలి

▶ III తరువాయి...

మొత్తం అలైన్‌మెంట్ మారకుండా కేవలం కాంగ్రెస్, ప్రభుత్వ పెద్దలకు సంబంధించి వందల ఎకరాల భూములు ఉన్నచోటే ఎందుకు మారింది? అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెల రోజుల నుంచే పేద రైతులు దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న కుందారం భూములు బిగ్ బ్రదర్స్ ఖాతాలోకి పోతున్న వైనాన్ని ఎండగట్టారు. ఆ కుందారం భూముల సమీపంలోకే రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ పరుగులు పెట్టడం వెనుక ఆంతర్యమేమిటి? అని ఎండగట్టారు. కేవలం ప్రభుత్వ పెద్దల భూముల ధరలు పెంచుకునేందుకే అలైన్‌మెంట్ మార్పు కుట్ర జరుగుతున్నదని కుండబద్దలు కొట్టారు. మార్పు వల్ల కేంద్రం నుంచి తెలంగాణకు రూ.12,500 కోట్ల నిధులు రాకున్నా.. ప్రపంచ బ్యాంకు రుణంతో ఆ ప్రాజెక్టును చేపట్టి తమ భూముల ధరలు పెంచుకునే మహా పన్నాగాన్ని రేవంత్ ప్రభుత్వం రచించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టడంతో పాటు అమాయక, పేద రైతుల భూములను చీల్చుతున్న, కొల్లగొడుతున్న ఈ అరాచక వ్యవహారంపై వెంటనే కేంద్రం సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వెంటనే సీబీఐ విచారణ వేయించాలని, లేకపోతే బీజేపీ-కాంగ్రెస్ ఒకటేనని తెలంగాణ ప్రజలు నమ్మాల్సి వస్తుందని హెచ్చరించారు. మీడియా సమావేశ వివరాలు వేముల మాటల్లోనే..

సీబీఐ విచారణ జరపకపోతే మీరంతా ఒక్కటే!

కేంద్రం నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే దక్షిణ భాగాన్ని చేపట్టాలి. అప్పుడే కేంద్రం నుంచి తెలంగాణకు రూ.12,500 కోట్ల సాయం అందుతుంది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా ఈ విషయంలో జోక్యం చేసుకొని, పాత అలైన్‌మెంట్ ప్రకారమే దక్షిణ భాగం పనులు మొదలయ్యేలా చూడాలి. నష్టపోతున్న పేద రైతుల బాధలు అర్థం చేసుకోవాలి. గిరిజనుల బాధ తెలుసుకోవాలి. కొత్త అలైన్‌మెంట్ చాలా బాగుందని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటే పారదర్శకంగా శ్వేత పత్రం విడుదల చేయాలి. కొత్త అలైన్‌మెంట్ మారడం వల్ల నష్టపోతున్న గ్రామాల్లో సభలు నిర్వహించి, అక్కడి ప్రజల బాధలు తీర్చాలి. ఆ రైతులకు మంచి నష్టపరిహారం ఇచ్చి ప్రాజెక్టును చేపట్టాలి. కానీ మీ భూముల కోసం, ఆ భూముల ధరలు పెంచుకునేందుకు నిరుపేద రైతులు, గిరిజనులు, రాష్ట్రాన్ని బలిపెట్టి అప్పులఊబిలోకి తీసుకుపోతామంటే మాత్రం బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుంది. అలైన్‌మెంట్ మార్పు ఎవరి కోసం? ఎవరి భూముల ధరలు పెరగడానికి? ఏ గద్దల భూదందా జరగడానికి? అనేది బయటకు రావాలి. అంటే.. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరుతున్నా. దీని వెనకాల ఎవరి హస్తం ఉందనేది ప్రజలకు తెలియాలి. పేద రైతులను బెదిరించటంపైనా సీబీఐ విచారణ జరగాలి. లేకపోతే బండి సంజయ్, కిషన్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి ఒక్కటేనని.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని తెలంగాణ ప్రజలు నమ్ముతరు' అని పేర్కొన్నారు.



తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో కిషోర్ గౌడ్, శుభప్రదపటేల్, రాకేశ్ కుమార్, స్వామి యాదవ్ తదితరులు

ఆర్‌ఆర్‌ఆర్ కథ ఇదీ..

అంతకుముందు వాహనాలు జాతీయ రహదారుల మీదుగా ఢిల్లీ, బెంగళూరు, ముంబైకి వెళ్లాలంటే హైదరాబాద్ సిటీ నుంచి వెళ్లాయి. నగర ట్రాఫిక్‌పై తీవ్ర ఒత్తిడి పెరగటంతో అప్పట్లో ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో ఆ వాహనాలన్నీ ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా వెళ్లేవి. కాలక్రమేణా ఆ ఇన్నర్ రింగు రోడ్డు కూడా నగర ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది. అనంతరం ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి 20-25 కిలోమీటర్ల దూరంలో ఔటర్ రింగ్ రోడ్డు కట్టి.. జాతీయ రహదారుల మీదుగా వచ్చే వాహనాలన్నింటినీ ఈ ఔటర్ రింగ్ రోడ్డు మీదికి మళ్లించారు. ఆ సమయంలో తెలంగాణ ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. హైదరాబాద్ ఇంకా విస్తరిస్తుందన్న దూరదృష్టితో ఆలోచించిన అప్పటి సీఎం కేసీఆర్.. నగరానికి 60 కిలోమీటర్ల దూరంలో కొత్త ఎకనామిక్ జోన్ ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. అందుకు ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ప్రతిపాదనలు రూపొందించారు. దాన్ని జాతీయ రహదారిగా పరిగణించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఓఆర్‌ఆర్ లోపల ఉన్న జాతీయ రహదారులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని.. ఆర్‌ఆర్‌ఆర్‌ను జాతీయ రహదారిగా నిర్మాణం చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. కేంద్రం ప్రాజెక్టును చేపడితే కేంద్ర అధికార యంత్రాంగమే అలైన్‌మెంట్ వంటి ప్రక్రియను నిర్వహిస్తుంది. నిర్ధారణ అయ్యాక రాష్ట్రానికి పంపి సమ్మతమేనా? అని మాత్రమే అడుగుతుంది.

లాభనష్టాలు బేరీజు వేసుకున్నరు

తొమ్మిది నెలల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి సంబంధించిన ఫైల్ ఆమోదం కోసం కేంద్రం వద్ద ఉన్నదన్న విషయం ఈ ప్రభుత్వానికి తెలుసు. అందుకే గతంలోనే ఫైనల్ అయిన అలైన్‌మెంట్ వల్ల తమకేం లాభం అనుకొన్నరు. తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నయో చూసుకున్నరు. అట్ల బేరీజు వేసుకొని అనేక మంది పేద రైతుల భూముల్లోకి అలైన్‌మెంట్ మళ్లించి, వారి భూములను చీల్చి అలైన్‌మెంట్‌ను వాళ్ల భూముల దగ్గరకు మలుపుకున్నరు. కొన్ని నెలలుగా ఈ ప్రభుత్వం అదే పని మీద ఉన్నది. అలైన్‌మెంట్ మార్పు మీద ఇటీవల ఒక ప్లాన్ కూడా రిలీజ్ చేసినరు.

ప్రభుత్వ పెద్దల స్వలాభం కోసమే

158 కిలోమీటర్ల ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగానికి రూ.4 వేల కోట్లు భూసేకరణ, రూ.8-9వేల కోట్లు రోడ్డు వేయడానికి ఖర్చవుతుండగా, అందులో భూసేకరణలో సగం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని కేసీఆర్ సర్కారు కేంద్రానికి స్పష్టం చేస్తే కేంద్రం కూడా అంగీకరించింది. 189 కిలోమీటర్ల దక్షిణ భాగం భూసేకరణకు రూ.5 వేల కోట్లు, రోడ్డు వేసేందుకు రూ.10 వేల కోట్లు అవసరమవుతుంది. కేంద్రం గతంలో అంగీకరించిన ప్రకారం దక్షిణభాగానికి సంబంధించి భూసేకరణలో సగం అంటే రూ.2,500 కోట్లు రాష్ట్రం ఇస్తే సరిపోతుంది. మిగిలిన రూ.12,500 కోట్లు కేంద్రమే ఇస్తుంది. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం వేరే విధంగా ఆలోచిస్తున్నది. గతంలోనే నిర్ణయించిన అలైన్‌మెంట్ వల్ల తమకు ఏం లాభం లేదనుకొని, వాళ్ల భూముల దగ్గరకు రింగ్‌రోడ్డును తీసుకుపోవాలని కొత్త అలైన్‌మెంట్ ఇచ్చుకున్నారు. అందులోనే భారీ ఎత్తున ప్రభుత్వ పెద్దల స్వలాభం దాగి ఉన్నది.

- నాగార్జునసాగర్ జాతీయ రహదారిలో మాల్ సమీపంలోని గొల్లపల్లి వద్ద పాత అలైన్‌మెంట్ ఉంటే.. దాన్ని రెండు కిలోమీటర్లు బయటికి జరిపి కుర్మపల్లి ఎక్స్ రోడ్డు దగ్గర అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.
- శ్రీశైలం జాతీయ రహదారిలో గత అలైన్‌మెంట్ ప్రకారం ఆమన్‌గల్ కాటన్ మిల్లు సమీపంలో ఉంటే దాన్ని 3-4 కిలోమీటర్లు శ్రీశైలం హైవే వైపు జరిపారు. ఆమన్‌గల్‌ను దాటి మేడిగడ్డ తండా దగ్గరికి మార్చారు. మరి ఎందుకు మార్చారని మీడియా, ప్రజలు అడిగితే.. ఫ్యూచర్ సిటీ కోసం అలైన్‌మెంట్‌ను మారుస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. కానీ వాస్తవ పరిస్థితులు చూస్తే.. లేమూరు-యాచారం-కొత్తూరు-ముచ్చర్ల పరిధిలో ఫోర్త్ అలియాస్ ఫ్యూచర్ సిటీ విస్తరించి ఉన్నది. ఈ క్రమంలో పాత అలైన్‌మెంట్ ప్రకారమైతే ఈ ఫోర్త్ సిటీకి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ 10 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. కానీ ప్రస్తుత అలైన్‌మెంట్ ప్రకారం 2 కిలోమీటర్లు పెరిగి 12 కిలోమీటర్ల దూరంలోకి పోయింది. సాగర్ హైవేపై చూస్తే.. ఫోర్త్ సిటీ నుంచి గొల్లపల్లి 20 కిలోమీటర్ల వరకు ఉంటే ఇప్పుడు రెండు కిలోమీటర్లు అవతలికి జరిగి దూరం ఇంకా పెరిగింది. అంటే ఫ్యూచర్ సిటీ కోసం అలైన్‌మెంట్ మార్చారు అన్నది శుద్ధ అబద్ధం.

మరెందుకు మార్చారు?

- శ్రీశైలం హైవే వైపు అలైన్‌మెంట్ మార్చడానికి కారణం.. కుందారం భూములు. ఈ భూములను దశాబ్దాలుగా పేద రైతులు సాగు చేసుకుంటున్నా వారికి పట్టాలు లేవు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ఆ రైతుల నుంచి చాలా అగ్గువకు ఆ భూములను బెదిరించి తీసుకున్నారు. అక్కడి రైతులను అడిగితే మాత్రం బిగ్ బ్రదర్స్ అని చెప్తున్నరు. అదెలాగంటే.. కబ్జా రద్దు ఒప్పంద పత్రాలు అని స్టాంపు పేపర్ల మీద రాయించుకుంటున్నరు. ప్రభుత్వం వచ్చిన మరుసటి నెల నుంచే పేద రైతులను బయటికి పంపించి కుందారం భూములను ఆక్రమించడం మొదలుపెట్టారు. గద్దల్లా వచ్చి వారిని భయపెట్టి రూ.40-50 లక్షలుంటే రూ.3-4 లక్షలకు గుంజుకుంటున్నరు. 30 ఏండ్ల నుంచి వ్యాపారంలో ఉన్న బిల్డర్‌ను నేను. ఇప్పటివరకు కబ్జా రద్దు ఒప్పంద పత్రం అనేది చూడలేదు.
- గతంలోని అలైన్‌మెంట్‌ను మార్చి ఖానాపూర్ సమీపంలోకి తీసుకువచ్చారు. అది ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే గ్రామం. ఆయనకు అక్కడ సొంతంగా కొనుగోలు చేసిన (ఈ ఏడెనిమిది నెలల కాలంలో) భూములు ఉన్నాయి.
- పాత అలైన్‌మెంట్‌ను మరిన్ని కిలోమీటర్లు ముందుకు జరిపి మాడ్గులలోని నల్లచెరువు వద్దకు అలైన్‌మెంట్‌ను తీసుకుపోయారు. మాడ్గులలో సీఎం రేవంత్‌రెడ్డి బంధువులకు పెద్ద ఎత్తున భూములు ఉన్నాయనేది అందరికీ తెలుసు.
- చేవెళ్ల సమీపంలోని ఇంతకుముందు అంగడి చిట్టంపల్లి గేటు సమీపంలో అలైన్‌మెంట్ ఉంటే దానిని ఐదు కిలోమీటర్లు ముందుకు జరిపి మన్నెగూడ క్రాస్‌రోడ్డు నుంచి తీసుకుపోతున్నరు. దానివల్ల షాద్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సంగారెడ్డి వరకు ముందుకు జరపటం వల్ల అక్కడ ఉన్న మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ, మాజీమంత్రి, చాలామంది కాంగ్రెస్ నాయకులకు ల్యాండ్ బ్యాంక్ ఉండటం వల్ల మేలు జరుగుతుందని ప్రజలే అంటున్నరు. అంతేకాదు.. ఈ ప్రాంతంలో కూడా బిగ్ బ్రదర్స్ స్వయంగా భారీఎత్తున భూములు సేకరించి పెట్టుకున్నారని స్థానికులు చెప్తున్నారు. అందుకే అలైన్‌మెంట్ మార్చారు.

ఎలాంటి జోక్యం లేకుండానే ఉత్తర-దక్షిణ అలైన్‌మెంట్లు పూర్తి

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉత్తర-దక్షిణ భాగాలకు ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను కేంద్రమే పూర్తిచేసింది. అందులో ఎలాంటి రాజకీయ జోక్యంగానీ, తెలంగాణ ప్రభుత్వ జోక్యంగానీ లేదు. కేంద్రం నుంచి అలైన్‌మెంట్ ప్రతిపాదనలు వస్తే కొన్ని అభ్యంతరాలను అప్పట్లో చెప్పాం. ముఖ్యంగా అలైన్‌మెంట్ సర్వే సమయంలోలేని బస్వాపూర్ రిజర్వాయర్‌తో కాళేశ్వరం ప్రాజెక్టులోని పలు కాల్వలు, జలాశయాలు వచ్చే చోట కొంత అలైన్‌మెంట్ తప్పించాలని చెప్పాం. అది సహేతుకం కావడంతో వాటిని మార్పు చేశారు. అలైన్‌మెంట్ విషయంలో ఏ ఒక్క రైతు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. కేంద్రం తొలుత ఉత్తర భాగం చేపడతామని చెప్పటంతో ఆ మేరకు అలైన్‌మెంట్‌ను అధికారికంగా నిర్ధారించి, భూసేకరణ కూడా 30-50 శాతం వరకు పూర్తి చేశారు. దక్షిణ భాగం అలైన్‌మెంట్ కూడా ఖరారైనందున దాన్ని కూడా వెంటనే చేపట్టాలని అప్పట్లోనే మేం కోరటంతో దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్‌ను కూడా పరిశీలించి, అభ్యంతరాలుంటే చెప్పాలని అన్నారు. మేం దానిని పరిశీలించి, నల్లగొండ జిల్లాలో డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించే శివన్నగూడెం రిజర్వాయర్ వచ్చే చోట అలైన్‌మెంట్ వస్తున్నందున దాన్ని తప్పించాలని సూచించటంతో ఆ మేరకు మార్పు చేశారు. అలైన్‌మెంట్‌ను ఫైనల్ చేశారు. దానికి సంబంధించిన ఫైల్ కేంద్రం వద్దే ఉన్నది. అయితే ఆ ప్రాజెక్టును భారత్‌మాల కింద చేపట్టాలా? మరో పథకమా? అని పరిశీలిస్తున్నారని తెలిసింది.

అక్కడే ఎందుకు జరిగింది?

గత అలైన్‌మెంట్ హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని అనుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు 50 కాదు.. 60 కిలోమీటర్ల దూరం వరకు ఆర్‌ఆర్‌ఆర్ కావాలనుకుంటే దక్షిణ భాగం మొత్తం ఆ మేరకు 10 కిలోమీటర్లు పాత అలైన్‌మెంట్ ముందుకు జరగాలి. కానీ కేవలం నాలుగైదు చోట్ల ఎంపిక చేసినట్టు మాత్రమే ఎందుకు జరిగింది? దీని వెనక మతలబు ఏంది? కాంగ్రెస్ ప్రభుత్వంలోని పెద్దలు, పార్టీ నేతల భూములతో పాటు ప్రభుత్వం వచ్చిన తర్వాత వాళ్లు పేదల్ని భయపెట్టి, రెవెన్యూ లొసుగులను ఆసరాగా చేసుకొని ఎక్కడెకక్కడ భూముల్ని చవకగా గుంజుకున్నరో ఆయా ప్రాంతాల్లోనే రింగు రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చే ప్రయత్నం చేశారు.

తెలంగాణను ముంచి.. వాళ్ల భూముల ధరలు పెంచి..

కేంద్రం అలైన్‌మెంట్ ప్రకారం దక్షిణ భాగం నిర్మాణం చేపడితే కేంద్రం నుంచి రూ.12,500 కోట్లు వస్తాయి. కానీ అలైన్‌మెంట్‌ను ఇష్టమొచ్చినట్టు మారిస్తే నిధులు ఇవ్వరు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు కొందరు తమ స్వలాభం కోసం అలైన్‌మెంట్ మార్చారని తెలిస్తే ప్రాజెక్టును కేంద్రం చేపట్టకపోవచ్చు. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న వారికి తెలుసు. అయినప్పటికీ ప్రభుత్వం ముందుకుపోతున్నది. ఎందుకంటే.. మాకున్న సమాచారం ప్రకారం కేంద్రం రూ.12,500 కోట్లు ఇవ్వకున్నా.. తెలంగాణ ఆ నిధులు నష్టపోయినా సరే! రింగ్ రోడ్డు మాత్రం మా భూముల గుండానే పోవాలి. అలైన్‌మెంట్ మార్చాల్సిందే అని అనుకుంటున్నరు. కేంద్రం నిధులు ఇవ్వకున్నా ప్రపంచ బ్యాంకు లోన్ తీసుకుందామనుకుంటున్నరు. తెలంగాణపై రూ.12,500 కోట్ల భారం మోపైనా రింగ్ రోడ్డును తమ భూముల గుండా తీసుకుపోవాలి.. ఆ భూముల ధరలు పెరగాలనేది ఈ ప్రభుత్వ ఆలోచనగా ఉన్నది.

4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శనివారం 21 సెప్టెంబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఇంటర్మీడియట్ ఎత్తివేత అవివేకపు చర్య

నూతన విద్యా విధానం తెరమీదకుతెచ్చిన 5+3+3+4 పద్ధతిని పాఠశాల విద్యలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందా? నూతన విద్యా విధానం సిఫారసులతో విద్యారంగం గట్టెక్కే అవకాశం ఉన్నదా? విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నూతన విద్యా విధానంపై చర్చించి, నిర్ణయం తీసుకోకుండా కేంద్రం ఒత్తిడితో ఇంటర్ తరగతులు రద్దు చేయనున్నదా? ఒకవేళ అదే నిజమైతే రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటుచేసి విద్యా విధానంపై సూచన చేయాలని రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు కోరినట్టు? రాష్ట్ర ప్రభుత్వ చర్యల వల్ల ఇలాంటి అనేక అనుమానాలు కలుగుతున్నాయి.



కె.వేణుగోపాల్
98665 14577

రాష్ట్రంలో ఏటా సుమారు 5 లక్షల మంది విద్యార్థులు పదో తరగతి పాసవుతున్నారు. వీరిలో లక్ష మందికి పైగా ఇంటర్‌తోనే విద్యను ఆపేస్తున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో కలిపి 3,287 జూనియర్ కాలేజీలున్నాయి. వీటిలో ప్రైవేట్ కాలేజీలు 1,482 కాగా, ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, గురుకులాలు, కేజీబీవీలు కలిపి మొత్తం 1,805 కాలేజీలు ప్రభుత్వ రంగంలో ఉన్నాయి. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 9, 10వ తరగతుల్లో 94 శాతంగా ఉండగా, ఇంటర్‌కు వచ్చేసరికి 76 శాతంగా ఉన్నది.

నూతన విద్యా విధానం ప్రకారం.. జూనియర్ కళాశాలలు, ఇంటర్మీడియట్ తరగతులు రద్దయిపోయి, అంగన్‌వాడీలో ప్రాథమిక తరగతులను కలిపేస్తే విద్యారంగం స్వరూపమే మారిపోతుంది. ఇప్పుడున్న అంగన్‌వాడీ, పూర్వ ప్రాథమిక విద్య, ప్రాథమిక విద్య కలిసిపోతాయి. 9 , 10వ తరగతులతో కలిపి ఇంటర్మీడియట్ అంటే 11 – 12 తరగతులను కూడా పాఠశాల స్థాయిలోనే నిర్వహించే పద్ధతి వస్తుంది. ప్రస్తుత పాఠశాల విద్యా విధానం కొఠారి కమిషన్ 1966లో చేసిన సిఫారసుల మేరకు నడుస్తున్నది. దీని ప్రకారం.. సెకండరీ విద్య, ఇంటర్మీడియట్, ఆ తర్వాత డిగ్రీ.. ఇలా ఒక క్రమ పద్ధతి ప్రకారం ఉన్నది. ఈ విధానంలో పాఠశాల విద్య పదవ తరగతికే పరిమితమైపోతుంది. జూనియర్ కళాశాలల పేరుతో ఇంటర్మీడియట్ విద్య 11 ,12వ తరగతుల వరకు ఉంటుంది.

కొత్త విధానంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీ ప్రైమరీ), ప్రాథమిక విద్య (3–8), సెకండరీ విద్య (9–12)పేరుతో మూడు విభాగాలుగా విద్యా విధానం ఉండబోతున్నది. ఇది అమల్లోకి వస్తే సుమారు ఐదున్నర దశాబ్దాలుగా ఉన్న జూనియర్ కళాశాల వ్యవస్థ, ఇంటర్మీడియట్ బోర్డు రద్దయి పాఠశాల విద్యలో విలీనమవుతాయి. ఎస్ఎస్‌సీ పరీక్షలు రద్దయి, 12వ తరగతిలో టర్మినల్ ఎగ్జామినేషన్ ఉంటుంది. ఎస్ఎస్‌సీ బోర్డు కూడా రద్దవుతుంది.

ఇదంతా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం– 2020 సిఫారసుల మేరకే జరగబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం సిఫారసులను పూర్తిగా ఆమోదించిందా? ఆమోదించచే ముందు అవసరమైన చర్చలు జరిపిందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యా విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, చర్చించి, ఒక సమగ్ర విధానాన్ని సూచించాలని విద్యా కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల కిందట నియమించింది. ఆ కమిషన్ పని ప్రారంభించకుండానే, కమిషన్‌లో ఉండే ముగ్గురు సభ్యుల నియామకం జరగకుండానే కొత్త మార్పులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటి? ఈ విధానంతో ఇంటర్మీడియట్ స్థాయిలో డ్రాపౌట్ సమస్య ఎంత మాత్రం సమసిపోదు. పైగా బోధన, విద్యా ప్రమాణాలు మరింత క్షీణించే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయుల నియామకాల్లో కూడా నాణ్యత తగ్గడం, విద్యార్థుల మానసిక పరిస్థితిని బట్టి బోధన జరగాల్సిన ప్రక్రియకు ప్రాధాన్యం లేకుండా పోతుంది.

> **విద్యా విధానాన్ని సమగ్రంగా పరిశీలించి, చర్చించి, ఒక సమగ్ర విధానాన్ని సూచించాలని ఒక విద్యా కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల కిందట నియమించింది. ఆ కమిషన్ పని ప్రారంభించకుండానే, కమిషన్‌లో ఉండే ముగ్గురు సభ్యుల నియామకం జరగకుండానే కొత్త మార్పులను తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడం ఏమిటనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.**



నూతన విద్యా విధానంపై విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నూతన విద్యా విధానంపై పార్లమెంటులో చర్చించకుండా, ఆమోదించకుండానే దాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం హడావుడి చేస్తున్నది. ఇది రాష్ట్రాల హక్కులను హరిస్తూ, కేంద్రీకరణ దిశగా అడుగులు వేయడమే. విద్య ఉమ్మడి జాబితాలో ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం అమలుకు పూనుకోవడం ఫెడరల్ స్వభావానికి విఘాతం కలిగించడమే. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్చించకుండానే విద్యారంగంలో కేంద్రం పెత్తనాన్ని ఎట్లా అంగీకరిస్తున్నది?

విద్యారంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఈ విధానం నిరాకరిస్తున్నది. దాని స్థానంలో ప్రతిభ అనే భావనను నూతన విద్యా విధానం ముందుకుతెస్తోంది. పాఠశాలలను మూసివేస్తూ, స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు, ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఇంటి నుంచే విద్య, డిజిటల్ విద్య, ఓపెన్ స్కూల్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహిస్తున్నది. ఈ క్రమంలో పేదలు, వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పిస్తున్న సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోంది. నూతన విద్యా విధానంలో అందరికీ ఉచిత నిర్బంధ విద్య ప్రస్తావన లేకపోవడం ప్రాథమిక విద్యా హక్కు ఉల్లంఘన అవుతుంది. పాఠ్యాంశాల తొలగింపు, కేంద్ర ప్రభుత్వ భావజాలానికి అనుగుణంగా సిలబస్ రూపకల్పన, మళ్లీ ప్రాచీన వృత్తులకు సంబంధించిన వృత్తి విద్యలు ప్రవేశపెట్టడం వంటి ఏకపక్ష విధానాలకు కేంద్రం ఊతమిస్తున్నది. పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక విద్యకు అనుసంధానం చేయాలనే సిఫారసు చేసినప్పటికీ ఉపాధ్యాయుల శిక్షణ, నియామకాల గురించిన ప్రస్తావన లేదు. దీని వల్ల పూర్వ ప్రాథమిక విద్యలోకి మార్కెట్ శక్తులు ప్రవేశించే అవకాశం ఉంది. రెగ్యులర్ పోస్టుల్లో ఉపాధ్యాయుల నియామకాలను నూతన విద్యా విధానం నిరాకరిస్తుంది. కాంట్రాక్టు టీచర్లను రెగ్యులర్ చేసే ప్రస్తావన నూతన విద్యా విధానంలో లేదు. పైగా ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతుల ద్వారా కాకుండా, ప్రతిభ పేరుతో పదోన్నతులకు అవకాశం కల్పిస్తుంది. అక్రిడియేషన్ పద్ధతి ద్వారా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో విద్యా వ్యాపారీకరణను మరింత పెంచుతుంది. స్కాలర్‌షిప్ విధానానికి తిలోదకాలు ఇచ్చి, విద్యా రుణాల ద్వారా విద్యార్థులను, తల్లిదండ్రులను అప్పుల ఊబిలోకి నెడుతుంది. విద్యారంగంపై వినియోగించే బడ్జెట్‌ను వృథా ఖర్చుగా భావిస్తూ నిధుల కొరత సాకుతో విద్యారంగం ప్రైవేటీకరణను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నది. విద్య, ఉపాధి అంశాలపై ఉన్నత వర్గాల ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి నూతన విద్యా విధానం దోహదం చేస్తున్నది.

> **55 ఏండ్లుగా రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్య కీలక పాత్ర పోషిస్తూ, ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నది. విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దుతున్నది. అంతేకాదు, వైద్య, ఇంజినీరింగ్ లాంటి వృత్తి విద్య కోర్సుల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నది. మన సిలబస్‌కు ఆకర్షితులై వివిధ రాష్ట్రాల విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. వారి భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.**

ఈ నేపథ్యంలో ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించి, ఇంటర్మీడియట్ విద్యను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నది. అన్ని సబ్జెక్టుల అధ్యాపకులను నియమించాలి. తద్వారా తల్లిదండ్రులు, విద్యార్థుల్లో విశ్వాసం కల్పించాలి. ఆ బాధ్యతను వదిలి, కార్పొరేట్ సంస్థల ఒత్తిళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోవడం విచారకరం. ఇంటర్మీడియట్ బోర్డును అదుపు చేయకుండా, మొత్తం ఇంటర్మీడియట్ కోర్సునే రద్దు చేస్తామనడం అవివేకమే.

నాణ్యమైన, నైపుణ్యం కలిగిన విద్యార్థులను తయారు చేసే క్రమంలో రాజీపడకుండా విద్యా సంస్థలను నిర్వహించాలి. విద్యా కమిషన్‌కు ఆ బాధ్యత అప్పగించాలి. తద్వారా రాష్ట్రంలో పటిష్ఠమైన విద్యా విధానాన్ని రూపొందించి, ఇంటర్మీడియట్ విద్యను కాపాడాలి.

(వ్యాసకర్త: పూర్వ అధ్యక్షులు, ఏపీటీఎఫ్)

రాజీనామా వ్యూహం ఫలించేనా?

ప్రజా న్యాయస్థానంలో తీర్పు కోరుతూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యూహం ఫలిస్తుందా? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న అంశం. ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థలు పెట్టిన కేసుల కారణంగా రెండు దఫాలుగా జైలులో ఉన్న కేజ్రీవాల్ తాజాగా బెయిలుపై విడుదలైన విషయం విదితమే. జైలు నుంచి బయటికి వచ్చిన వెంటనే తాను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నానని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను మహారాష్ట్రతో కలిపి నిర్వహించాలని ప్రకటించి తీవ్ర సంచలనం సృష్టించారు. రానున్న ఎన్నికల్లో ఆప్‌ను మరోసారి గెలిపిస్తేనే తాను తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతానని ఆయన చెప్పడం రాజకీయ సాహసమే గాక, ఢిల్లీ ఓటర్లపై ఆయనకున్న నమ్మకానికి చిహ్నంగా భావించవచ్చు.



నాంచారయ్య మెరుగుమాల



ఆప్ ప్రభుత్వంలో కీలక శాఖల మంత్రిగా పనిచేసిన ఆతిశీ మార్లెనా సీఎం పదవి చేపట్టాక జరగనున్న ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు ఎక్కువ విజయావకాశాలున్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. నాలుగు నెలల క్రితం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు స్థానాలనూ బీజేపీ కైవసం చేసుకున్నది. అయినప్పటికీ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటమి తప్పదని ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. 2011లో కాంగ్రెస్ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, షీలా దీక్షిత్ నాయకత్వాన నడుస్తున్న ఢిల్లీ కాంగ్రెస్ సర్కారు అవినీతికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచిన ప్రజా ఆందోళనల నుంచి అవతరించిన అరవింద్ కేజ్రీవాల్ అనతికాలంలోనే సమర్థ నేతగా ఎదిగారు.

2012లో ఆప్‌ను స్థాపించిన తర్వాత అనతికాలంలోనే ఆయన ఓటర్లను ఆకట్టుకున్నారు. ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లలో ఆప్ 28 స్థానాలు గెలిచి, రెండో పెద్ద పార్టీగా అవరించింది. బీజేపీని అధికారంలోకి రాకుండా నిరోధించే లక్ష్యంతో 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఇచ్చిన మద్దతుతో కేజ్రీవాల్ 2013 డిసెంబర్ 28న తొలిసారి ఢిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అయితే, లోక్‌పాల్ బిల్లుతో పాటు అనేక కీలక అంశాల్లో కాంగ్రెస్ వైఖరికి నిరసనగా 2014 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. అయితే మొహల్లా క్లినిక్‌లు, విద్యా విధానంలో మార్పులు, విద్యుత్తు చార్జీల తగ్గింపు వంటి జనాకర్షక విధానాలతో ఢిల్లీ ప్రజలకు ఆప్ తక్కువ సమయంలోనే మరింత దగ్గరైంది. అయితే, కొన్ని వారాల తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో యూపీఏ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన కాంగ్రెస్‌ను కొనసాగించడమా, లేక గద్దె దించడమా? అనేదే ప్రధాన ఎజెండాగా ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆప్ ఢిల్లీలోని అన్ని సీట్లలో ఓడిపోయింది.

ఆ తర్వాత 2015లో జరిగిన ఎన్నికల్లో కేజ్రీవాల్ పార్టీ ఎవ్వరూ ఊహించినంతటి భారీ మెజారిటీని సాధించింది. మొత్తం 70 స్థానాల్లో ఆప్‌కు 67 సీట్లు రాగా, బీజేపీ మూడు స్థానాలే దక్కించుకుంది.

> **1998–2013 మధ్య 15 సంవత్సరాలు ఢిల్లీని నిరాటంకంగా పరిపాలించిన కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోయింది. 2013 ఎన్నికల్లో 8 సీట్లు దక్కించుకున్న కాంగ్రెస్ 2015 ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేదు. తన జనాకర్షక, ప్రజాసంక్షేమ విధానాల ద్వారా అరవింద్ కేజ్రీవాల్ ప్రజలను సంతృప్తి పరచడంలో విజయం సాధించారు.**

ఈ నేపథ్యంలో అడుగడుగునా ఆప్ సర్కారును కేంద్ర ప్రభుత్వం ఇబ్బందులు పెట్టినా కేజ్రీవాల్ తలవంచలేదు. కానీ, బీజేపీ రామబాణానికి పోటీగా హనుమాన్ చాలీసా పఠనం వంటి కొత్త ఆయుధాలతో కాషాయపక్షంతో తలపడ్డారు. ముస్లింల మద్దతు పొందుతూనే హిందూత్వ విషయంలో అవసరమైన మేరకు స్వల్ప స్థాయిలో ఆయన రాజీపడ్డారనే పేరు తెచ్చుకున్నారు. మొదటిసారి ఆప్ నాలుగేండ్ల జనరంజక పరిపాలన తర్వాత 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అంతకు ముందు పార్లమెంటు ఎన్నికల్లో మాదిరిగానే ఆప్ ఒక్క సీటూ కైవసం చేసుకోలేకపోయింది. అప్పుడు కేంద్రంలో పాలకపక్షమైన బీజేపీకి ఢిల్లీ ఓటర్లు అనుకూలంగా ఉండటం ఆప్ పరాజయానికి దారితీసింది. ఈ ఎన్నికలైన దాదాపు ఏడాది తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అతి స్వల్ప సంఖ్యలో సీట్లు తగ్గినా ఆప్ మరోసారి తిరుగులేని మెజారిటీ సాధించింది. మొత్తం 70 సీట్లలో 62 స్థానాలు దక్కించుకున్నది. బీజేపీ బలం 3 నుంచి 8కి పెరిగింది. కాంగ్రెస్ వరుసగా రెండోసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఖాతా తెరవకుండా కొత్త రికార్డు నమోదు చేసింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమంటే.. ఆప్ వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో (2015, 2020) 85 శాతానికి పైగా సీట్లు (67, 62) కైవసం చేసుకోవడంతో పాటు వరుసగా 54.3 శాతం, 53.57 శాతం ఓట్లు సంపాదించడం విశేషం.

రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి 40 శాతం లోపు, కాంగ్రెస్‌కు 10 శాతం కంటే తక్కువ ఓట్లు రావడం ఏండ్లకేండ్లు ఢిల్లీని పాలించిన ఆ పార్టీలకు జనామోదం లేదని నిరూపించింది. వరుసగా మూడు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019, 2024) ఆప్‌కు ఢిల్లీలో ఒక్క సీటు కూడా దక్కలేదు. కానీ, రాజధాని ప్రాంతాన్ని పరిమిత అధికారాలతో జనరంజకంగా పరిపాలించిన పార్టీగా ఆప్‌ను జనం గుర్తించారు. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్ అరెస్టయి జైలు జీవితం గడిపిన సింపతీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పెట్టుకున్న పొత్తు కూడా ఆప్‌కు ఉపయోగపడలేదు. కొత్త మిత్రపక్షాలైన కాంగ్రెస్, ఆప్ రాజధానిలో ఖాతా తెరవలేకపోయాయి. హర్యానాలో కూడా ఈ పొత్తు ఫలించకపోవడంతో కాంగ్రెస్‌కు అక్కడి మొత్తం పది సీట్లలో ఐదు మాత్రమే దక్కాయి. ఆప్ పోటీచేసిన ఒక్క సీటు కురుక్షేత్రలో ఆ పార్టీకి ఓటమి ఎదురైంది.

> **ఈ లెక్కన పంజాబ్, హరియానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు.**

ఈ లెక్కన పంజాబ్, హర్యానా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు ఏ మాత్రం ప్రయోజనకరం కాదనే స్పష్టమైన అవగాహనతోనే హర్యానాలో కాంగ్రెస్ పది సీట్ల వరకు ఇవ్వజూపినా ఆ పార్టీతో పొత్తుకు ఆప్ నిరాకరించింది. కుటుంబ మూలాల రీత్యా సొంత రాష్ట్రమైన హర్యానాలోని మొత్తం 90 సీట్లకు కేజ్రీవాల్ సొంత పార్టీ అభ్యర్థులను నిలబెట్టారు.

> **అంతేగాక, కాంగ్రెస్‌తో తెగదెంపులు చేసుకున్నాక తన రాజీనామా నిర్ణయం, మహారాష్ట్ర ఎన్నికలతో పాటే ఢిల్లీ ఎన్నికలు జరిపించాలనే డిమాండ్‌తో ముందుకొచ్చిన కేజ్రీవాల్ మాటలు హస్తం పార్టీకి రుచించలేదు. ఆయన నిర్ణయాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎన్నికల్లో గెలుపుపై హర్యానాలో ఉన్న ధీమా ఢిల్లీలో కాంగ్రెస్‌కు లేదు. ఈ విధంగా ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను రాజధానిలో మట్టికరిపించడానికి కేజ్రీవాల్ పన్నిన వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో త్వరలోనే తేలిపోతుంది.**

ఒకవేళ మహారాష్ట్రతో పాటే కొద్ది వారాల్లో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరిపిస్తే కొత్త సీఎంగా ప్రమాణం చేసే ఆతిశీ మార్లెనా పాలనతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ పదేండ్ల పాలనపై ఓటర్లు తీర్పు ఇస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజకీయ కక్షలతో కేంద్ర ప్రభుత్వం తన చెప్పుచేతల్లోని సీబీఐ, ఈడీ వంటి సంస్థలతో పెట్టిన కేసుల ఫలితంగా కొన్ని మాసాల జైలు జీవితం గడిపిన అనేకమంది ప్రాంతీయ పక్షాల నేతలు ప్రజాక్షేత్రంలో విజయం సాధించిన సందర్భాలే ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌కు స్ఫూర్తిదాయకం. ■

హైడ్రా.. ఇదో మెదడు లేని చేతనం. ఆకలి తప్ప, ఆలోచన లేని జలచరం. నాడీకణం కమాండ్‌తో కదిలే హైడ్రోజోవా జీవి. మేత వేస్తే రూపం మార్చుకుంటుంది. శత్రువు ఎదురుపడితే దూరంగా పారిపోతుంది. హైదరాబాద్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వదిలిన హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) కూడా ఇవే లక్షణాలతో తడబడుతున్నది. రెండు అడుగులు బలంగా వేసిందో లేదో.. అప్పుడే రూపం మారింది. రోకు తప్పింది. మహా నగరం తూర్పు, పడమర, ఉత్తర దిక్కుల్లోనే హైడ్రా సంచరిస్తుంది. కానీ, దక్షిణ దిక్కు గమనానికెందుకో జంకుతున్నది.

బేగరి కంచెకు హైడ్రా దారి!



వర్థెల్లి వెంకటేశ్వర్లు



హైడ్రా కమిషనర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ వ్యక్తిత్వం మీద ఎవరికీ ఏ మీవంటి అనుమానం లేదు. తను కమిషనర్‌గా ఉన్నడు కాబట్టే, జనం హైడ్రా గమనం మీద కొంత భరోసాతో ఉన్నరు. ఒక ప్రభుత్వ పాలసీ దాని స్వభావం మీద కాకుండా అధికారి విశ్వసనీయత మీద మనుగడ సాగించటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. హైడ్రాకు కమాండ్ ఉంటేనే కదిలే జీవి. అట్లాగే కానిస్టేబుల్ నుంచి కమిషనర్ వరకు కమాండ్ మీద నడిచేదే పోలీసు వ్యవస్థ. అది పోలీసు ఉద్యోగ ధర్మం. హైడ్రా గమనం మీద రోజురోజుకు నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కూల్చివేతల దశలో కాంగ్రెస్ మాజీ కేంద్రమంత్రి పల్లంరాజు ఇల్లు కూలగొట్టింది. హైడ్రా పనితనానికి ఇదే రోల్ మోడల్ అని ప్రకటించింది. ఇది అభినందనీయమే. కానీ, దానికి ఆనుకొనే ఉన్న అదే రాజు గారి రక్త సంబంధీకుల ఇంటిని ఎందుకు పడగొట్టలేదనే అనుయోగం అప్రస్తుతం. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలో చెరువుల పరిరక్షణ, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల దురాక్రమణ అంటూ అవతరించి, ఆటోపం చేస్తున్న హైడ్రా దక్షిణం దిక్కును ఎందుకొదిలేసింది?

మహానగరం త్రయ చెరుగుల హైడ్రా విధ్వంసం జరుగుతుంటే.. నాలుగో దిక్కు నయా జమానా సాగుతున్నది. ఐటీ సిటీ రాయదుర్గంలో ఆక్యుపెన్సీ లేదన్న మెట్రో రైలు, జనమే లేని బేగరి కంచెకు దారులు వెతుకుతున్నది. రీజినల్ రింగు రోడ్లు పంట పొలాల్లో పాములు తిరిగినట్టు అష్ట వంకర్లతో పారాడుతున్నయి. 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు.. రేడియల్ రహదారులు.. కనెక్టింగ్ రోడ్లు.. వాటి వెనకాలే వేల ఎకరాల భూములు.. ఒత్తిళ్ల ఒప్పందాల దందా దుమ్ము లేపుతుందట. నాడు అజలాపూర్, ఇర్విన్, వెల్దండ పల్లెల్లో జల్, జమీన్, జంగల్ నినాదంతో గన్ను పట్టి, ప్రజాదర్బార్లు పెట్టి రాజ్ బహుదూర్ల భూములను పంచిన అన్నలే.. ఇవాళ నయాం అనుచరులై బేగరి కంచెల (ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీ) రౌడీ దర్బార్లు పెట్టిండ్రట. నాడు సాగు చేసుకొమ్మని రైతుకు ఇచ్చిన భూములకు నేడు కబ్జా హక్కును రద్దు చేస్తున్నరట. కబ్జా రద్దు పరిచిన భూములకు కూడా అగ్రిమెంట్లు చేస్తున్నరట. అగ్రిమెంట్లు, ఆక్రమణ వెనుక ఎవరున్నారనే మీమాంసను పక్కనపెడితే.. ముళ్లకంచెలో కృత్రిమ రియల్ ప్రకంపనలు జనించటమే హైడ్రా అంతర్గత వ్యూహమా?

> **కూడు, గూడు, గుడ్డ కమ్యూనిస్టు సిద్ధాంతం. కూడు దొరికేది వ్యవసాయ భూమిలోనే. కమ్యూనిస్టు కార్యాలయాలు ప్రజా పోరాటాల కేంద్రాలని కామ్రేడ్లు నిత్యం నినదిస్తుంటారు. రాజ్యానిది ఎప్పుడూ బలవంతమే. కాపు కాయాల్సిన బాధ్యత కామ్రేడ్ల మీదుంది.**

ఇప్పటి ప్రజా పోరాటాల్లో అతి బలమైనది సొంతింటి కలే. సర్కారు భూముల్లో ఎర్ర జెండాలు పాతమని ఒక్క పిలుపిస్తే.. వేల మంది బీద బిక్కి, బక్క జనాలు లాఠీలకు, తూటాలకు ఎదురుబోతరు. 60 గజాల ఇంటి జాగ కోసం ఆత్ర పడుతరు. అటువంటిది దశాబ్దాలుగా తనువుతో పెనువేసున్న పేదింటికి హైడ్రా రూపంలో ఆపద వచ్చింది. మరో వైపు పల్లె పొలిమేర మీద ట్రిపుల్‌ఆర్ కత్తి వేలాడుతున్నది. దొంగ రాత్రి పంటపొలాల మీద డ్రోన్లు తిరుగుతున్నయి. రాత్రికిరాత్రే హద్దులు గీసిపోతున్నయి. ఏ క్షణం ఊర్ల మీద పడి భూములు లాక్కుంటారోనని రైతాంగం భయపడుతోంది. ఈ విపత్తును అడ్డుకునే శక్తి ఏది? ప్రజా ఉద్యమాలే కదా..! మరి ఇప్పుడా ఆపన్న హస్తం ఏది? అన్న స్థానంలో నిలబడి ఆదుకోవాల్సిన ఉద్యమకారులు, ఎర్రన్నలు ఎందుకు సందేహిస్తున్నరు.

ఎన్ కన్వెన్షన్ కూల్చినప్పుడు శభాష్..! అని జబ్బలు చరిచిన సీపీఐ నారాయణకు మనస్ఫూర్తిగా విప్లవాభివందనాలు. అవినీతి, అక్రమం కూలాల్సిందే. అదే హైడ్రా రెండు బలమైన అడుగులు వేయకముందే గతితప్పి పేదల కొంపల మీదికి మల్లుతుంటే.. ఎదురెందుకు వెళ్లటం లేదు? రోకు తప్పిన హైడ్రా పట్టుమని పది ఫామ్‌హౌస్‌లు కూల్చకముందే వెయ్యి బక్క గూళ్లను చిదిమేసింది. బేగరి కంచెల సెటిల్‌మెంట్లు పెట్టింది. ఇప్పుడు ఉద్యమ గొంతులు ఏకం కావాలని సకల జనులు వాంఛిస్తున్నరు. ■



బీజేపీకి ఆ హక్కు లేదు!

రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై మాట్లాడాలని, నిరసన తెలపాలని బీజేపీ నన్ను సంప్రదించింది. ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు రెండు రోజుల పాటు నాపై తీవ్రంగా ఒత్తిడి చేశారు. కానీ, వారు చెప్పినట్టు నేను చేయలేదు, చేయబోను కూడా. ఫలానా పని చేయాలంటూ నన్ను ఆదేశించే హక్కు బీజేపీకి లేదు.

- రాజారత్న అంబేద్కర్, బీఆర్ అంబేద్కర్ మునిమనవడు

ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులే గేమ్‌చేంజర్లు

- పర్యావరణహిత సుస్థిర అభివృద్ధిలో వారిని భాగస్వామ్యం చేయాలి
- ఢిల్లీలో యునెస్కో పర్యావరణ సదస్సులో మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రకృతి పరిరక్షణలో పాఠశాల, కాలేజీ విద్యార్థులను గేమ్ చేంజర్లుగా తీర్చిదిద్దాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. పర్యావరణహిత సుస్థిర అభివృద్ధిలో విద్యార్థులను మరింతగా భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం 'సుస్థిర పర్యావరణం- విద్యార్థుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఢిల్లీ ఇండియా హాబిటాట్ సెంటర్‌లో (రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ సస్టెయినబిలిటీ ఎడ్యుకేషన్-ఐసీఎస్ఈ) యునెస్కో పర్యావరణ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నుంచి పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖులతోపాటు కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ మాజీ సెక్రటరీ ప్రవీణ్ గారె, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పద్మశ్రీ కార్తికేయ సారాభాయ్, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ పాల్గొని ప్రసంగించారు. అడవులను కాపాడటం, నీటి వనరుల రక్షణ ప్రస్తుతం సమాజం ముందున్న అతిపెద్ద సవాల్ అని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులకు ఈ విషయాలపై తగిన అవగాహన కల్పించేలా క్షేత్రస్థాయి పర్యటనతో కూడిన బోధనా విద్య ఉండాలని సూచించారు. పర్యావరణ విద్యలో క్షేత్రస్థాయిలో పరిశీలన, విద్యార్థులకు అవగాహన కూడా అత్యంత ముఖ్యమైన విషయమని అభిప్రాయపడ్డారు.

అరావళిలో మొక్కనాటిన సంతోష్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఢిల్లీలోని వసంత్‌విహార్ సమీపంలోని అరావళి ఫారెస్టును మాజీ ఎంపీ, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండర్ సంతోష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా అక్కడ అరావళి టీం సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. 2004కు పూర్వం అరావళి ఫారెస్ట్ అంతటా డంపింగ్ యార్డ్, మైనింగ్ జరుగుతూ ఉండేది. మైనింగ్ నుంచి రక్షించాలని స్థానిక ప్రజలు కోర్టుకు వెళ్లడంతో ఫారెస్ట్‌ను రక్షించాలని కోర్టు ఆదేశించింది. దాంతో ఢిల్లీ సర్కార్ పార్క్ అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించింది. ప్రొఫెసర్లు హుస్సేన్, దిశాంత్, అరావళి టీం 700 ఎకరాల్లో అడవిని సంరక్షించి, సుందరంగా తయారుచేశారు. ఈ అడవిలో ప్రస్తుతం 150 రకాల సీతాకోకచిలుకల జాతులు, 120 రకాల పక్షులు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి గుంతలను ఇంకుడు గుంతలుగా మార్చడంతో భూగర్భ జలాలు సైతం పెరిగాయి.

విద్యార్థులకు అవార్డులు అందజేసిన సంతోష్

గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ వివరించారు. ప్రకృతి పునరుద్ధరణలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటడం, సమాజంలో ప్రభావిత వ్యక్తులను భాగస్వాములను చేయడం లాంటి కార్యక్రమాలను గత ఏడేండ్లుగా చేపడుతున్నట్టు వెల్లడించారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ స్ఫూర్తిని సమావేశంలో పాల్గొన్న వక్తలు అభినందించారు. వివిధ స్కూళ్లలో విద్యనభ్యసిస్తూ పర్యావరణ పరిరక్షణపరంగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు సంతోష్‌కుమార్ చేతులమీదుగా నిర్వాహకులు అవార్డులను అందజేశారు. రానున్న రోజుల్లో పర్యావరణపరంగా మానవాళికి పొంచి ఉన్న ముప్పును ఇప్పటి నుంచే విద్యార్థులకు తెలియజేసి, ప్రకృతి పట్ల తగిన బాధ్యతతో ప్రవర్తించాల్సిన తీరును వారికి నేర్పాల్సిన అవసరం ఉన్నదని క్లైమెట్ రియాలిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఇండియా, సౌత్ ఆసియా) డాక్టర్ ఆదిత్య పండిట్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పర్యావరణ మార్పులు తద్వారా ఎదుర్కోబోయే సమస్యల పట్ల విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కలిగించేలా సిలబస్‌లో మార్పులతోపాటు తరగతి గదుల్లో కూడా ఆ విధమైన విద్య అభ్యసించేలా ఉండాలని అందుకు తగిన మార్పుచేర్పులను కేంద్రం చేపట్టాలని నిపుణులు సూచించారు. పర్యావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్‌పై అధ్యయనం చేస్తున్న వివిధ దేశాల శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు ప్యానెల్ చర్చల్లో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో రీతురాజ్ పుకాన్, గ్రీన్ ఇండియా చాలెంజ్ సమన్వయకర్తలు కరుణాకర్‌రెడ్డి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.



అరావళి ఫారెస్టులో మొక్కను నాటుతున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

పర్యావరణ ఉద్యమంలో భాగమవడం గర్వంగా ఉన్నది: సంతోష్

యునెస్కో సదస్సులో భారతదేశపు ప్రముఖ పర్యావరణ పరిరక్షకులు, వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్, ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ జాదవ్ పాయెంగ్‌తో కలిసి వేదిక పంచుకోవడం గర్వంగా ఉన్నదని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ తెలిపారు. పర్యావరణాన్ని పెంపొందించడంలో, స్థిరత్వం కోసం విద్యను ప్రోత్సహించే యంగ్ ఇన్నోవేటర్స్ నడిపించే అద్భుతమైన ఎకో-ప్రాజెక్టులను ప్రత్యక్షంగా చూడటం గొప్ప అనుభూతి కలిగించిందని పేర్కొన్నారు. మనందరి భవిష్యత్‌ను పచ్చగా, ప్రకాశవంతంగా మారుస్తున్న ఈ ఉద్యమంలో భాగమవడం మరింత గర్వంగా ఉన్నదని ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తంచేశారు.

త్వరలో మద్యం ధరల పెంపు?

- పెరిగిన ధరల్లో ప్రధాన వాటా కంపెనీలకే
- సర్కారు ఖజానాను కొల్లగొట్టేందుకు భారీ కుట్ర
- తెలుగు రాష్ట్రాల్లో ఒకే తీరు ధరలకు కసరత్తు
- చక్రం తిప్పుతున్న పొరుగు రాష్ట్రపు అనుంగుడు
- అస్మదీయులకే మద్యం సరఫరా కాంట్రాక్టులు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య లిక్కర్ బంధం మంచి కిక్కుమీదున్నట్టు తెలుస్తున్నది. అస్మదీయ డిస్టిలరీలకు, బ్రూవరీలకు, సప్లయ్ కంపెనీలకు కాంట్రాక్టులు కట్టబెట్టే దగ్గర నుంచి, చట్టానికి, వైరిపక్షానికి దొరకకుండా ఖజానాను కొల్లగొట్టే మార్గాల అన్వేషణ వరకు అన్ని నిర్ణయాలు కూడబలుక్కొనే జరుగుతున్నట్టు సమాచారం. మొత్తంగా మద్యం ధరలను పెంచేసి.. ఆ పెంచిన మొత్తంలో సింహభాగం మద్యం కంపెనీలకే దక్కేలా విధానాలు రూపొందిస్తున్నట్టు తెలుస్తున్నది. పొరుగు రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విధానానికి తుదిరూపునిస్తున్నారు. అది పూర్తవగానే.. దానికి తగ్గట్టుగా తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తున్నది. మరో పక్షం రోజుల్లో ప్రతి క్వార్టర్ లిక్కర్ ధరను కనిష్ఠంగా రూ.10 నుంచి గరిష్ఠంగా రూ.160 వరకు పెంచే అవకాశం ఉంది.

ధరలు పెంచాలని కోరుతున్న కంపెనీలు

తమకు చెల్లించే బేసిక్ ధరలు పెంచాలని డిస్టిలరీలు, బ్రూవరీలు, లిక్కర్ సరఫరా కంపెనీలు ఎప్పటినుంచో కోరుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లో రెండేండ్లకోసారి మద్యం ధరలను పెంచుతుండగా, తెలంగాణలో గత కొన్నేండ్లుగా పెంచలేదనేది మద్యం కంపెనీల వాదన. మద్యం కంపెనీలకు కోరిన ధర చెల్లించటం ఆషామాషీ వ్యవహారం కాదు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా కాగ్ (కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తప్పు పడుతుంది. న్యాయస్థానాల్లో కేసులు పడతాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం అత్యంత పకడ్బందీగా వ్యవహరించింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం ధరలు పెంచటానికే మొగ్గు చూపుతున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. మద్యం కంపెనీలు సిండికేటుగా ఏర్పడి పొరుగు రాష్ట్రం నుంచి వ్యవహారం నడిపిస్తున్నట్టు నమ్మకమైన సమాచారం అందింది. అక్కడి అగ్రనేత కనుసన్నల్లోనే తెలంగాణ బ్రూవరేజస్ కార్పొరేషన్ (టీజీబీసీఎల్)లో వ్యవహారాలు సాగుతున్నట్టు తెలిసింది.

ధరల కమిటీలో అనుచరుడు

తెలంగాణలో మద్యం ధరలను నిర్ణయించటానికి టీజీబీసీఎల్ ఏర్పాటుచేసిన కమిటీలో అనూహ్యంగా పొరుగు రాష్ట్రం అగ్రనేతకు అనుంగునిగా ముద్ర ఉన్న రిటైర్డ్ బ్యూరోక్రాట్‌ను సభ్యునిగా చేర్చారు. తెలంగాణ ప్రభుత్వం అతడిని కీలక హోదాలో నామినేట్ చేసింది. తాజాగా ఆయనకే మద్యం ధరలను నిర్ణయించే బాధ్యతలు అప్పగించారు. జూలై 18న సమావేశమైన ఈ కమిటీ.. మద్యం కంపెనీలు తమ డిమాండ్ ధరలను కోట్ చేస్తూ సీల్డ్ కవర్ ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో 91 కంపెనీలు మద్యం సప్లయ్ చేయటానికి ముందుకు వచ్చాయి. మొత్తం 1032 బ్రాండ్లకు ధర కోట్ చేశాయి. ఇందులో 755 బ్రాండ్లు పాతవే కాగా, మరో 277 కొత్త బ్రాండ్లకు టెండర్లు పడ్డాయి. కొత్త వాటిలో సోం డిస్టిలరీతో పాటు కర్ణాటక, గోవా, మహారాష్టకు చెందిన డిస్టిలరీలు, 20 వరకు హైదరాబాద్‌లోనే రిజిస్ట్రేషన్ చేసుకున్న లోకల్ కంపెనీలు ఉన్నాయి. వివాదాస్పద సోం డిస్టిలరీకి తొలుత అనుమతినిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ తర్వాత ప్రతిపక్షాల విమర్శలతో వెనక్కి తగ్గి అనుమతిని తాత్కాలికంగా రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ఏపీలో ధరలు మనకన్నా ఎక్కువే

ప్రస్తుతం ఏపీలో మద్యం ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ ఎంత తగ్గించినా అది చీప్ లిక్కర్‌కే వర్తిస్తుంది. అక్కడి ధరలకు సమీపంగా ఉండేటట్టు తెలంగాణలో మద్యం ధరలను సవరించనున్నట్టు తెలిసింది. ఆ మేరకు పెంచే ధరల్లో సింహభాగం మద్యం కంపెనీలకే చెల్లించే విధంగా కసరత్తు జరుగుతున్నది. రెండు పక్కపక్క రాష్ట్రాల మద్యం ధరలు, డిస్టిరీలకు చెల్లింపులు, సుంకాలు ఒకే తరహాలో ఉంటే న్యాయపరమైన ఇబ్బందులు ఉండవు. కాగ్ కూడా పొరుగు రాష్ట్రాల ఎమ్మార్పీ, బేసిక్ ధరలను సరిపోల్చి నివేదికలు రూపొందిస్తుంది. వచ్చే నెల మొదటి వారంలో పొరుగు రాష్ట్రం నూతన పాలసీ వెలువడే అవకాశం ఉంది. ఆ తరువాతనే తెలంగాణ ధరల నిర్ణయ కమిటీ అక్టోబర్ నెలాఖరులోగా నివేదిక ఇచ్చే అవకాశం ఉంది.

ప్రస్తుత చెల్లింపులు ఇలా..

దేశీయ మద్యం తయారీ కంపెనీలు (డిస్టిలరీలు) టీఎస్‌బీసీఎల్‌కు విక్రయించే ధరలను బట్టి చీప్ లిక్కర్, మీడియం లిక్కర్, ప్రీమియం లిక్కర్‌గా నిర్ధారిస్తారు. ఇవి కాకుండా విదేశీ మద్యం అదనం. డిస్టిలరీలకు చీప్ లిక్కర్‌పై పెట్టెకు (12 ఫుల్ బాటిల్స్) రూ. 450 లోపు, మీడియం లిక్కర్‌కు రూ. 750, ప్రీమియం లిక్కర్‌కు రూ. 750 కన్నా ఎక్కువగా టీఎస్‌బీసీఎల్ చెల్లిస్తున్నది. ప్రీమియం (స్ట్రాంగ్) బీర్ల పెట్టెకు రూ 313.78, లేగర్ (లైట్) బీర్ల పెట్టెకు రూ. 289.22 చొప్పున చెల్లిస్తున్నది. చీప్ లిక్కర్‌కు, బీరుకు బేసిక్ మీద రూ 100, మీడియం, ప్రీమియం మద్యం మీద రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా చెల్లించాలని మద్యం కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆ మేరకు సామనుకూల నిర్ణయాలు తీసుకునే దిశగానే అడుగులు పడుతున్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి.



ర్యాలీలో పాల్గొన్న ఆర్ కృష్ణయ్య

బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ముషీరాబాద్, సెప్టెంబర్ 20 : స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యానగర్, ఉస్మానియా యూనివర్సిటీ, శంకర్‌మఠ్ వరకు వేలాది మందితో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఎన్నికల వాగ్దానాలు అమలుచేయడం లేదని, బీసీ రిజర్వేషన్లు పెంచకుండా కాలాయాపన చేస్తుందని ఆరోపించారు. ఫీజు బకాయిలు రూ.4,500 కోట్లను వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని, 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని, కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేముల రామకృష్ణ, ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేశ్, అంజి, అనంతయ్య పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మార్పు ఎందుకోసం?

III తరువాయి...

అలైన్‌మెంట్ ఖరారుకు 12 మంది అధికారులతో కమిటీని వేశామని తెలిపిన మంత్రి పొంగులేటి.. అసలు అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరమేమిటో మాత్రం వివరించలేదు. సాధారణంగా సాంకేతిక సమస్యలున్న చోట మార్పులు చేయడం సహజం. అందుకు ప్రత్యేకంగా ఓ కమిటీ అవసరం లేదు. ఇందుకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖరారైన ఉత్తర భాగం అలైన్‌మెంట్ నిదర్శనం. కానీ ప్రభుత్వం దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో భారీ ఎత్తున మార్పులు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఆ విషయాన్ని సూటిగా చెప్పకుండా అధికారుల భుజం మీద పెట్టి తమ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే నిజమైతే.. ఈ భారీ మార్పులకు ఎన్‌హెచ్ఏఐ అంగీకరిస్తుందా? అన్నది కీలకంగా మారింది. ఒకవేళ అంగీకరించకపోతూ కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.12,500 కోట్లను కోల్పోవాల్సి వస్తుందనేది సుస్పష్టం. ఈ విషయం తెలిసినా ప్రభుత్వం కమిటీ వేసిందంటే ప్రపంచ బ్యాంకు రుణం వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తున్నది.

ఆ ప్రజంటేషన్‌లోని మార్పుల కథేమిటో?

చాలాకాలంగా దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆ మేరకు క్షేత్రస్థాయిలో లీ అసోసియేట్స్ సర్వేలు చేపట్టి.. సంబంధిత గ్రామాల్లో గుర్తులు కూడా పెట్టింది. రాత్రి వేళల్లో డ్రోన్లతో సాంకేతిక సర్వేలు కూడా చేశారు. వాటన్నింటినీ క్రోడీకరించిన అధికారులు కొన్నిరోజుల కిందట పాత, కొత్త అలైన్‌మెంట్లతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ కూడా రూపొందించారు. దానినే ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ప్రదర్శించగా.. ఈ మార్పులపై ఏ ఒక్క అధికారి నోరు విప్పొద్దనే హుకుం జారీ అయినట్టు తెలిసింది. దీంతో అసలు ఆ ప్రజంటేషన్‌లో ఉన్న మార్పులు సూచించినదెవరు? ప్రభుత్వ పెద్దల ఆదేశం లేనిదే అధికారులు అలైన్‌మెంట్‌ను మార్చే సాహసం చేస్తారా? ముఖ్యంగా సీఎం ముందు మార్పులతో కూడిన అలైన్‌మెంట్‌ను ప్రదర్శించిన తర్వాత కొత్తగా చేసే మార్పులు ఏమిటి? అందుకు అధికారులతో కూడిన కమిటీ ఎందుకు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరముందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం అధికారులతో కమిటీ వేయడంతో ఇప్పటివరకు ఆందోళనలో ఉన్న గ్రామాల రైతుల్లో తీవ్ర చర్చ మొదలైంది. కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించి అలైన్‌మెంట్ మార్పులను సూచిస్తుందా? అనేది కీలకమైన విషయం. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకుంటారా? గ్రామసభలు నిర్వహిస్తారా? అనేది వేచిచూడాల్సి ఉంది. గతంలో రూపొందించిన అలైన్‌మెంట్‌పై రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత రాలేదు. అంటే ఇప్పుడు వాటిలో మార్పు జరిగితే రైతుల నుంచి భిన్నమైన స్పందన వస్తుందనేది సుస్పష్టం. అందుకే ఈ మార్పుల్లో రైతుల భాగస్వామ్యం ఉంటుందా? అనేది తేలాల్సి ఉంది.

స్పందన ఏది?

ప్రభుత్వ, కాంగ్రెస్ పెద్దల భూముల కోసం ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో మార్పునకు కుట్ర జరుగుతున్నదంటూ మూడు రోజులుగా 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురిస్తున్నది. రైతుల గోడును బయటి ప్రపంచానికి చేరవేస్తున్నది. కానీ ప్రభుత్వ పెద్దలు దేవుడెరుగు.. సంబంధిత శాఖ అధికారులైనా నోరెత్తితే ఒట్టు! వారిని సంప్రదించేందుకు ప్రయత్నించినా... 'మాకేం తెల్వదు మహాప్రభో!' అంటూ చేతులెత్తేస్తున్న పరిస్థితి. చిన్న వార్తలకే ఖండనలు పంపే సర్కారు యంత్రాంగం ట్రిపుల్ ఆర్ కథనాలపై ఎందుకు స్పందించడంలేదు? ప్రస్తుతం అధికార యంత్రాంగంలోనే కాదు.. ప్రజల్లోనూ ఇదే చర్చ జరుగుతున్నది.

క్యాబినెట్‌లో రైతుభరోసా ఊసేది?

- చర్చకురాని పెట్టుబడి సాయం అంశం
- రైతులకు తప్పని ఎదురుచూపులు
- 2 లక్షల రుణమాఫీపైనా నిరాశే

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రైతులు ఎంతగానో ఎదురుచూసిన రైతుభరోసాపై శుక్రవారం నాటి క్యాబినెట్ సమావేశంలోనూ ఎలాంటి చర్చ జరగలేదు. వానకాలం పెట్టుబడిసాయంపై క్యాబినెట్‌లో నిర్ణయం ఉంటుందని ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురైంది. దీంతో ఇప్పట్లో రైతుభరోసా పంపిణీ లేనట్టేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వానకాలం పంట మరో 10-15 రోజుల్లో చేతికి రానున్నది. అయి నా పెట్టుబడిసాయంపై ఎలాంటి నిర్ణయం లేకపోవటంపై రైతుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రైతుబంధును రైతుభరోసాగా మార్చిన కాంగ్రెస్.. ఏటా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది.

రుణమాఫీపైనా నిరాశే

ఇప్పటి వరకు రూ.2 లక్షల లోపు అరకొర రుణమాఫీ చేసిన సర్కారు.. రూ.2 లక్షలకుపై రుణం ఉన్న రైతులను గాలికి వదిలేసింది. వీరికి ఎప్పుడు రుణమాఫీ చేస్తారనే విషయంపై స్పష్టత ఇవ్వటం లేదు. రూ.2 లక్షలకుపైగా ఉన్న రుణంపై క్యాబినెట్‌లో విధివిధానాలు జారీచేస్తారన్న ప్రచారం జరిగింది. కానీ సమావేశంలో ఈ అంశంపైనా చర్చ జరగలేదు. దీంతో రూ.2 లక్షలకుపై రుణాలు ఉన్న రైతుల పరిస్థితి ఏమిటి? అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది. రూ.2 లక్షల రుణమాఫీలో భాగంగా 42 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు 23 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీచేసింది. ఇంకా 19 లక్షల మంది రైతుల రుణాలు రూ.13 వేల కోట్లు ఎప్పుడు మాఫీ చేస్తారంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

రేవంత్‌కు రిపోర్ట్ చేయొద్దు

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టు ఆదేశం
- దర్యాప్తు పురోగతిపై సీఎంకు నివేదిక ఇవ్వొద్దు
- రేవంత్ జోక్యం చేసుకుంటే కోర్టును ఆశ్రయించాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం సంభవించింది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి, హోం మంత్రిగా కూడా ఉన్న ఆయనకు దర్యాప్తు అధికారులు ఈ కేసుకు సంబంధించిన వివరాలను నివేదించవద్దని స్పష్టంచేసింది. ఓటుకు నోటు కేసు విచారణను భోపాల్‌కు బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లు దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వైద్యనాథన్‌తో కూడిన ధర్మాసనం వాదనలు ఆలకించింది. అనంతరం కేసును భోపాల్‌కు బదిలీ చేయాల్సిన అవసరంలేదని పేర్కొన్నది. అలాగే, ఇప్పటివరకు ఉన్న ప్రాసిక్యూటర్ కేసు తదుపరి ట్రయల్‌ను కూడా కొనసాగిస్తారని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరుపాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. అయితే, ఈ కేసులో కీలకంగా ఉండి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేసుకు సంబంధించిన పురోగతి, నివేదికలను ఇవ్వరాదని ఆదేశించింది. హోం మంత్రిగా కూడా ఆయనే ఉన్నందున రేవంత్‌కు ఏసీబీ రిపోర్ట్ చేయవద్దని ఆదేశించింది. ఏసీబీ డీజీపీ సీఎం/హోంమంత్రికి రిపోర్టు చేయవద్దని, ఒకవేళ చేసినట్టు పిటిషనర్ వద్ద ఆధారాలుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

నోరు జాగ్రత్త..

ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల పట్ల కాంగ్రెస్ పార్టీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన క్షమాపణలను సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు స్పందిస్తూ కోర్టు తీర్పుల పట్ల విమర్శనాత్మకమైన అభిప్రాయం చెప్పే హక్కు ఎవరికైనా ఉంటుందని అన్నారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న నేతలు బహిరంగంగా వ్యాఖ్యలు చేసే ముందు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ప్రస్తుత దశలో ఈ కేసులో జోక్యం చేసుకోలేమని అంటూ విచారణను సుప్రీంకోర్టు ముగించింది. శాసన, న్యాయ, పరిపాలనా వ్యవస్థలు తమ విధులను రాజ్యాంగబద్ధంగా నిర్వహించాలని ధర్మాసనం అభిప్రాయపడింది.

హైడ్రాకు సూపర్ పవర్స్

- చట్టబద్ధత, సర్వాధికారాల కల్పన
- 3 యూనివర్సిటీలకు పేర్లు మార్పు
- ఎస్ఎల్బీసీ టన్నెల్ పనుల అంచనాలు పెంపు
- ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు బోనస్
- కొనుగోళ్లకు రూ.2,500 కోట్ల అదనపు బడ్జెట్
- జనవరి నుంచే రేషన్‌కార్డు హోల్డర్లకు సన్న బియ్యం పంపిణీ
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయాలు



మంత్రి మండలి సమావేశ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థల్లో అన్ని శాఖలకున్న అధికారాలను హైడ్రాకు కట్టబెట్టింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సర్కారు హైడ్రాకు సర్వాధికారాలు కట్టబెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరిగింది. అనంతరం వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాకు వివరించారు.

హైడ్రాకు విస్తృత అధికారాలు

హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఓఆర్ఆర్ లోపల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలపై హైడ్రా నిర్ణయం తీసుకోనున్నదని మంత్రులు తెలిపారు. ఇందుకోసం ఓఆర్ఆర్ లోపలి పట్టణ స్థానిక సంస్థల్లోని అన్ని శాఖలు, విభాగాలకు ఉన్న అధికారాలు, స్వేచ్ఛలను హైడ్రాకు కట్టబెడుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఇందులో పనిచేసేందుకు వివిధ విభాగాల నుంచి 169 మంది అధికారులు, 946 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను డిప్యూటేషన్ మీద బదిలీ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

మూడు వర్సిటీలకు పేర్లు మార్పు

రాష్ట్రంలోని మూడు యూనివర్సిటీలకు పేర్లను మార్చుతూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. కోఠిలోని మహిళా యూనివర్సిటీని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీగా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు యూనివర్సిటీగా మార్చినట్టు తెలిపారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టారు.

రెండేండ్లలో ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు పూర్తి

శ్రీశైలం ఎడమకాలువ టన్నెల్ పనులకు సంబంధించిన అంచనాలను రూ.4,637 కోట్లకు సవరించినట్టు మంత్రులు తెలిపారు. 2027 సెప్టెంబర్ నాటికి టన్నెల్ పనులతో పాటు డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పెండింగ్ పనులను పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించామని చెప్పారు. టన్నెల్ పూర్తయితే శ్రీశైలం ప్రాజెక్టులో డెడ్ స్టోరేజ్ నుంచి కృష్ణా జలాలను తీసుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రతి నెలా 400 మీటర్ల చొప్పున రెండేండ్లలో టన్నెల్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు బోనస్

ఈ ఏడాది ఖరీఫ్ నుంచే సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఇందుకోసం పంట కొనుగోళ్ల బడ్జెట్‌కు అదనంగా రూ.2,500 కోట్లు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. కొత్త, పాత రేషన్‌కార్డులకు కలిపి వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌పై కమిటీ

ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ ఖరారు చేసేందుకు 12 మంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రులు తెలిపారు. ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని, ఇందులో రెవెన్యూ, మున్సిపల్ శాఖల కార్యదర్శులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.

క్యాబినెట్ ఇతర నిర్ణయాలు..

- ప్రస్తుతం అమల్లో ఉన్న పోలీస్ ఆరోగ్య భద్రత పథకాన్ని ఎస్పీఎల్ కింద వర్తింపజేయాలని నిర్ణయించింది.
- మనోహరాబాద్‌లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్‌కు 72 ఎకరాల భూమిని రెవెన్యూ శాఖ నుంచి తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు బదిలీ చేయడానికి మంత్రివర్గం ఆమోదించింది.
- ఖమ్మం జిల్లా ఎర్రిపాలెం మండలంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 58 ఎకరాల భూమి కేటాయింపు
- ములుగు జిల్లా ఏటూరు నాగారంలోని ఫైర్‌స్టేషన్‌కు 34 మంది సిబ్బంది మంజూరు.
- రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎనిమిది మెడికల్ కాలేజీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ మూడు వేలకు పైగా పోస్టులు మంజూరు. త్వరలో నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయం.
- కోస్గికి ఇంజినీరింగ్ కాలేజీ, హకీంపేటలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం.

హాస్టల్ విద్యార్థికి పాముకాటు

ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట, సెప్టెంబర్ 20: ఇటీవల జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం గురుకులంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఓ విద్యార్థి పాముకాటుకు గురికావడం ఘటనలు మరువకముందే.. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి బీసీ హాస్టల్‌లో మరో విద్యార్థిని పాము కాటేసింది. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన రమావత్ చంద్రూనాయక్-రజిత దంపతుల కుమారుడు రోహిత్ (12) ఇటీవల ఇల్లంతకుంట మండలం గాలిపల్లిలోని బీసీ హాస్టల్‌లో చేరాడు. అదే గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం హాస్టల్ రూంలో ఉండగా పాము కాటేయడంతో అరుస్తూ బయటికి పరుగులు తీశాడు. దవాఖానకు తీసుకెళ్లగా క్షేమంగా ఉన్నట్టు తెలిసింది. పామును హాస్టల్ సిబ్బంది చంపేశారు.



సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో చికిత్స పొందుతున్న విద్యార్థి రోహిత్

చిన్న బిల్లులకూ ఆర్థిక మంత్రినే అడగాలా?

- మంత్రులందరినీ సమానంగా చూడటం లేదు
- క్యాబినెట్‌లో మంత్రులు గరంగరం!
- అధికారులను బయటికి పంపి గంటపాటు చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సచివాలయంలో శుక్రవారం జరిగిన మంత్రిమండలి సమావేశం వాడివేడిగా సాగినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దాదాపు 3 గంటలపాటు క్యాబినెట్ సమావేశం జరగగా.. సుమారు గంటసేపు అధికారులను బయటికి పంపి సీఎం, మంత్రులు మాత్రమే చర్చించుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా పలువురు మంత్రులు తమ ఆవేదన వెళ్లగక్కినట్టు తెలిసింది. తమ శాఖల పరిధిలో బిల్లులు మంజూరు కావటం లేదని, తాము సిఫారసు చేసినా చిన్న కాంట్రాక్టర్లకు కూడా బిల్లులు రావటం లేదని అసహనం వ్యక్తం చేశారట. రూ.5-10 లక్షలకు కూడా ఆర్థికమంత్రి వైపే చూడాలా? ఇలా అయితే మాకు మంత్రి పదవులు ఎందుకు? అని ఒకరిద్దరు గట్టిగా మాట్లాడినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కొందరు అధికారులు తమను తక్కువగా చూస్తున్నారంటూ మంత్రులు ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. సమావేశంలో ఎక్కువగా ఆర్ఆర్ఆర్, హైడ్రాపైనే చర్చ జరిగినట్టు తెలుస్తున్నది. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్‌పై 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనాలపైనా చర్చ జరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే కమిటీని వేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పుకుంటున్నారు. హైడ్రామీద ఎన్ని విమర్శలు వచ్చినా పట్టించుకోవద్దని సీఎం సూచించినట్టు సమాచారం. మంత్రులు శాఖలవారీగా సమీక్షలు పెట్టాలని, పట్టు పెంచుకోవాలని సూచించినట్టు తెలిసింది.

సీనియర్ ఫ్యాకల్టీని కొనసాగించాల్సిందే

- అవగాహన లేని నూతన టీచర్లతో బోధన సరికాదు
- గురుకులంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- సమస్యలను పరిష్కరించాలని అడిగితే వేధింపులా.?
- గౌలిదొడ్డి గురుకుల కళాశాల ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

కొండాపూర్, సెప్టెంబర్ 20: గతంలో కొనసాగిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను కొనసాగించాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులకు సక్రమంగా వేతనాలు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. శుక్రవారం శేరిలింగంపల్లి పరిధిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఎదుట ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఉపాధ్యాయులను తొలగించడం, ఉత్తమ ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం మధ్యలో మార్చడం కారణంగా విద్యార్థుల చదువుకు ఇబ్బంది కలుగుతుందని వాపోయారు. ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ... కళాశాల ఉపాధ్యాయులను బదిలీ చేయడం తోపాటు కాంట్రాక్టు పద్ధతిలో ఎనిమిదేండ్లుగా కొనసాగుతున్న సబ్జెక్ట్ టు అసోసియేట్స్‌ను తొలగించారని పేర్కొన్నారు. వారి స్థానంలో వచ్చిన కొత్తవారికి కనీస అవగాహన లేకపోవడంతో విద్యార్థులు చదువుల్లో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం వేధిస్తున్నదని పేర్కొన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తున్న విద్యార్థులను కళాశాల ఉన్నతాధికారులు టార్గెట్ చేస్తున్నారని, తమ పిల్లలకు ఏమైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



శేరిలింగంపల్లి పరిధిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ఎదుట ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం, పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



చెరువుల మ్యాపులు తప్పుల తడక

మొదటిపేజీ తరువాయి...

హెచ్‌ఎండీఏ నిర్లక్ష్యం చూపుతున్నదని పౌరహక్కుల నేత లుబ్నా సార్వత్ ఆరోపించారు. చెరువులను పరిరక్షించే బాధ్యతను భుజాన వేసుకున్న హెచ్‌ఎండీఏ.. ఆ విధులను నిర్వర్తించడంలో విఫలమవుతున్నదని ధ్వజమెత్తారు. యాదాద్రి భువనగిరి జిల్లా అనాజీపూర్ గ్రామ పరిధిలో ఉండే పెద్ద చెరువు (లేక్ ఐడీ-3354)కు 2015లో ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేయగా, ఇప్పటివరకు తుది నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదని ప్రశ్నించారు. ప్రిలిమినరీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలు తప్పులుగానే ఉన్నాయని ఆరోపించారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు (లేక్ ఐడీ 1954), బాలానగర్‌లోని సున్నం చెరువు (లేక్ ఐడీ 4805) వివరాలు కూడా తప్పులుగానే ఉన్నాయని పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ లేక్స్ వెబ్‌సైట్‌లో 2,569 చెరువుల ఎఫ్టీఎల్, క్యాడస్ట్రల్ మ్యాపులను సరిచూసుకోవాలని, వాస్తవాలకు భిన్నంగా మ్యాపుల్లో మార్పులు ఉన్నట్టుగా అనుమానాలను వ్యక్తం చేశారు. కొన్ని చెరువుల మ్యాపులు అందుబాటులోనే లేకుండా పోయినట్టుగా తెలిపారు. ఆ జాబితాలో గండిపేటకు సమీపంలోని మంచిరేవుల వద్ద ఉండే నాగిరెడ్డి కుంట లేకుండానే పోయిందని ఆరోపించారు.

తిరుమల లడ్డూపై దుమారం

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై వివాదం దేశ వ్యాప్తంగా దుమారం రేపుతున్నది. లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు ఉన్నాయంటూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. దీంతో రాజకీయ పార్టీల మధ్య వార్ కొనసాగుతున్నది. తాజాగా శుక్రవారం పలువురు రాజకీయ ప్రముఖులు, నేతలు స్పందించారు.

- కల్తీ నెయ్యిపై దేశవ్యాప్త చర్చ
- 100రోజుల పాలన, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి మళ్లించేందుకే చంద్రబాబు కట్టుకథ : మాజీ సీఎం జగన్
- నాణ్యత లోపం నిజమే: టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి
- భక్తుల విశ్వాసాన్ని తగ్గించే కుట్ర: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): వైసీపీ ప్రభుత్వ హయాంలోనే లడ్డూ తయారీకి జంతువుల కొవ్వును ఉపయోగించారంటూ సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలను ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తప్పుబట్టారు. దేవుడ్ని కూడా రాజకీయాలకు వాడుకునే దుర్మార్గమైన మనస్తత్వం చంద్రబాబుది అంటూ జగన్ ఆరోపించారు. చంద్రబాబు చెబుతున్నదంతా ఓ కట్టుకథగా అభివర్ణించారు. నెయ్యి శాంపిళ్లపై రెండు నెలల కిందటే నివేదిక వస్తే ఇన్ని రోజులు ఏం చేశారని చంద్రబాబును ప్రశ్నించారు. వందరోజుల పాలన, సూపర్ సిక్స్ హామీల అమలుపై టీడీపీ కూటమిని ప్రజలు ప్రశ్నిస్తారనే చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు.

- తిరుమల లడ్డూ నాణ్యతపై కొంతకాలంగా భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఈవో జె.శ్యామలరావు శుక్రవారం తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత జూలై 6, 12తేదీల్లో నెయ్యిని ల్యాబ్‌కి పంపినట్లు తెలిపారు. ఏఆర్ డెయిరీ సరఫరా చేసిన నెయ్యిలో నాణ్యత లేదని టెస్టుల్లో తేలిందని వెల్లడించారు.
- లడ్డూ వివాదం హిందువుల మనోభావాలను కలిచి వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. టీటీడీపై భక్తుల విశ్వాసాన్ని సడలించేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. సీబీఐతో విచారణ జరిపించాలని సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.
- భారత ప్రధాన న్యాయమూర్తికి జర్నలిస్టు సురేశ్ హన్కే న్యాయవాది ద్వారా లేఖ రాశారు. ఈ వ్యవహారంలో తక్షణమే సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని తగిన ఆదేశాలు జారీచేయాలని విజ్ఞప్తిచేశారు.
- ప్రసాదాల నాణ్యతపై గతంలో టీటీడీ చైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లానని టీటీడీ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు అన్నారు. ఆవు నెయ్యిని కల్తీ చేయడం దారుణమైన విషయమన్నారు.
- టెస్టుల్లో ఎలాంటి లోపాలు లేవని తేలినట్టు ఏఆర్ డెయిరీ యాజమాన్యం ప్రకటించింది. కానీ, తమ సంస్థపై విష ప్రచారం చేస్తున్నారని పేర్కొంది.
- లడ్డూ ప్రసాదంపై ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమేనని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టంచేశారు. ఆరోపణలపై తాను కుటుంబంతో సహా ప్రమాణం చేస్తానని, చంద్రబాబు కూడా ప్రమాణం చేయాలని డిమాండ్ చేశారు.
- దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సినీనటుడు ప్రకాశ్‌రాజ్.. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఎక్స్ వేదికగా కోరారు.
- తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని సీపీఐ సీనియర్ నేత నారాయణ కోరారు.

నెయ్యి టెండర్లు జరిగింది ఇలా..

నెయ్యి కొనుగోలుకు టీటీడీ 2024 మార్చి 12న టెండర్ వేసినట్లు పేర్కొంది. మే 8న టెండర్ ఖరారైంది. ఆ తర్వాత తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీకి ఈ ఆర్డర్ వచ్చింది. కంపెనీ స్వచ్ఛమైన ఆవు నెయ్యి కిలో ధర రూ.319గా పేర్కొన్నది. జూలై 6 - జూలై 12 మధ్య నాలుగు, జూలై 15 నుంచి ఆగస్ట్ 6వ తేదీ వరకు 6ట్యాంకర్లను పంపింది. జూలై 6, 12 తేదీల్లో పంపిన ట్యాంకర్ల నమూనాల్లో అవకతవకలు జరిగినట్లు గుర్తించింది. గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ ల్యాబ్‌కు శాంపిళ్లు పంపి మిగతా ట్యాంకర్లను నిషేధించారు.

తిరుమల లడ్డూకు 300 ఏండ్ల చరిత్ర

తిరుమల శ్రీవారి ప్రసాదంగా లడ్డూ పంపిణీ సుమారు 300 ఏండ్ల కిందటే ప్రారంభమైంది.1715 ఆగస్టు 2న తొలిసారిగా లడ్డూను తిరుమల ప్రసాదంగా భక్తులకు అందించినట్టు చరిత్ర చెబుతోంది. 2010 వరకూ రోజుకు లక్ష వరకూ లడ్డూలను తయారు చేసేవారు. ఆ తర్వాత భక్తుల రద్దీకి అనుగుణంగా రోజుకు 3.20 లక్షల లడ్డూలను తయారుచేస్తున్నారు. లడ్డూకు 2014లో జీఐ గుర్తింపుతోపాటు పేటెంట్, ట్రేడ్‌మార్క్ రిజిస్టర్ కావడం విశేషం.

అమృత్ స్కీం.. టెండర్ల స్కాం

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం అయా కంపెనీలకు టెండర్లు కట్టబెట్టిందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల విషయాన్ని, వాటిని దక్కించుకున్న కంపెనీల వివరాలను మున్సిపల్ శాఖతో పాటు ఇతర ఈ టెండరింగ్ వెబ్ సైట్లలోనూ లేకుండా కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి, మేఘా కంపెనీ టెండర్లను దాదాపు 40 శాతానికి పైగా అంచనాలు పెంచారనే ఆరోపణలున్నాయని లేఖలో ప్రస్తావించారు. అమృత్ టెండర్ల విషయంలో సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తి గోప్యంగా ఉంచుతున్న నేపథ్యంలో కేంద్రం జోక్యం చేసుకొని వివరాలన్నీ బహిర్గతం చేసి మొత్తం వ్యవహారాన్నంతా పారదర్శకంగా ఉంచాలని కోరారు.

లేదంటే రేవంత్‌కు కేంద్రం వత్తాసు పలికినట్టే

సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన శోధ కంపెనీ ఇతర కంపెనీలతో కలిసి రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ప్రాజెక్టుల కాంట్రాక్టులను ఎలాంటి అర్హతలు లేకున్నా దక్కించుకుంటున్న వైనాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్ ఎత్తిపోతల కాంట్రాక్టులను సృజన్‌రెడ్డి కంపెనీతో పాటు గతంలో రేవంత్‌రెడ్డి అనేక ఆరోపణలు చేసిన మేఘా కంపెనీ, కేఎన్‌ఆర్ కంపెనీలకు అప్పగించారని పేర్కొన్నారు. కేఎన్‌ఆర్ కంపెనీలో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి వాటాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రాష్ట్రంలో తొమ్మిదినెలల కాలంలో పురపాలక శాఖ పరిధిలో జరిగిన అన్ని టెండర్లలోనూ ప్రత్యేకించి కేంద్రం నిధులతో కొనసాగే కార్యక్రమాల టెండర్ల విషయంలో నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్‌తోపాటు, స్థానిక బీజేపీ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నా స్పందన లేదని, సీఎం రేవంత్‌రెడ్డి పాల్పడుతున్న అవినీతిలో కేంద్ర భాగస్వామ్యం ఉన్నదని భావించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రాష్ట్ర సాధన పోరులో 'కొండా'ది కీలకపాత్ర

లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలకపాత్ర అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 1969లో మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు అని కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆయన సేవలను సీఎం స్మరించుకున్నారు. నిజాం వ్యతిరేక పోరులో ఓ వైపు పాల్గొంటూనే, మరోవైపు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వందేమాతరం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోనూ బాపూజీ భాగస్వామి అయ్యారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేగా, డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారని పేర్కొన్నారు.

కొత్త జూపార్క్ ఏర్పాటుపై అధ్యయనం

- 'వన్‌తారా'ను సందర్శించిన అటవీశాఖ అధికారులు
- రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక
- కొత్త జూపార్క్ అవసరం లేదు: పద్మనాభరెడ్డి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కొత్తగా నిర్మించనున్న ఫోర్త్‌సిటీలో కొత్త జూపార్కును ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో రాష్ట్ర అటవీ అధికారుల బృందం రెండ్రోజుల క్రితం గుజరాత్ జామ్‌నగర్‌లోని 'వన్‌తారా' జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించింది. వివిధ అంశాలపై అధ్యయనం చేసిన అధికారులు నివేదికను రూపొందించారు. జూపార్క్ ఏర్పాటు లక్ష్యం, జంతువులు, వాటి సంరక్షణ కోసం చేపట్టాల్సిన సౌకర్యాలపై అధ్యయనం చేశారు. రెండు వారాల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఓ సీనియర్ అటవీ అధికారి తెలిపారు.

200 ఎకరాల్లో జూపార్క్..

ప్రభుత్వ ప్రతిపాదిత ఫోర్త్‌సిటీ చుట్టుపక్కల సుమారు 18 వేల ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. తాడిపర్తి, మద్విన్, కురుమిద్ద, కడ్తాల్, నాగిలి అటవీ బ్లాకుల పరిధిలో 15 వేల ఎకరాల అటవీ భూమి ఉంది. గుమ్మడవెల్లి అటవీబ్లాక్‌లో మరో 2 వేల ఎకరాల రిజర్వ్ అడవి ఉంది. ఈ అటవీ బ్లాకులకు ఆనుకుని ఉండే రెవెన్యూ భూమిలో జూపార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఫోర్త్‌సిటీలో 200 ఎకరాల్లో జూపార్కు ఏర్పాటుచేసి దానికి అనుబంధంగా వెయ్యి ఎకరాల అటవీ ప్రాంతాన్ని గ్రీన్‌బెల్టుగా చూపాలని భావిస్తున్నది. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నిధులు, నిర్వహణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పాటుచేయాలని భావిస్తున్నది. కాగా కొత్త జూపార్క్ ఏర్పాటు ప్రతిపాదనను ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి వ్యతిరేకిస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై అధికారుల పక్షపాతం

- క్యాంప్ ఆఫీసులో చెక్కుల పంపిణీకి అనుమతి నిరాకరణ
- మండల ఆఫీసుకే రావాలని మాధవరం కృష్ణారావుకు సూచన
- తన ఇంటి వద్దనే చెక్కులు పంపిణీ చేసిన అరికెపూడి గాంధీ



కూకట్‌పల్లి మండల ఆఫీస్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు



వివేకానందనగర్‌లోని తన నివాసంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 20: ప్రొటోకాల్ పాటించే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల విషయంలో పక్షపాతం చూపొద్దని నిబంధనలు పేర్కొంటున్నా రాష్ట్రంలో అధికారులు, పోలీసుల వైఖరిలో మార్పు రావడం లేదు. మొన్నటికి మొన్న కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, బీఆర్‌ఎస్ శాసనసభ్యుడు కౌశిక్ రెడ్డి మధ్య వివాదం విషయంలో చూపిన పక్షపాత వైఖరిపై పోలీసులు విమర్శలు ఎదుర్కొనగా.. తాజాగా మండల రెవెన్యూ అధికారులు అదే వైఖరిని అవలంబించారు. కూకట్‌పల్లి మండలంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ వివాదాస్పదమైంది. కూకట్‌పల్లి మండల పరిధిలో ఇటు శేరిలింగంపల్లి, అటు కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి. లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయాల్సి ఉండగా, మండల అధికారులు ఒకరోజు ముందుగానే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఆహ్వానం పంపించారు. మండల కార్యాలయంలోనే చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. కూకట్‌పల్లిలోని క్యాంప్ ఆఫీస్‌లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తానని, అందుకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులను కోరారు. అలా కుదరదని, మండల ఆఫీస్‌లో నిర్వహించే వేదికపైనే ఇవ్వాలని తేల్చిచెప్పారు. దీంతో మండల కార్యాలయంలో నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై తన నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

అరికెపూడి ఇంటి వద్దనే పంపిణీ

మరోవైపు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చెక్కులను తన ఇంటి వద్దకే తీసుకురావాలని హుకుం జారీ చేయగానే మండల అధికారులు చెక్కులతో ఆయన ఇంటికి పరుగెత్తారు. లబ్ధిదారులకు చెక్కుల పంపిణీని ఆయన ఇంటి వద్దనే ఆయన చేతుల మీదుగా పంపిణీ చేయించారు. అధికారికంగా నిర్వహించే కార్యక్రమాలలో ఎమ్మెల్యేలందరికీ ఒకే విధమైన ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు ఇలా ఒక ఎమ్మెల్యే విషయంలో ఒకవిధంగా.. మరొకరి విషయంలో వేరేవిధంగా ప్రొటోకాల్ పాటించడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై కూకట్‌పల్లి తాసీల్దార్ స్వామిని వివరణ కోరగా..ఎమ్మెల్యే గాంధీ ఇంటివద్ద అధికారులతో కలిసే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారని, కొన్ని చెప్పలేని ఇబ్బందులు ఉన్నాయని అంటూ సమాధానం దాటవేశారు.

ఫిబ్రవరిలో 'వేవ్స్'కు భారత్ ఆతిథ్యం

సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి సంజయ్ జాజు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు ప్రపంచ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్మెంట్ సదస్సు (WAVES-వేవ్స్)కు భారత ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్‌ఏఎఫ్‌ఏయూ)ఆడిటోరియంలో శుక్రవారం వేవ్స్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. దేశ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ పరిశ్రమను బలోపేతం చేయడానికి, ఆ రంగానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చేందుకు వేవ్స్‌ను నిర్వహించనున్నట్టు చెప్పారు. వేవ్స్.. భారత్‌ను మీడియా ఎంటర్‌టైన్మెంట్(ఎంఈ) రంగంలో అపరిమితమైన గ్లోబల్‌శక్తిగా నిలపబోతుందని ధీమా వ్యక్తం చేశారు. 'క్రియేట్ ఇన్ ఇండియా' చాలెంజ్ వేవ్స్ సీజన్-1 ప్రారంభమైందని, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

తాసీల్దార్లను పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలి

రెవెన్యూ మంత్రి పొంగులేటికి ట్రెసా విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లను పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలని ట్రెసా(తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్) బాధ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్‌కుమార్ శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని 150 మంది తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను వివిధ ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారని, తిరిగి వారిని పూర్వపు జిల్లాలకు పంపించాలని మంత్రికి విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షులు కే నిరంజన్, బాణాల రాంరెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల అధ్యక్షులు రమణ్ రెడ్డి, చంద్రశేఖర్, మధుకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాహన చట్టం నిబంధనలపై వివరణ ఇవ్వండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 2019లో సవరించిన మోటరు వాహన చట్టం నిబంధనల అమలుపై పూర్తి వివరాలు సమర్పించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో ఈ నిబంధనలను అమలు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. వాహన రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీతో పాటు రవాణా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించిందని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారికి కఠిన శిక్షలు విధించాలని కొత్త నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని, అయితే ఆ నిబంధనల నిబంధనల అమలుపై నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసిందని వివరించారు. దీంతో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

ఎఫ్టీఎల్‌ను ఎలా నిర్ణయిస్తారు?

- అందుకు విధానాలేమిటి?
- నిబంధనలుంటే సమర్పించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్టీఎల్) పరిధిని ఎలా నిర్ణయిస్తారో చెప్పాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎఫ్టీఎల్‌ను నిర్ణయించేందుకు చట్టపరమైన నిబంధనలు గానీ, ప్రభుత్వ విధానాలు గానీ ఏమైనా ఉంటే సమర్పించాలని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని దుర్గంచెరువు ఎఫ్టీఎల్‌ను 160 ఎకరాలుగా ఏ ప్రాతిపదికన నిర్ణయించారో కూడా చెప్పాలని కోరింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టబేగంపేట గ్రామం సర్వే నంబర్ 47లోని అమర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న తన ప్లాట్‌లోని నిర్మాణాల్లో జోక్యం చేసుకోకుండా ఆదేశాలివ్వాలంటూ ఎల్ ఊర్మిళాదేవి అనే మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. నీటిపారుదల శాఖ మ్యాప్ ప్రకారం దుర్గం చెరువు ఎఫ్టీఎల్ 65 ఎకరాలు మాత్రమే ఉన్నప్పటికీ అధికారులు 160 ఎకరాలు ఉన్నట్టు చెప్తున్నారని, దీనివల్ల ప్రైవేట్ ఆస్తులన్నీ అందులోకి వస్తున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎఫ్టీఎల్ పరిధిలో ప్రైవేటు భూమి ఏమైనా ఉన్నట్టయితే భూసేకరణ చట్టం కింద ఆ భూమిని సేకరించాలని వివరించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ఎలాంటి చట్టం అమలులో లేని పక్షంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రామాణికమవుతుందని వ్యాఖ్యానించింది. ఎఫ్టీఎల్ నిర్ధారణకు అనుసరించే పద్ధతులు, నిబంధనలు ఏవైనా ఉంటే చెప్పాలని ప్రభుత్వాని ఆదేశించింది. ఒకవేళ లేని పక్షంలో మార్గదర్శకాలు జారీచేసే అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

రాష్ట్రంలో 3 రోజుల పాటు భారీ వర్షాలు

21 నుంచి 24వరకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. వాగులు, వంకలు ఉన్న ప్రాంతాల్లోనివారు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 21న నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో అక్కడకక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. 22న ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొన్నది. 23న ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, నిర్మల్, కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో అక్కడకక్కడ వానలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

ప్రపంచ సైంటిస్టుల జాబితాలో ఐఐటీహెచ్ అధ్యాపకులు

కంది, సెప్టెంబర్ 20 : ఐఐటీ హైదరాబాద్‌లోని 23 మంది అధ్యాపకులు స్టాన్‌ఫోర్డ్ ప్రపంచంలోని టాప్ 2 శాతం సైంటిస్టుల జాబితాలో చోటుదక్కించుకున్నారు. ఈ విషయాన్ని ఐఐటీహెచ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్ విడుదల చేసిన 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో వీరికి చోటు దక్కడంపై ఐఐటీహెచ్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అభినందించారు. 2023లో చేసిన పరిశోధన (23 ఫ్యాకల్టీ) ఆధారంగా ఈ జాబితాను రెండు వర్గాలుగా విభజించారు. ప్రపంచంలోని ప్రముఖ పరిశోధకులుగా గుర్తింపునిస్తుంది.


పెట్రోలియం కంపెనీలతో సీఈవో భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో వెయ్యి పెట్రోల్ అవుట్‌లెట్స్‌లో ప్రచారం చేయనున్నారు. ఇందుకోసం శుక్రవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో సీఈవో సుదర్శన్‌రెడ్డి పెట్రోలియం కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

ఇండ్ల అమ్మకాలు ఢమాల్!

మొదటిపేజీ తరువాయి...

వ్యవధిలో 1,26,848 యూనిట్ల అమ్మకాలు జరిగినట్టు పేర్కొన్నది. దీంతో 18 శాతం పతనానికి అవకాశాలున్నట్టు ప్రాప్ఈక్విటీ తెలిపింది.




12వేల యూనిట్లకే పరిమితం

హైదరాబాద్‌లో ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఇండ్ల అమ్మకాలు 12,082 యూనిట్లుగా ఉండొచ్చని ప్రాప్ఈక్విటీ చెప్తున్నది. గత ఏడాది ఇదే వ్యవధిలో 20,658 యూనిట్ల విక్రయాలు జరిగాయన్నది. దీంతో తాజా సర్వేలో అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే అత్యంత క్షీణత నమోదవుతున్నది. గత ఏడాదిదాకా దేశంలోనే అత్యంత ఎక్కువగా ఇండ్ల అమ్మకాలు ఇక్కడ జరిగిన విషయం తెలిసిందే. ముంబై, బెంగళూరు వంటి నగరాలనూ దాటుకొని గడిచిన పదేండ్లలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయింది. కానీ ఇప్పుడు సీన్ రివర్సైంది.

హైడ్రా ఎఫెక్ట్!

తాజా గణాంకాలను చూస్తే.. హైదరాబాద్‌లో ఇండ్ల అమ్మకాల తగ్గుదలకు 'హైడ్రా' భయాలే కారణమన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు చేసిన పనికి మొత్తం నిర్మాణ రంగమే మందగమనంలోకి వెళ్లిపోయిందని రియల్టర్లు, అనుబంధ రంగాల వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ లే-అవుట్లతో అమాయక జనాలు ఆగమైపోయారని, కొత్తగా కొనేందుకూ ఎవరూ ఆసక్తి చూపడం లేదని అంటున్నారు. చెరువుల చుట్టుపక్కల్లోనైతే చాలా దూరం వరకు అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, ఇండిపెండెంట్ హౌజ్‌లు, ఓపెన్ ప్లాట్ల జోలికి ఎవరూ వెళ్లడం లేదని, పెట్టిన పెట్టుబడులు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన చెందుతున్నారు. పరిస్థితులు ఇలాగే సాగితే నిర్మాణ రంగం.. మళ్లీ కరోనా సంక్షోభం నాటి పరిస్థితుల్ని చూడకతప్పదన్న ఆందోళనల్నీ కనబరుస్తున్నారు. నిజానికి దసరా, దీపావళి పండుగల సమయాల్లో హౌజింగ్ సేల్స్ ఊపందుకుంటాయి. కానీ నగరంలో ఆ సంకేతాలేవీ కనిపించట్లేదిప్పుడు.

రుణాలకు దారేది





నిబంధనల్ని కఠినతరం చేసిన బ్యాంకులు
సామాన్యులకు పుట్టని అప్పులు
గృహ, వాహన, వ్యక్తిగత, విద్యా రుణాలు జటిలం
రకరకాల కొర్రీలతో ఏ లోన్లూ దొరకని వైనం
కీలక రంగాలపైనా పెను ప్రభావం

రాజేశ్ వయసు 25. ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. వ్యక్తిగత రుణం కోసం బ్యాంకులను ఆశ్రయిస్తే నిరాశే ఎదురైంది. ఆ డాక్యుమెంట్లు కావాలి.. ఈ ష్యూరిటీలు తేవాలంటూ బ్యాంక్ సిబ్బంది రకరకాల రూల్స్‌ను ముందటపెట్టారు మరి.

సతీశ్ వయసు 30. సొంతంగా ఓ షాపును నిర్వహిస్తున్నాడు. ఇంటి రుణం కోసం బ్యాంకులకు వెళ్తే మోత మోగించే వడ్డీరేట్లు చెప్పారు. ప్రాపర్టీకి సంబంధించి కూడా ప్రాంతం, విస్తీర్ణం, ప్లానింగ్, లే-అవుట్, అనుమతులంటూ పెద్ద చిట్టానే చదివారు. దీంతో వెనుదిరగాల్సి వచ్చింది.

ఇదీ.. ఇప్పుడు లోన్ కావాలంటూ బ్యాంకులకు చేరినవారికి ఎదురవుతున్న పరిస్థితి.. కాదు దుస్థితి. అవును.. ఆయా రుణాలపై బ్యాంకర్లు నిబంధనల్ని కఠినతరం చేశారు. దీంతో సామాన్యులకు పైసా కూడా అప్పు పుట్టకుండా పోతున్నది.

ముంబై, సెప్టెంబర్ 20: కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ వేసిమరీ వందలు, వేల కోట్ల రూపాయల్ని అప్పుగా ఇస్తున్న బ్యాంకర్లు.. సామాన్యులకు మాత్రం లక్ష కొర్రీలు పెడుతూ మొండిచెయ్యి చూపిస్తున్నారు. పెరుగుతున్న రిటైల్ రుణాలు ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయంటూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చేసిన హెచ్చరికలతో అప్రమత్తమైన బ్యాంకింగ్ సంస్థలు.. నిబంధనల్ని కఠినతరం చేసేశాయి. ఈ ప్రభావం పెద్దలపై ఎలా ఉన్నా.. మధ్యతరగతివారిపై మాత్రం పెద్దగానే పడుతున్నది. లక్ష రూపాయల పర్సనల్ కోసం వెళ్లినా.. 10 లక్షల గృహ రుణం కోసం అడిగినా.. రూల్స్ మీద రూల్స్ చెబుతూ సగటు మనిషి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి బ్యాంకులు. ముఖ్యంగా ష్యూరిటీల కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తున్నదని చాలా మంది వాపోతున్నారు.

ఎన్‌బీఎఫ్‌సీల్లోనూ..

బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల్లోనూ రుణగ్రహీతలకు ఇదే పరిస్థితి ఎదురవుతున్నది. ఇక ఉద్యోగేతరులపై వడ్డీభారం భారీగా పడుతున్నది. కొన్నైతే 14 శాతం నుంచి 22 శాతం మేర వసూలు చేస్తుండటం గమనార్హం. సిబిల్ స్కోర్, స్థిరాస్తి లావాదేవీల్లో సమస్యలనుబట్టి ఈ వడ్డీరేట్లుంటున్నాయి. నిజానికి మొండి బకాయి (నిరర్థక ఆస్తి లేదా ఎన్‌పీఏ)లు కార్పొరేట్ రుణాల్లోనే ఎక్కువ. రుణాల్ని ఎగవేసేదీ బడా వ్యాపార, పారిశ్రామికవేత్తలేనని ఎన్‌పీఏ గణాంకాలూ చెప్తున్నాయి. అయినప్పటికీ కఠినం చేసిన నిబంధనలు సామాన్య రుణగ్రహీతల్నే ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నాయి.

మార్కెట్‌పై ప్రభావం

బ్యాంకింగ్ రుణాల లభ్యత లేక ఆటో, రియల్టీ, కన్జ్యూమర్ గూడ్స్ మార్కెట్లలో నీరసం కనిపిస్తున్నది. వాహన, నిర్మాణ రంగాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. దీంతో ఆటో సంస్థలు ఆయా ఫైనాన్స్ కంపెనీలతో ప్రత్యేకంగా తమ వాహన అమ్మకాల కోసం జట్టు కడుతున్నాయి. బడా రియల్టర్లూ కస్టమర్లను ఆకట్టుకునేందుకు లోన్ మేళాల్ని నిర్వహిస్తున్నారు. అసలే ఆర్థిక మందగమనం ఛాయలు కనిపిస్తున్న తరుణంలో కఠిన బ్యాంకింగ్ నిబంధనలు మార్కెట్‌కు శరాఘాతంలా పరిణమిస్తున్నాయి. దీంతో రుణ ఎగవేతల్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవడం బాగానే ఉన్నా.. అతితో అనర్థాలేనని ఆర్థిక నిపుణులూ హెచ్చరిస్తున్నారు.

ఆదాయంపై అబద్ధాలు..

రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆదాయాన్ని ఎక్కువగా పేర్కొనడం సాధారణంగా జరిగేదేనని ప్రతీ ఐదుగురు భారతీయుల్లో ముగ్గురు (63 శాతం) అభిప్రాయపడ్డట్టు ఓ తాజా సర్వే తెలిపింది. అయితే ఈ విషయంలో అంతర్జాతీయ సగటు 39 శాతంగానే ఉన్నది. గ్లోబల్ అనలిటిక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఫికో.. దేశీయంగా నిర్వహించిన ఈ సర్వేలో ఉద్దేశపూర్వకంగానే గృహ, వ్యక్తిగత రుణాల కోసం తమ ఆదాయంపై అబద్ధాలు ఆడుతున్నట్టు 27 శాతం మంది స్పష్టం చేశారు. ఇక బీమా క్లెయిముల కోసం తప్పుడు సమాచారం ఇస్తున్నామని 54 శాతం అంగీకరించారు. కానీ 33 శాతం మంది ఈ రకమైన తీరు అస్సలు ఆమోదయోగ్యం కాదంటున్నారు. వారంతా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కాగా, 35 శాతం మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో అబద్ధాలు ఆడితే తప్పేమిటన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

టెల్కోలకు బీఎస్ఎన్ఎల్ దెబ్బ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: టెలికం చార్జీలను పెంచుతూ తీసుకున్న నిర్ణయం ప్రైవేట్ టెలికం సంస్థలకు గట్టి షాక్ తగిలింది. జూలై నెలలో జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కస్టమర్లను కోల్పోయారు. మొబైల్ సర్వీసు చార్జీలను 10-27 శాతం వరకు పెంచాయి. దీంతో కస్టమర్లు ఈ మూడు సంస్థలకు దూరంగా ఉన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ నూతన కస్టమర్లను ఆకట్టుకోవడంలో ముందువరసలో నిలిచింది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూలైలో బీఎస్ఎన్ఎల్‌ను కొత్తగా 29.4 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు చేరారు. కానీ, భారతీ ఎయిర్‌టెల్ 16.9 లక్షల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, వొడాఫోన్ ఐడియా 14 లక్షలు, రిలయన్స్ జియో 7.58 లక్షల మందిని కోల్పోయింది. మొత్తం టెలికం సబ్‌స్క్రైబర్లు కూడా 120.56 కోట్ల నుంచి 120.51 కోట్లకు తగ్గడం విశేషం. మొబైల్ టారిఫ్‌లను పెంచడంతో ఏపీ సర్కిల్‌తోపాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ముంబై, కోల్‌కతా, తమిళనాడు, పంజాబ్, యూపీల్లో అత్యధిక మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు తగ్గుముఖం పట్టారు. కానీ, బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లలో మాత్రం బీఎస్ఎన్ఎల్ భారీ స్థాయిలో కస్టమర్లను కోల్పోయింది.

గోద్రేజ్ ఇంటిరియో విస్తరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 20: గోద్రేజ్ ఇంటిరియో..తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 104 నూతన స్టోర్లను తెరవబోతున్నట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ నారాయణ్ సర్కార్ తెలిపారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో 10 ప్రత్యేకంగా గృహోపకరణాల విక్రయ అవుట్‌లెట్లను తెరుస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొన్ని అన్ని రకాల ఉత్పత్తులపై 35 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీ ఫండ్ కొత్త స్కీం

ముంబై, సెప్టెంబర్ 20: ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ తాజాగా నూతన ఫండ్ స్కీంను ప్రారంభించింది. కంపెనీల కోసం ప్రారంభించిన ఈ ఫండ్ స్కీం వచ్చే నెల 4 వరకు తెరిచివుంటుందని, అదే నెల 11న కేటాయింపులు జరపనున్నట్లు పేర్కొంది.

సెన్సెక్స్ @ 84,000

సెన్సెక్స్ 1,360, నిఫ్టీ 375 పాయింట్ల లాభం ● 6.24 లక్షల కోట్లు పెరిగిన సంపద



ముంబై, సెప్టెంబర్ 20: దేశీయ స్టాక్ మార్కెట్లు మరో మైలురాయిని అధిగమించాయి. రోజుకొక రికార్డును బద్దలు కొడుతున్న సూచీలు శుక్రవారం 84 వేల మైలురాయిని అధిగమించి చారిత్రక గరిష్ఠ స్థాయిలో ముగిసింది. బ్యాంకింగ్ రంగ సూచీలు భారీగా పుంజుకోవడంతోపాటు అమెరికా, ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో జోష్ పెంచింది. ఇరు సూచీలు ఆల్‌టైం రికార్డు స్థాయిలో ముగియడం విశేషం. ఇంట్రాడేలో 1,500 పాయింట్లకు పైగా లాభపడి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,359.51 పాయింట్లు(1.63 శాతం) అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 84,544.31 వద్ద ముగిసింది. అటు మరో సూచీ నిఫ్టీ సైతం 26 వేల దిశగా పయనిస్తున్నది. మార్కెట్ ముగిసే సమయానికి నిఫ్టీ 375 పాయింట్లు అందుకొని 25,791 దగ్గర స్థిరపడింది. గతవారంలోనే 83 వేల మార్క్‌ను అధిగమించిన సెన్సెక్స్ కేవలం ఐదు ట్రేడింగ్ రోజుల్లోనే మరో మైలురాయి 84 వేల మార్క్‌ను చేరుకోవడం విశేషం. దీంతో మదుపరుల సంపద మరో 6 లక్షల కోట్లకు పైగా పెరిగింది. పెట్టుబడిదారులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో సూచీలతోపాటు మదుపరుల సంపద కూడా అమాంతం పెరిగింది. ఈక్విటీల ర్యాలీతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.6,24,468.11 కోట్లు పెరిగి రూ.4,71,71,745.83 కోట్లు(5.65 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది.

- మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, లార్సెన్ అండ్ టుబ్రో, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, కొటక్ మహీంద్రా బ్యాంక్, టాటా స్టీల్‌లు లాభపడిన షేర్లలో ఉన్నాయి.
- కానీ, ఎస్బీఐ, ఇండస్ఇండ్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.
- రియల్టీ అత్యధికంగా 3.21 శాతం, క్యాపిటల్ గూడ్స్ 2.32 శాతం, ఆటో 2.12 శాతం, ఇండస్ట్రీయల్స్ 2.08 శాతం, మెటల్ 1.82 శాతం, కన్జ్యూమర్ 1.78 శాతం లాభపడ్డాయి.

పసిడి పరుగు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: బంగారం ధరలు మళ్లీ పరుగెత్తుతున్నాయి. ఫెడ్ వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయంతో అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఒక్కసారిగా అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు పుంజుకుంటున్నాయి. ఢిల్లీలో తులం బంగారం ధర రూ.700 అధికమై రూ.76,350 పలికింది. కానీ వెండి రూ.91 వేల వద్ద స్థిరంగా ఉన్నది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది మూడోరోజని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.660 ఎగబాకి రూ.75,110కి చేరుకున్నది. 22 క్యారెట్ ధర రూ.600 అధికమై రూ.68,850 పలికింది. మరోవైపు, వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి ధర ఏకంగా రూ.1,500 అధికమై రూ.97,500కి చేరుకున్నది.



చిరంజీవికి ఏఎన్ఆర్ నేషనల్ అవార్డ్

31నగరాల్లో అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం: నాగార్జున

నట సామ్రాట్, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకొని ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియాతో కలిసి 'ఏఎన్ఆర్-100 కింగ్ ఆఫ్ ది సిల్వర్ స్క్రీన్' పేరుతో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోంది. ఏఎన్ఆర్ ఐకానిక్ ఫిల్మ్ 'దేవదాసు' స్క్రీనింగ్‌తో శుక్రవారం ఈ చిత్రోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. అక్కినేని నాగేశ్వరరావు పేరుతో పోస్టల్ స్టాంప్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా 31నగరాల్లో ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించబోతున్నాం. గోవా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నాన్నగారి పేరు మీద ఓ ఛాప్టర్ చేస్తున్నాం. ఈ ఏడాది ఏఎన్ఆర్ నేషనల్ అవార్డును చిరంజీవిగారికి ఇవ్వాలని నిర్ణయించాం. ఈ విషయం చెప్పగానే ఆయన చాలా ఎమోషనల్‌గా ఫీలయ్యారు. అక్టోబర్ 28న అమితాబ్ బచ్చన్ గారు ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేస్తారు.' అని అన్నారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, రాఘవేంద్రరావు, శివేంద్ర సింగ్ దుంగార్పూర్, వెంకట్ అక్కినేని, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అక్కినేని ఫిల్మ్ ఫెస్టివల్‌లో దేవదాసు, మిస్సమ్మ, మాయాబజార్, భార్యభర్తలు, గుండమ్మ కథ, డాక్టర్ చక్రవర్తి, సుడిగుండాలు, ప్రేమ్‌నగర్, ప్రేమాభిషేకం, మనం చిత్రాలను ప్రదర్శించనున్నారు.

వారి మాటలు పట్టించుకోలేదు



దేశవ్యాప్తంగా అలియాభట్‌కు ఉన్న ఫాలోయింగ్ సామాన్యమైనది కాదు. నేటి యువతరానికి అభిమాన నాయికగా అవతరించింది అలియా. ఆమె ఇమేజ్ జయాపజయాలకు అతీతం. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సమస్యల గురించి ఆసక్తికరంగా చెప్పుకొచ్చింది అలియా. 'నేను చిన్నప్పట్నుంచి కాస్త బొద్దు. నా లుక్ గురించి నేనెప్పుడూ ఫీలవ్వలేదు కూడా. కానీ హీరోయిన్ అవ్వాలనుకున్నప్పుడు మాత్రం నన్ను నేను మార్చుకోవాల్సి వచ్చింది. దానికోసం చాలా కష్టపడ్డా. సరిగ్గా తినేదాన్ని కాదు, జిమ్‌లో గంటల తరబడి చమటోడ్చేదాన్ని. నా డైట్ చూసి నా ఫ్రెండ్స్ భయపడేవాళ్లు. 'డైటింగ్ ఆపేయ్.. నచ్చింది తిను. ప్రశాంతంగా ఉండు. ఎందుకీ అవస్థ..' అంటూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించేవారు. నేను మాత్రం వారి మాటల్ని అస్సలు ఖాతరు చేసేదాన్ని కాదు. బరువు తగ్గాక అందులో ఉండే ఆనందం ఏంటో అర్థమైంది. ఇక బరువు విషయంలో కంట్రోల్‌గా ఉండాలని నిర్ణయించుకున్నా' అని గుర్తుచేసుకున్నది అలియా భట్.

యుద్ధానికి సన్నద్ధం



ఎట్టకేలకు 'హరిహరవీరమల్లు' లొకేషన్‌లోకి పవన్ కల్యాణ్ అడుగుపెట్టనున్నారు. ఈ నెల 23 నుంచి ఈ సినిమా తాజా షెడ్యూల్ విజయవాడలో మొదలుకానుంది. గ్లాడియేటర్, బోర్న్ ఐడెంటిటీ, ది లాస్ట్ సమురాయ్ వంటి లెజెండ్రీ మూవీస్‌కి పనిచేసిన హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నట్టు నిర్మాతలు తెలిపారు. 'పవన్‌కల్యాణ్‌తోపాటు నాజర్, రఘుబాబు, సునీల్, అభిమన్యుసింగ్, అయ్యప్ప తదితరులు ఈ షెడ్యూల్‌లో భాగం కానున్నారు. 400మంది సిబ్బంది, భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులు, ఫైటర్లతో మునుపెన్నడూ చూడని స్థాయిలో యుద్ధ సన్నివేశాలను చిత్రీకరించేందుకు దర్శకుడు జ్యోతికృష్ణ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ షెడ్యూల్‌తో ఈ సినిమా షూటింగ్ తుదిదశకు చేరుతుంది' అని నిర్మాతలు చెప్పారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ ప్రతినాయకుని పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ దిగ్గజ నటుడు అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాతలు: ఎ.దయాకర్‌రావు, ఎ.ఎం.రత్నం. నిర్మాణం: మెగా సూర్య ప్రొడక్షన్స్.

ఆర్జీవీ సైకలాజికల్ థ్రిల్లర్



నిజజీవిత సంఘటనల మేళవింపుతో రామ్‌గోపాల్‌వర్మ అందిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'శారీ'. 'టూమచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ఉపశీర్షిక. గిరి కృష్ణకమల్ దర్శకుడు. రవివర్మ నిర్మాత. నవంబర్‌లో విడుదల కానున్న ఈ సినిమా ఆంధ్ర, తెలంగాణ థియేట్రికల్ హక్కులను ప్రముఖ పంపిణీ దారుడు ముత్యాల రాందాస్ సొంతం చేసుకున్నారు. చీరలో ఉన్న ఓ అమ్మాయిని చూసి పిచ్చివాడై, ప్రేమలో పడ్డ ఓ అబ్బాయి జీవితం ఎలా భయానకంగా మారింది అన్నదే ఈ సినిమా ప్రధానాంశం. ఇందులో అబ్బాయిగా సత్య యాదు నటిస్తుండగా, అతన్ని పిచ్చివాడ్ని చేసిన అమ్మాయిగా ఆరాధ్యదేవి కనిపించనుంది. వాస్తవ సంఘటనలను కళ్లకు కట్టేలా చూపించడంలో ఆర్జీవీ సిద్ధహస్తులనీ, యువతరం మాత్రమే కాకుండా, కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చేలా ఈ సినిమాను ఆర్జీవీ మలిచారని పంపిణీదారులు ముత్యాల రాందాస్ అన్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శబరి, నిర్మాణం: ఆర్జీవి ఆర్వి ప్రొడక్షన్స్.



మునుపెన్నడూ చూడని మాస్ అవతార్‌లో

యువహీరో సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా సినిమాకు 'హను-మాన్'ఫేం కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. ఈ సినిమాకు సంబంధించిన భారీ యాక్షన్ సన్నివేశాలను 15రోజుల పాటు తెరకెక్కించారు. నెక్స్ట్ షెడ్యూల్ కోసం 12 ఎకరాల్లో భారీ సెట్‌ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సాయిదుర్గతేజ్ మునుపెన్నడూ చూడని పవర్‌ఫుల్ మాస్ అవతార్‌లో కనిపిస్తారని, భారీ వ్యయంతో, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ సినిమా సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే మెమరబుల్ సినిమాగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తామని వారు చెప్పారు. ఈ చిత్రానికి నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్మెంట్.

అమ్మాయి భయపడితే?



'డైరెక్టర్ హరిత అందరికీ నచ్చేలా ఈ సినిమాను తీశారు. డైరెక్టర్‌గా ఇది ఆమె తొలి సినిమా అంటే ఎవరూ నమ్మరు. ఈ సినిమాలో చేసిన రోల్ నటిగా నాకు సంతృప్తినిచ్చింది. అనూప్‌రూబెన్స్ బీజీఎం ఈ సినిమాకు ప్రాణం పోసింది. ఈ సినిమాకు విడుదలకు ముందే 64 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డులొచ్చాయి. ప్రేక్షకులకు కూడా తప్పక నచ్చుతుంది' అని హీరోయిన్ వేదిక నమ్మకం వ్యక్తం చేశారు. ఆమె లీడ్ రోల్ చేసిన చిత్రం 'ఫియర్'. అరవింద్ కృష్ణ ప్రత్యేకపాత్ర పోషించారు. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌లో వేదిక మాట్లాడారు. 'ఈ సినిమాలోని కథానాయిక పాత్రకు నేను కోరుకున్న అన్ని అర్హతలు ఉన్న నటి వేదిక. అందుకే ఆమెను తీసుకున్నా. అనూప్ తన మ్యూజిక్ ద్వారా నటిగా వేదికను, డైరెక్టర్‌గా నన్నూ డామినేట్ చేశారు. అది రేపు తెరపై చూస్తారు. జీవితంలో కొన్ని అనుకోని సందర్భాల్లో ఒక అమ్మాయి భయపడితే పర్యావసానాలు ఎలా ఉంటాయి అనేదే 'ఫియర్' కథ. వచ్చే నెలలో సినిమాను విడుదల చేస్తాం' అని డైరెక్టర్ హరిత గోగినేని తెలిపారు.

లడ్డుగాని పెళ్లి హంగామా



గత ఏడాది 'మ్యాడ్' చేసిన అల్లరి అంతాఇంతా కాదు. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసిందీ సినిమా. ఇప్పుడు ఆ అల్లరిని డబుల్ చేస్తూ మ్యాడ్ మ్యాక్స్ ఎంటర్‌టైనర్‌గా 'మ్యాడ్ స్క్వేర్'ను తీసుకొస్తున్నది ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్మెంట్స్. కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో వహిస్తున్న ఈ సీక్వెల్‌పై ప్రకటనతోనే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. శుక్రవారం 'లడ్డు గాని పెళ్లి' పాటతో మేకర్స్ ప్రచారాన్ని షురూ చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరిచి, మంగ్లీతో కలిసి ఆలపించారు. ఈ పాట ప్రస్తుతం విశేషంగా ఆదరణ పొందుతున్నదని, 'మ్యాడ్' పాటల్ని మించే స్థాయిలో 'మ్యాడ్ స్క్వేర్' పాటలు ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ ఈ పాటలో ఎంత జోష్‌గా కనిపించారో.. అంతకు రెట్టింపు జోష్‌తో సినిమాలో ఉంటారని, 'మ్యాడ్ స్క్వేర్' పేరుకు తగ్గట్టే డబుల్ వినోదాన్ని ఇవ్వడం ఖాయమని మేకర్స్ చెబుతున్నారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాకు కెమెరా: షామ్‌దత్, నిర్మాతలు: హారిక సూర్యదేవర, సాయిసౌజన్య, సమర్పణ: సూర్యదేవర నాగవంశీ.

ఏం పాపం చేశామో..



సుహాస్, సంగీర్తన జంటగా నటించిన ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'జనక అయితే గనక'. సందీప్ రెడ్డి బండ్ల దర్శకుడు. దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షితరెడ్డి, హన్షితరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. శిరీష్ సమర్పకుడు. దసరా కానుకగా అక్టోబర్ 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రమోషన్ వేగవంతం చేశారు. ఇప్పటికే పోస్టర్లు, పాటలు, టీజర్ విడుదల చేశారు. తాజాగా 'ఏం పాపం చేశామో..' అంటూ సాగే పాటను మేకర్స్ విడుదల చేశారు. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను విజయ్ బుల్గానియా స్వరపరచగా, రితేజ్ జి. రావు ఆలపించారు. మిడిల్‌క్లాస్ ఉద్యోగి మేనేజర్‌తో పడే తంటాలు, చాలీచాలని జీతాలవల్ల ఎదురయ్యే కష్టాలు.. ఇవన్నీ ఈ పాటలో ఫన్నీగా చూపించారు. అందరికీ నచ్చే సినిమాగా 'జనక అయితే గనక' నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు.

నాలుగు డీఏలు చెల్లించాలి: టీపీటీఎఫ్

హైదరాబాద్, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిపడ్డ 4 పెండింగ్ డీఏలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం ఏర్పడి 10నెలలు పూర్తయినా డీఏలను ప్రకటించకపోవడం విడ్డూరమని, కనీసం శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో రెండు డీఏలు ప్రకటిస్తారని ఆశించినా నిరాశే మిగిలిందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పీ నాగిరెడ్డి ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

అప్పీళ్లను ప్రకటించాలి: యూఎస్‌పీఎస్సీ

టీచర్ల బదిలీలు, పదోన్నతుల అప్పీళ్లను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీఎస్సీ) ప్రభుత్వాన్ని కోరింది. బదిలీల ప్రక్రియ ముగిసి 80 రోజులు గడుస్తున్నా ఇంతవరకు అప్పీళ్లను పరిష్కరించకపోవడం విడ్డూరమని పేర్కొంది. రెండువారాల్లో పరిష్కరిస్తామని ఇంతవరకు పట్టించుకోకపోవడంపై యూఎస్‌పీఎస్సీ నేతలు విస్మయం వ్యక్తంచేశారు. బదిలీలు, పదోన్నతుల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రజావాణి'కి 401 అర్జీలు

హైదరాబాద్, సెప్టెంబర్20 (నమస్తే తెలంగాణ): జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 401 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు 116, విద్యుత్, సింగరేణికి 51, ఎస్సీ సంక్షేమ శాఖకు 46, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 45, హోంశాఖకు 28, ఇతర శాఖలకు 115 వినతులు వచ్చినట్టు ప్రత్యేకాధికారి వెల్లడించారు.

పూర్తిస్థాయి పరీక్షలతోనే కారణాల వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్20 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్ పిల్లర్ కుంగుబాటునకు కచ్చితమైన కారణాలు తెలియాలంటే సమగ్ర పరీక్షలు నిర్వహించాలని ఎస్‌డీఎస్‌వో (స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్) ఇంజినీర్లు జస్టిస్ ఘోష్ ఎదుట నివేదించారు. బరాజ్‌లపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ బీఆర్కే భవన్‌లో శుక్రవారం కొనసాగింది. విచారణకు టీజీఈఆర్ఎల్ (తెలంగాణ ఇంజినీరింగ్ రీసెర్చ్ ల్యాబొరేటరీ), ఎస్‌డీఎస్‌వో విభాగం జేడీ, సీఈలు, ఈఈలు హాజరయ్యారు. బరాజ్‌ల నిర్మాణానికి ముందు, మధ్య, తర్వాత కూడా మోడల్ స్టడీస్ కండక్ట్ చేసినట్టు రీసెర్చ్ ఇంజినీర్లు వెల్లడించారు. బరాజ్‌ల డ్యామేజీకి మోడల్ స్టడీస్‌కు సంబంధం లేదని, నిబంధనల ప్రకారమే టీఎస్ ఈఆర్‌ఎల్ పని చేసిందని లొకేషన్, సీడీవో అథారిటీ రిపోర్ట్స్ ఆధారంగా రీసెర్చ్ చేశామని వివరించారు. మూడు బరాజ్‌లు కూడా డ్యామ్‌సేఫ్టీ యాక్ట్ పరిధిలోకి వచ్చాయని, ఆ చట్టాన్ని అనుసరించి దేశంలోనే మొట్టమొదటగా ఎస్‌డీఎస్‌వోను ఏర్పాటు చేసిన రాష్ట్రం తెలంగాణ అని ఎస్‌డీఎస్‌వో అధికారులు గుర్తుచేశారు. పూర్తిస్థాయి పరీక్షలతోనే కారణాలు వెల్లడించవచ్చని చెప్పారు.

ట్రిబ్యునల్ విచారణ నవంబర్ 6కు వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ నవంబర్ 6కు వాయిదా పడింది. ఉమ్మడి ఏపీకి కృష్ణాజలాల్లో కేటాయించిన 1,005 టీఎంసీలతోపాటు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను తెలంగాణ, ఏపీ మధ్య పునఃపంపిణీ చేయడంతోపాటు, ప్రాజెక్టుల వారీగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం గత అక్టోబర్‌లో కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. విచారణను శుక్రవారం కొనసాగగా ఆపరేషన్ ప్రొటోకాల్ అంశాన్ని మాత్రమే సాక్షుల ద్వారా విచారించాలని ఏపీ ప్రతిపాదించింది. ఏపీ తరపు సాక్షికి సంబంధించి అఫిడవిట్ దాఖలు చేసేందుకు గడువు కోరింది. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేయడంతోపాటు ఏపీ అఫిడవిట్‌లో అంశాలను పరిశీలించాకే అఫిడవిట్ దాఖలు చేస్తామని స్పష్టం చేసింది. ఏపీకి నాలుగు వారా ల గడువు ఇస్తూ ట్రిబ్యునల్ విచారణ ను నవంబర్6-8 తేదీలకు వాయిదా వేసింది.

ఆరోగ్య మిత్రల సమ్మె విరమణ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : ఆరోగ్య మిత్రలు సమ్మె విరమించారు. శుక్రవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో జరిపిన చర్చలు సఫలమవడంతో సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించారు. క్యాడర్ మార్పు అంగీకారంతోపాటు వేతనాన్ని రూ.15,600 నుంచి రూ.19,500కు పెంచేందుకు మంత్రి అంగీకరించారు. సమ్మెకాలం వేతనాలను చెల్లించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. నేటి నుంచి విధుల్లో చేరనున్నట్టు వెల్లడించారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష

రాష్ట్రానికి గ్రాంట్ల విడుదలలో రిక్తహస్తం

- పన్నుల్లో న్యాయంగా రావాల్సిన వాటాల్లోనూ ఏటా మొండిచెయ్యి
- తొమ్మిదేండ్లుగా ఇదే వైఖరి
- బీజేపీ పాలిత రాష్ట్రాలకు నిధుల వరద

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తున్నది. రెవెన్యూ రాబడుల్లో భాగంగా రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్లు, పన్నుల్లో వాటా పరిమాణం అంతకంతకూ తగ్గుతుండటమే దీనికి నిదర్శనం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ మొత్తం రెవెన్యూ రాబడుల పరిమాణం రూ.51,041 కోట్లుగా నమోదైంది. ఇందులో పన్నుల్లో వాటా, గ్రాంట్లు తదితరాలు కలుపుకొని కేంద్రం నుంచి తెలంగాణకు 29.98% మేర (రూ.15,306 కోట్లు) నిధులు సమకూరాయి. గత బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఆర్థిక పురోగతి సాధించడంతో 2022-23 నాటికి రాష్ట్ర రెవెన్యూ రాబడుల మొత్తం రూ.1,59,350 కోట్లకు చేరింది. ఇందులో కేంద్రం నుంచి వచ్చిన నిధుల వాటా 20.61% (రూ.32,847 కోట్లు) మాత్రమే. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో తొమ్మిదేండ్లలో ఒకవైపు తెలంగాణ స్వశక్తితో ఆదాయవృద్ధిని నమోదుచేస్తుంటే, కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన వాటా మాత్రం అంతకంతకూ తగ్గిపోతున్నది. తొమ్మిదేండ్ల వ్యవధిలోనే 31.25% మేర నిధులకు కేంద్రం కోత విధించడంపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రూ.41,259 కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో అందుతుందని బడ్జెట్‌లో అంచనా వేసిన రాష్ట్ర ఆర్థికశాఖ చివరికి రూ.4,532 కోట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది బడ్జెట్ అంచనాల్లో 11% మాత్రమే. ఇప్పటికే కేంద్ర పన్నుల్లో వాటాలు ఇవ్వక రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతున్న కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం గ్రాంట్ల విషయంలోనూ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆ రాష్ట్రాలకు నిధుల వరద

గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయంలో తెలంగాణపై వివక్ష చూపుతున్న కేంద్రం.. బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం బడ్జెట్ పద్దుతో సంబంధం లేకుండా గ్రాంట్ విడుదల చేస్తున్నది. ప్రధానమంత్రి మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు నవంబర్ నాటికే అంచనాల్లో 102% గ్రాంట్ ఇచ్చింది. బీజేపీ అధికారంలో ఉన్న హర్యానాకు 59.57%, త్రిపురకు 45.12%, మధ్యప్రదేశ్‌కు 44.10%, ఉత్తరాఖండ్‌కు 39.23%, ఛత్తీస్‌గఢ్‌కు 33.46%, రాజస్థాన్‌కు 28.74%, ఉత్తరప్రదేశ్‌కు 26.06%, మహారాష్ట్రకు 19.59% గ్రాంట్‌ను విడుదల చేసింది. తెలంగాణకు మాత్రం గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను 11%తో సరిపెట్టింది. కేంద్ర పన్ను రాబడిలోనూ తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా దక్కడంలేదు. ఎన్డీయేపాలిత బీహార్ వివిధ పన్నుల ద్వారా కేంద్రానికి రూపాయి ఇస్తున్నదనుకొంటే, దానికి ప్రతిగా కేంద్రం.. ఆ రాష్ట్రానికి రూ.7.26 తిరిగి చెల్లిస్తున్నది. ఇదే సమయంలో అదే రూపాయి ఇస్తున్న తెలంగాణకు కేవలం 0.47 పైసలనే విదిలిస్తున్నది.

తెలంగాణ రెవెన్యూ రాబడుల్లో కేంద్రం వాటాలో తగ్గుదల ఇలా..

ఆర్థిక సంవత్సరం	కేంద్రం వాటా
2014-15	29.98
2015-16	28.56
2016-17	29.73
2017-18	25.69
2018-19	26
2019-20	26.9
2020-21	27.9
2021-22	21.44
2022-23	20.61

(ఆధారం: రాష్ట్ర బడ్జెట్, ఆర్బీఐ గణాంకాలు)

2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో రూపాయి చొప్పున రాబడి వస్తే.. తిరిగి ఏ రాష్ట్రానికి కేంద్రం ఎంత ఇస్తున్నదంటే?

రాష్ట్రం	చెల్లింపులు(రూ.ల్లో)
బీహార్	7.26
ఉత్తరప్రదేశ్	2.49
మధ్యప్రదేశ్	2.09
ఒడిశా	1.25
రాజస్థాన్	1.20
కేరళ	0.62
ఆంధ్రప్రదేశ్	0.52
తెలంగాణ	0.47

'పాఠం' సరికొత్తగా..

తరగతి గదిలో విద్యార్థికి పాఠ్యాంశంపై ఆసక్తి కలిగేలా, విద్యాబోధనలో మూస పద్ధతికి స్వస్తి పలికేందుకు కొత్త విధానానికి మనరాష్ట్రంలో శ్రీకారం చుట్టారు. ఐఐటీ గాంధీనగర్ సహకారంతో సీసీఎల్‌ను ప్రవేశపెట్టి పాఠాలను సరికొత్తగా బోధించే ప్రక్రియను ప్రారంభించారు.

- సర్కారు బడుల్లో వినూత్నంగా విద్యాబోధన
- ఐఐటీ గాంధీనగర్ సహకారంతో టీచర్లకు శిక్షణ
- పలు జిల్లాల్లో కొత్తతరహా బోధన ప్రారంభం
- రాష్ట్రంలో మాడల్ సైన్స్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మనకు టీచర్ నేర్పించినవాటిలో కొన్ని మాత్రమే గుర్తుంటాయి. మరికొన్నింటిని జీవితాంతం మరిచిపోలేం. ఆయా అంశాన్ని టీచర్ అద్భుతంగా చెప్పడమే ఇందుకు కారణం. ఇలాంటి విద్యాబోధనను మన టీచర్లు ఆకలింపు చేసుకునేందుకు విద్యాశాఖ ప్రయత్నాలు చేస్తున్నది. టీచర్లకు తర్ఫీదు నిస్తున్నది. ఫలితంగా కొన్ని పాఠశాలల్లో సరికొత్త విద్యాబోధన అందుబాటులోకి వచ్చింది. ఐఐటీ గాంధీనగర్ సహకారంతో విద్యార్థులకు సులభంగా, జీవితాంతం గుర్తుండేలా పాఠాలను వినూత్నంగా బోధించే ప్రయత్నం ప్రారంభమైంది. తాజాగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఫలితంగా టీచర్లు, విద్యార్థుల ద్వారా అబ్బురపరిచే అనేక కృత్యాలు ఆవిష్కృతమయ్యాయి.

కేసీఆర్ హయాంలోనే ఒప్పందం..

మూస పద్ధతిలో కొనసాగుతున్న విద్యాబోధనను మార్చి, విద్యార్థుల్లో అభ్యాసన ఆసక్తిని పెంపొందించేందుకు ప్రొఫెసర్ మనీశ్ జైన్ ఐఐటీ గాంధీనగర్‌లో సీసీఎల్(సెంటర్ ఫర్ క్రియేటివ్ లెర్నింగ్)ను ప్రారంభించారు. పిల్లలు ఆసక్తిగా తమంతట తాముగా నేర్చుకోవడం, బోధనలో ఆటబొమ్మలు రూపొందించేలా ఈ సంస్థ అనేక ప్రయోగాలు చేస్తున్నది. కేవలం విషయాన్ని పిల్లల బుర్రల్లో చొప్పించడం కంటే వారే సొంతంగా ఆడుతూ శోధిస్తూ నేర్చుకోవాలన్నది ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. ఈ వినూత్న బోధన కోసం రాష్ట్ర విద్యాశాఖ, కేసీఆర్ సర్కారు హయాంలో ఐఐటీ గాంధీనగర్‌లోని సీసీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా ఐఐటీ గాంధీనగర్.. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్‌ఎల్‌ఎన్) కిట్, ఉన్నత పాఠశాలలకు గణితం, సైన్స్ కిట్‌లను అందజేస్తున్నది. దీంతోపాటు రాష్ట్రంలో మాడల్ సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో మన రాష్ట్రానికి చెందిన 300మంది టీచర్లకు ఐఐటీ గాంధీనగర్‌లో శిక్షణనిచ్చారు. వీరిలో 100మంది చొప్పున గణితం, ఫిజికల్ సైన్స్, మరో వంద మంది ప్రాథమిక పాఠశాలల్లో బోధించే టీచర్లున్నారు. శిక్షణ తర్వాత టీచర్లకు ఐఐటీ గాంధీనగర్ నిపుణులు మార్గదర్శనం చేస్తున్నారు. పలు రకాల బోధనోపకరణాలను సైతం రూపొందించారు.

వర్క్‌షాప్‌లో సరికొత్త కృత్యాలు

- ఒక ఏ4 సైజు పేపర్‌తో జాతీయ, సమరూపత మొదలగు గణిత భావనలను అత్యంత సులభంగా పరిచయం చేశారు.
- కూల్‌డ్రింక్ తాగే స్ట్రా, కాగితం, పీవీసీ పైపుతో ధ్వనిని సృష్టించారు.
- వాడేసిన కూల్‌డ్రింక్ ప్లాస్టిక్ బాటిల్‌తో 'పీడనం' పాఠ్యాంశాన్ని సులభంగా వివరించారు.
- దారాన్ని గుండ్రని కార్డ్‌బోర్డుపై ఆంగ్ల అక్షరమాలతో అల్లుతూ 'సిద్దిపేట' పేరును తయారుచేశారు.
- కొన్ని రకాల పుష్‌పిన్స్‌ను వాడి ఏపీజే అబ్దుల్ కలాం, విక్రమ్ సారాబాయి చిత్రపటాలను రూపొందించారు.
- బ్యాటరీ సెల్, సేఫ్టీపిన్స్, కాపర్‌వైర్‌తో డీసీ మోటర్‌ను తయారుచేశారు.

గిరిజన గురుకులాల్లో అందని పోషకాహారం!

- పెరిగిన నిత్యావసరాల ధరలతో భోజనంలో తగ్గుతున్న నాణ్యత
- 25 శాతం మెస్‌చార్జీలు పెంచాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల డిమాండ్



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని గిరిజన గురుకుల విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగడంతో నాణ్యమైన భోజనం పెట్టలేకపోతున్నట్టు ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నాయి. కేవలం రూ.36తోనే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్‌తోపాటు రాత్రి డిన్నర్ అందించాల్సి ఉందని, పెరిగిన కూరగాయలు, నూనెల ధరలతోపాటు ఇతర వంట వస్తువుల ధరలకు ప్రస్తుతం చెల్లించే మెస్‌చార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదని పేర్కొంటున్నాయి.

ప్రస్తుత మెస్‌చార్జీలు ఇలా..

గిరిజన గురుకులాల్లో 5,6,7 తరగతుల విద్యార్థులకు రూ.31.6 మెస్‌చార్జీ చెల్లిస్తుండగా.. 8, 9,10 తరగతుల వారికి రూ.36.6, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.50 చెల్లిస్తున్నారు. ఈ ధరలు ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు ఏ మాత్రం సరిపోవడం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ధరల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలంటే 25 శాతం మెస్‌చార్జీలు పెంచాల్సి ఉందని గురుకుల ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీ సురేందర్‌రాథోడ్ పేర్కొంటున్నారు.

25 శాతం పెంచితే ఇలా..

5 నుంచి 7 తరగతుల వారికి 25 శాతం మెస్‌చార్జీలు పెంచితే రూ.39.50, 8 నుంచి 10 తరగతుల వారికి రూ.45.15, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.62.50 చెల్లించాల్సి ఉండగా.. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

'అగ్రికల్చర్' కళాశాలలో ప్రవేశాల గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్20 (నమస్తే తెలంగాణ): మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ మహిళా డిగ్రీ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ హానర్స్ కోర్సు ఫస్టియర్ ప్రవేశాలకు విధించిన గడువును అక్టోబర్ 10 వరకు పొడిగించారు. ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఈఏపీసెట్-2024ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థినులు ఆన్‌లైన్ https://mjptbcwreis.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ర్యాంకు, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 040-23328266 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైద్యుల 'రక్షణ' చట్టాలు అమలు కావట్లే!

- 30 శాతం మంది డాక్టర్లకు చట్టాలపై అవగాహన లేదు
- జాతీయస్థాయి సర్వేలో వెల్లడి


హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): వైద్య సిబ్బంది రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు అమలు కావడం లేదని వైద్యులు తేల్చి చెప్తున్నారు. అఖిల భారత ప్రభుత్వ వైద్య సంఘాల సమాఖ్య తరపున హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ మాదల జాతీయ స్థాయిలో సర్వే నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కేంద్ర ప్రభుత్వం నియమించిన 'రీవాంపింగ్ వర్కింగ్ కండీషన్స్ ఆఫ్ హెల్త్ కేర్ పర్సనల్' సబ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. దేశంలో వైద్యులు, సిబ్బందిపై జరుగుతున్న దాడులు, వాటిని అరికట్టే చట్టాలపై అవగాహన, చట్టాలు అమలవుతున్న తీరుపై ఆయన తాజాగా దేశవ్యాప్త సర్వే నిర్వహించారు. ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇందులో 22 రాష్ట్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. సర్వే ఫలితాలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు, సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జాతీయ టాస్క్‌ఫోర్స్ కన్వీనర్‌కు అందించినట్లు పేర్కొన్నారు.

సర్వే ప్రకారం..

- 28.7% శాతం మంది వైద్యసిబ్బంది తమకు రక్షణ చట్టాలపై అవగాహన లేదని చెప్పారు.
- పురుషులతో పోల్చితే మహిళా వైద్యులు, సిబ్బందికి చట్టాలపై అవగాహన తక్కువగా ఉన్నట్టు సర్వేలో తేలింది. 33 శాతం మంది తమకు అవగాహన లేదని చెప్పారు.
- ఇక వైద్య విద్యార్థుల్లో 47 శాతం మందికి చట్టాలపై అవగాహన లేదట. దీనిని బట్టి వారికి మరింత అవగాహన కల్పించాల్సి ఉన్నదని తేలింది.
- చట్టాలు అమలవుతున్నాయని సర్వేలో పాల్గొన్నవారిలో కేవలం 7.4 శాతం మంది మాత్రమే చెప్పారు. మహిళా సిబ్బందిలో 1.63 శాతం మాత్రమే అమలవుతున్నాయని చెప్పడం గమనార్హం.
- తెలంగాణకు సంబంధించి 27.7 శాతం మంది తమకు చట్టాలపై అవగాహన లేదని చెప్పారు.6.8 శాతం మంది మాత్రమే చట్టాలు అమలవుతున్నాయని తెలిపారు.

సందేహాల దరఖాస్తు..!

- అక్టోబర్ 2 నుంచి కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు
- స్వీకరణకు ప్రభుత్వ నిర్ణయం
- దరఖాస్తు ఎక్కడ చేయాలి? ఎవరు చేయాలి?
- సందేహాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు



హైదరాబాద్, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ) : కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం అక్టోబర్ 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్‌కార్డులు ఇచ్చే అంశంపై కసరత్తు చేశారు. దీనిపై త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది.

సవాలక్ష సందేహాలు...

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇందుకు సంబంధించి అనేక సందేహాలపై స్పష్టత ఇవ్వలేదు. దరఖాస్తులు తీసుకోవాలన్న ప్రభుత్వ ప్రకటనపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

- దరఖాస్తులకు చివరి గడువుపై ఎలాంటి స్పష్టత లేదు.
- దరఖాస్తు ఎక్కడ, ఎలా చేయాలి? అనే అంశంపై స్పష్టత లేదు.
- మీ-సేవలో చేసుకోవాలా..? లేక ప్రజా పాలన మాదిరిగా దరఖాస్తులు స్వీకరిస్తారా..?
- దరఖాస్తు ఎవరు చేసుకోవాలనే అంశంపై స్పష్టత లేదు. డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో ఇప్పటికే రేషన్ కార్డులు ఉన్నవాళ్లు కూడా దరఖాస్తు చేసుకోవాలా..? లేక రేషన్‌కార్డు లేని వాళ్లు మాత్రమే దరఖాస్తు చేయాలా..?
- ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేయాలా..?
- అవసరం లేదా..? అనే దానిపై క్లారిటీ లేదు.

సింగరేణి బోనస్ @ 796 కోట్లు

- ఒక్కో కార్మికుడికి రూ.1.90 లక్షల మేర బెన్‌ఫిట్
- కాంట్రాక్ట్ కార్మికులకు 5 వేల చొప్పున లబ్ధి
- 4,701 కోట్ల లాభం.. 2,412 కోట్లలో 33% బోనస్
- సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దసరాకు ముందే సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఎట్టకేలకు సంస్థ లాభాలను తేల్చి, 33 శాతం బోనస్‌ను ప్రకటించింది. శుక్రవారం సచివాలయంలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు లాభాల బోనస్‌ను ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లుగా ప్రకటించారు. దాంట్లో రూ.2,283 కోట్లను మినహాయించి, రూ.2,412 కోట్లలోనే 33 శాతం లాభాల బోసన్‌ను ప్రకటించారు. రూ.2,289 కోట్లను సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికల కోసం పక్కన పెట్టినట్టుగా ప్రకటించారు. 33 శాతం వాటా కింద రూ.796 కోట్లను లాభాల వాటాగా చెల్లిస్తామని వారు ప్రకటించారు. దీంతో ఒక్కో కార్మికుడికి రూ.1.90 లక్షలు, కాంట్రాక్ట్ కార్మికులకు 5 వేల చొప్పున బోనస్‌గా అందజేస్తామని చెప్పారు. నిరుడితో పోల్చితే ఈ ఏడాది రూ.20 వేలు అదనంగా అందిస్తున్నామని తెలిపారు. దీంతో 41,837 మంది రెగ్యులర్ కార్మికులు, 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు లబ్ధిచేకూరుతుందని వెల్లడించారు.



విస్తరణకు 2,283 కోట్లు

సింగరేణి సంస్థ ఆర్జించిన రూ.2,283 కోట్ల లాభాన్ని వ్యాపార విస్తరణ కోసం పెట్టుబడులుగా పెడుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్, జైపూర్‌లో 800 మెగావాట్ల మూడో యూనిట్, టీజీజెన్‌కో భాగస్వామ్యంతో 800 మెగావాట్ల ప్లాంట్, నైనీ బొగ్గు బ్లాక్ సమీపంలో పవర్‌ప్లాంట్‌ను నెలకొల్పుతున్నామని తెలిపారు. సింగరేణి పరిధిలో దవాఖానలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, క్యాథ్‌ల్యాబ్‌లు, క్యాంటీన్ల ఆధునీకరణ, హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వీకే, గోలేటి, నైనీ ఓపెన్ కాస్ట్‌లను ఈ ఏడాదే ప్రారంభిస్తామని ప్రకటించారు. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్ బలరాం సహా పలువురు ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తక్కువ వాటాపై నిరసన

- సగం లాభాల నుంచే వాటా దక్కడంపై రుసరుస
- పదేండ్లలో ఇదే అతి తక్కువ బోనస్ అని పెదవి విరుపు
- 2,289 కోట్లకు బోనస్‌ను ఎగ్గొట్టారని తీవ్ర అభ్యంతరం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ)/గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ప్రకటించిన లాభాల వాటాపై కార్మిక వర్గాల్లో నిరసన వ్యక్తమవుతున్నది. కార్మికులకు ఈ సారి ప్రకటించిన వాటా బూటకమని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. రికార్డు బొగ్గు ఉత్పత్తి సాధించడంతో రూ.4,071 కోట్ల నికర లాభాలు వచ్చినట్టు యాజమాన్యం పేర్కొన్నది. ఇందులో నుంచి సింగరేణి భవిష్యత్తు ప్రణాళిక కోసం 2,289 కోట్లను పక్కన బెట్టినట్టు సెలవిచ్చిందని, మిగతా రూ.2,412 కోట్ల లాభాల నుంచే కార్మికులకు 33 శాతం కింద రూ.796 కోట్లను బోనస్‌గా అందజేస్తామని ప్రకటించడంతో కార్మిక వర్గాల్లో నిరసన వ్యక్తమవుతున్నది. సంస్థ యాజమాన్యం పక్కన పెట్టిన 2,289 కోట్లకు 33 శాతం వాటాలు ఎగ్గొడుతున్నదని నేతలు ఆరోపిస్తున్నారు. గత పదేండ్లలో నికర లాభాల్లో కార్మికుల బోనస్‌ను పరిశీలిస్తే ఈసారే అతి తక్కువ బోనస్ వచ్చిందని వారు తేల్చి చెప్తున్నారు. 2022-23లో 32 శాతం బోనస్ అంటే రూ.2,222 కోట్లకు రూ.711 కోట్లను సంస్థ ఉద్యోగులకు బోనస్‌గా అందజేసింది. ఇప్పుడు 50 శాతం లాభాలను పక్కనబెట్టి, మిగతా 50 శాతానికే బోనస్‌ను ప్రకటించింది. దీంతో కార్మికులకు తీవ్రంగా నష్టం జరిగింది.

ఒక్కో కార్మికుడికి 2 లక్షలకు పైగా వచ్చేది!

తాజాగా ప్రకటించింది 33 శాతం కాదని, 16.93 శాతమే అవుతుందని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. లాభాలేమో రూ.4,701 కోట్లు చూపించి, కేవలం రూ.2,412 కోట్లలో 33 శాతం బోనస్‌ను ప్రకటించారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మిగతా రూ.2,289 కోట్లకు బోనస్‌ను ఎగ్గొట్టారని ఆరోపిస్తున్నాయి. గతంలో ఇలా ఎప్పుడు జరగలేదని, ఇదేం బోనస్ అని ప్రశ్నిస్తున్నాయి. వాస్తవంగా 4,701 కోట్ల లాభాలకు 33 శాతం బోనస్ ప్రకటించి ఉంటే బోనస్‌గా దాదాపు 1,400 కోట్లకు పైగా కార్మికులకు దక్కేదని, ఒక్కో కార్మికుడికి రెండు లక్షలకు పైగా బోనస్ రూపంలో వచ్చేదంటున్నాయి. అంటే 50 శాతం గండికొట్టి గొప్పగా ప్రచారం చేసుకోవడంపై ఆయా సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

కార్మికులను మోసగించిన యాజమాన్యం: టీబీజీకేఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల వాస్తవ లాభాలు ఆర్జించినా, రూ.2,412 కోట్లకు పరిమితం చేయడం కార్మికులను మోసం చేయడమేనని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. లాభాల నుంచి సింగరేణి అభివృద్ధి పేరుతో పక్కనపెట్టడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఆల్‌టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా గతం కంటే ఒక్కో కార్మికుడికి అదనంగా ఇచ్చేది రూ.20 వేలేనా? అని తెలిపారు. ఈ అంశాలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ప్రకటించారు. కార్మికులకు ప్రకటించిన వాటా బూటకమని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

సన్న బియ్యాన్ని సమకూర్చేదెలా?

అధికారులకు సవాలుగా మారిన సేకరణ

- రేషన్ కార్డుదారులకు ఏటా 24 లక్షల టన్నుల బియ్యం
- అందుకు 36 లక్షల టన్నుల సన్న ధాన్యం అవసరం
- రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యేదే 35-40 లక్షల టన్నులు
- అందులో అధిక భాగం బహిరంగ మార్కెట్లో విక్రయం
- మిగిలిన కొద్ది ధాన్యంతో సన్న బియ్యం పంపిణీ ఎలా సాధ్యం?
- ఈ సీజన్ ధాన్యం జనవరి నాటికి అందడం కష్టమే
- ఫిబ్రవరి వరకు కొనసాగనున్న కొనుగోళ్ల ప్రక్రియ



హైదరాబాద్, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడంతో ఆ బియ్యాన్ని సమకూర్చడంపై పౌరసరఫరాల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం పంపిణీకి ఏటా 24 లక్షల టన్నుల బియ్యం అవసరమవుతాయి. ఇంత భారీ మొత్తంలో సన్న బియ్యం సేకరించడం ఇప్పుడు అధికారులకు సవాలుగా మారింది. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అక్టోబర్ చివర్లో మొదలై ఫిబ్రవరి వరకు కొనసాగనున్నది. దీంతో జనవరి నాటికి సన్న బియ్యం అందడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏప్రిల్, మే నెలకు గానీ ఈ బియ్యం అందుబాటులోకి రావని అధికారులు చెప్తున్నారు. అప్పటివరకు అవసరమైన బియ్యాన్ని ఏ విధంగా సమకూర్చాలన్నదానిపై తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్రంలో ఏటా 24 లక్షల టన్నుల సన్న బియ్యం సేకరణకు దాదాపు 36 లక్షల టన్నుల సన్న ధాన్యం అవసరమవుతుందని సివిల్ సప్లై అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇంత భారీ మొత్తంలో సన్న ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఏటా రెండు సీజన్లలో కలిపి గరిష్ఠంగా 35-40 లక్షల టన్నుల సన్న ధాన్యం మాత్రమే ఉత్పత్తి అవుతున్నది. ఇందులో అధిక భాగాన్ని రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించి, మిగిలిన ధాన్యాన్ని తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు మహా అయితే 3-5 లక్షల టన్నుల సన్న ధాన్యం మాత్రమే వస్తున్నట్టు అధికారులు చెప్తున్నారు. ప్రస్తుత సీజన్ నుంచి ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్టు ప్రకటించినందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అదనంగా మరో 10-15 లక్షల టన్నుల సన్న ధాన్యం వచ్చే అవకాశం ఉన్నది. ఈ లెక్కన రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ఇంకా 15-20 లక్షల టన్నుల సన్న ధాన్యం తక్కువ అవుతుంది. ఇంత మొత్తాన్ని టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తే పౌరసరఫరాల శాఖపై భారీగా ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో, లోటును ఎలా పూడ్చాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.


బుమ్రా (4/50)

తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు ఆలౌట్

బంగ్లా ఢమాల్

4 వికెట్లతో బుమ్రా విజృంభణ • రాణించిన ఆకాశ్, సిరాజ్ • భారత్ ఆధిక్యం 308 పరుగులు



బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. సొంతగడ్డపై సత్తాచాటుతూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మ్యాచ్‌పై మరింత పట్టు సాధించింది. అశ్విన్ సూపర్ సెంచరీకి తోడు జడేజా యాంకర్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరు అందుకున్న భారత్..బంగ్లా భరతం పట్టింది. యార్కర్‌కింగ్ బుమ్రా నాలుగు వికెట్ల విజృంభణకు తోడు ఆకాశ్‌దీప్, సిరాజ్, జడేజా రాణించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. వెటరన్ షకీబ్ అల్‌హసన్(32) టాప్ స్కోరర్‌గా నిలువగా సహచర బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో బంగ్లా బ్యాటింగ్ ఆర్డర్ కకావికలమైంది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన టీమ్‌ఇండియా 3 వికెట్ల నష్టానికి 81 పరుగులతో కొనసాగుతున్నది. కెప్టెన్ రోహిత్‌శర్మ(5), విరాట్ కోహ్లీ(17) మరోమారు నిరాశపర్చగా, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్ క్రీజులో ఉన్నారు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న భారత్ ప్రస్తుతం 308 పరుగుల భారీ ఆధిక్యంలో ఉన్నది. మూడు రోజులు మిగిలున్న మ్యాచ్‌లో అద్భుతం జరిగితే తప్ప.. భారత్ విజయాన్ని అడ్డుకోవడం అసాధ్యం!

చెన్నై: భారత పేసర్లు విజృంభించడంతో చెన్నై వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా పటిష్ట స్థితిలో నిలిచింది. పేసు గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా (4/50) నాలుగు వికెట్లతో బంగ్లా వెన్ను విరవగా యువ పేసర్ ఆకాశ్ దీప్ (2/19), మహ్మద్ సిరాజ్ (2/30)కు తోడు స్పిన్నర్ రవీంద్ర జడేజా (2/19) చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 47.1 ఓవర్లలో 149 పరుగులకే చాప చుట్టేసింది. ఆ జట్టులో షకీబ్ అల్‌హసన్ (32) టాప్ స్కోరర్. బంగ్లాను తక్కువ స్కోరుకే ఆలౌట్ చేసిన భారత్.. 227 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రోహిత్ సేన.. 23 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 81 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (33 బ్యాటింగ్), రిషభ్ పంత్ (12 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 308 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది.

గంటలోపే ఆలౌట్

ఓవర్ నైట్ స్కోరు 339/6తో రెండో రోజు ఆరంభించిన భారత్ మరో 37 పరుగులు మాత్రమే జోడించి ఫస్ట్ సెషన్‌లో గంటలోపే ఆలౌట్ అయింది. ఓవర్ నైట్ స్కోరుకు ఒక్క పరుగూ జోడించకుండానే జడేజా (86) వెనుదిరగగా సెంచరీ హీరో రవిచంద్రన్ అశ్విన్ (113) మరో 11 పరుగులు జతచేశాడు. ఆకాశ్ దీప్ (17) నాలుగు బౌండరీలతో మెరుపులు మెరిపించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 376 పరుగులు చేసింది. యువ బౌలర్ హసన్(5/83) ఐదు వికెట్లతో అదరగొట్టాడు.

వణికించిన పేసర్లు

భారత సీమర్ల ధాటికి బంగ్లా పతనం తొలి ఓవర్ నుంచే మొదలైంది. బుమ్రా వేసిన ఇన్నింగ్స్ మొదటి ఓవర్‌లోనే ఓపెనర్ షాద్మన్ (2) క్లీన్ బౌల్డ్ ఔట్ అయ్యాడు. బుమ్రా వేసిన ఇన్‌స్వింగర్‌ను తప్పుగా అంచనా వేసిన అతడు.. ఆఫ్ స్టంప్‌ను వదిలేసి ఆడి మూల్యం చెల్లించుకున్నాడు. ఆకాశ్ దీప్ 9వ ఓవర్లో వరుస బంతుల్లో జకీర్ హసన్ (3), మోమినుల్ హక్ (0)ను ఔట్ చేశాడు. లంచ్ విరామ సమయానికి బంగ్లా స్కోరు 9 ఓవర్లలో 26/3గా ఉంది. లంచ్ తర్వాత సిరాజ్ వేసిన 12వ ఓవర్లో కెప్టెన్ నజ్ముల్ శాంతో (20) స్లిప్స్‌లో కోహ్లీ చేతికి చిక్కాడు. ప్రమాదకర ముష్ఫికర్ రహీమ్ (8) సైతం బుమ్రా బౌలింగ్‌లో కేఎల్ రాహుల్‌కు క్యాచ్ ఇచ్చాడు. 40 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ బంగ్లాదేశ్‌ను షకిబ్, లిటన్ దాస్ (22) ఆదుకునే యత్నం చేశారు. ఈ ఇద్దరూ ఆరో వికెట్‌కు 51 పరుగులు జోడించారు. కానీ జడేజా రంగప్రవేశంతో రోహిత్ వీరి ఆట కట్టించాడు. జడ్డూ బౌలింగ్‌లో స్లాగ్ స్వీప్ ఆడబోయిన దాస్.. డీప్ స్క్వేర్ లెగ్ వద్ద సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ ధ్రువ్ జురెల్ చేతికి చిక్కాడు. అతడి బౌలింగ్‌లోనే రివర్స్ స్వీప్ ఆడబోయిన షకిబ్.. రిషభ్ పంత్ క్యాచ్ పట్టడంతో ఔట్ అయ్యాడు. మిరాజ్ ఆదుకున్నా అతడికి అండగా నిలిచే బ్యాటర్ లేకపోవడంతో ఆ జట్టు 149కే ఆలౌట్ అయింది.

> **400** ఈ మ్యాచ్‌లో హసన్ మహ్మూద్‌ను ఔట్ చేయడంతో టెస్టులలో బుమ్రా అంతర్జాతీయ క్రికెట్‌లో 400 వికెట్లను పూర్తి చేసిన పదో భారత బౌలర్ (పేసర్లలో ఆరోవాడు)గా నిలిచాడు.

భారీ ఆధిక్యం దిశగా..

తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభంలో మరోసారి తడబడింది. రోహిత్ (5) మళ్లీ నిరాశపరచగా మొదటి ఓవర్‌లోనే రెండు బౌండరీలు బాదిన యశస్వీ జైస్వాల్ (10) కూడా విఫలమయ్యాడు. గిల్‌తో కలిసి క్రీజులో నిలదొక్కుకున్నట్టే కనిపించిన కోహ్లీ (17) అంపైర్ తప్పుడు నిర్ణయం కారణంగా బలయ్యాడు. మిరాజ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగిన కోహ్లీ.. డీఆర్ఎస్ తీసుకోకుండానే క్రీజును వీడాడు. కానీ రిప్లైలో బంతి కోహ్లీ బ్యాట్‌ను తాకుతూ వెళ్లినట్టుగా కనిపించింది. గిల్, పంత్‌తో పాటు రాహుల్, అశ్విన్, జడేజా వంటి బ్యాటర్లు క్రీజులో ఉండటంతో భారత్ 400 ప్లస్ ఆధిక్యంపై కన్నేసింది! మొత్తంగా రెండో రోజు ఆటలో ఏకంగా 17 వికెట్లు నేలకూలడం గమనార్హం.

భారత్ తొలి ఇన్నింగ్స్: 376 ఆలౌట్
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 149 ఆలౌట్ (షకిబ్ 32, మిరాజ్ 27 నాటౌట్, బుమ్రా 4/50, ఆకాశ్ 2/19) **భారత్ రెండో ఇన్నింగ్స్** :81/3 (గిల్ 33 నాటౌట్, పంత్ 12 నాటౌట్)

ముగిసిన మాళవిక పోరు



చెంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీలో తన కంటే మెరుగైన ప్రత్యర్థులను చిత్తుచేసి క్వార్టర్స్ చేరిన భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మాళవిక 10-21, 16-21తో అకానె యమగుచి (జపాన్) చేతిలో ఓడింది. 35 నిమిషాల్లోనే ముగిసిన ఈ పోరులో ప్రపంచ ఐదో ర్యాంకర్ యమగుచి ధాటికి మాళవిక నిలువలేకపోయింది. మాళవిక ఓటమితో ఈ టోర్నీలో భారత పోరాటం ముగిసినట్టైంది.

గుర్బాజ్ శతక చరిత్ర

షార్జా: దక్షిణాఫ్రికాతో షార్జా వేదికగా జరిగిన రెండో వన్డేలో అఫ్గానిస్థాన్ ఓపెనర్ రెహ్మానుల్లా గుర్బాజ్(105) సరికొత్త చరిత్ర సృష్టించాడు. అఫ్గన్ తరపున దక్షిణాఫ్రికాపై వన్డేలలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు పుటల్లోకెక్కాడు. వన్డేలలో అతడికి ఇది 7వ శతకం. తద్వారా ఆ జట్టు తరపున వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన మహ్మద్ షాజాద్ (6) రికార్డును అధిగమించాడు. గుర్బాజ్‌తో పాటు అజ్మతుల్లా (86 నాటౌట్), రెహ్మత్ షా(50) రాణించడంతో మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్.. నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్లకు 311 పరుగుల భారీ స్కోరు చేసింది.

రాజస్థాన్ బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్



జైపూర్: రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ క్రికెటర్ విక్రమ్ రాథోడ్ ఎంపికయ్యాడు. రానున్న సీజన్ కోసం ఇప్పటికే దిగ్గజ క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌ను చీఫ్ కోచ్‌గా తీసుకున్న రాయల్స్ యాజమాన్యం తాజాగా విక్రమ్‌ను నియమించుకుంది. ఈ విషయాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2019 నుంచి ఇటీవలే ముగిసిన టీ20 ప్రపంచకప్ వరకు టీమ్‌ఇండియా బ్యాటింగ్ కోచ్ రాథోడ్ వ్యవహరించాడు. 'ద్రవిడ్‌తో కలిసి మళ్లీ పనిచేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. రాయల్స్ కుటుంబంలో భాగం కాబోతున్నందుకు గర్వపడుతున్నాను' అని అన్నాడు.



రాజేశ్వరి పసిడి ధమాకా

తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియనషిప్

కొల్లాపూర్, సెప్టెంబర్ 20 : ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) వేదికగా జరుగుతున్న 10వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ అథ్లెట్ గడ్డం రాజేశ్వరి పసిడి ధమాకా కొనసాగిస్తున్నది. టోర్నీలో ఇప్పటికే 5కిలోమీటర్ల రేస్ వాక్(19నిమిషాల 55 సెకన్లు)లో స్వర్ణం కొల్లగొట్టిన రాజేశ్వరి మళ్లీ సత్తాచాటింది. శుక్రవారం జరిగిన బాలికల అండర్-20..3వేల స్టిపుల్‌చేజ్ రేసును 12 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేసిన ఈ అమ్మాయి మరో స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి విజయం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర క్రీడాభివృద్ధికి సహకరించండి

• కేంద్రక్రీడా మంత్రికి సాట్స్ విజ్ఞప్తి



హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సహకరించాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాకు సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గచ్చిబౌలి సాయ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శించిన మంత్రికి వినతిపత్రం అందజేశారు. భవిష్యత్‌లో దేశంలో జరిగే మెగాటోర్నీల ఆతిథ్యంలో రాష్ట్రానికి అవకాశమివ్వాలని మంత్రిని కోరారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తుందని, ఇందుకోసం కేంద్రం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. గచ్చిబౌలి స్టేడియంతో పాటు సాయ్ శిక్షణా కేంద్రంలో వసతులను మాండవీయ పరిశీలించారు. అక్కడే శిక్షణ పొందుతున్న పారాలింపిక్స్ పతక విజేత దీప్తితో పాటు అథ్లెట్లను మంత్రి సన్మానించారు.

డబ్బులిస్తేనే దేశం కోసం ఆడతానన్నాడు

• సుమిత్ నాగల్‌పై ఐటా ఆరోపణలు



ఢిల్లీ: భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ దేశం కోసం (డేవిస్ కప్‌లో) ఆడేందుకు భారీగా నగదు డిమాండ్ చేశాడని ఆలిండియా టెన్నిస్ సమాఖ్య (ఐటా) సంచలన ఆరోపణలు చేసింది. డేవిస్ కప్ ఆడేందుకు నాగల్‌తో పాటు యూకీ బాంబ్రీ, శశికుమార్ తిరస్కరించారని, ఈ టోర్నీలో పాల్గొనాలంటే ఏడాదికి తనకు 50 వేల యూఎస్ డాలర్లు (రూ.45 లక్షలు) చెల్లించాలని నాగల్ డిమాండ్ చేసినట్టు ఐటా కార్యదర్శి అనిల్ ధూపర్ వెల్లడించాడు. 'దేశం తరపున ఆడేప్పుడు ఒక క్రీడాకారుడు డబ్బులు డిమాండ్ చేయడమేంటి? డేవిస్ కప్‌లో ఆడాలంటే రూ. 45 లక్షలు ఇస్తేనే ఆడతానని లేకుంటే ఆడనని నాగల్ చెప్పాడు' అని అన్నాడు. అయితే ఈ ఆరోపణలపై నాగల్ సైతం ఘాటుగానే స్పందించాడు. 'దేశం తరపున ఆడినా ప్రొఫెషనల్ క్రీడాకారులకు పరిహారం ఇవ్వడం సర్వసాధారణమే. ఇందులో సొంత ప్రయోజనాలేమీ లేవు' అని ఎక్స్ ఖాతాలో వివరణ ఇచ్చాడు.

రసవత్తరంగా గాలె టెస్టు


చండిమాల్ (61)

గాలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. లంకేయులను 305 పరుగులకు ఆలౌట్ చేసిన కివీస్.. మొదటి ఇన్నింగ్స్‌లో 340 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన లంక.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 237 పరుగులు సాధించింది. కరుణరత్నె (83), చండిమాల్ (61) రాణించారు. మాథ్యూస్ (34 నాటౌట్), డి సిల్వ (34 నాటౌట్) క్రీజులో ఉన్నారు. లంక ప్రస్తుతం 202 పరుగుల ఆధిక్యంలో ఉంది.

• దవాఖానలో వీధి కుక్కల స్వైరవిహారం



నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖాన ప్రాంగణంలో శుక్రవారం ఉదయం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. సుమారు ఏడు గ్రామ సింహాలు దవాఖానలోకి ప్రవేశించాయి. గుంపులు.. గుంపులుగా ఓపీ రూమ్ ముందు సంచరించాయి. దీంతో అక్కడున్న రోగులు భయాందోళకు గురయ్యారు. అయినా వాటిని తరుమకపోవడంతో రోగులు, వారి బంధువులు దవాఖాన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

–నాగర్‌కర్నూల్

చిన్నారులపై వీధికుక్కల దాడి

ఇద్దరికి గాయాలు: వనపర్తి జిల్లా అమరచింతలో ఘటన

అమరచింత, సెప్టెంబర్ 20 : ఆడుకుంటున్న చిన్నారులపై వీధికుక్కలు దాడి చేసిన ఘటన వనపర్తి జిల్లా అమరచింతలోని శ్రీకృష్ణనగర్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఉదయం పాఠశాలకు వెళ్లే ముందు అభినాష్, అక్షయ్‌కుమార్ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. అక్షయ్‌కుమార్ ఎడమ చెవికి, అభినాష్ వీపుపై గాయాలయ్యాయి. అక్షయ్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించగా.. అభినాష్‌కు స్థానికంగా చికిత్స చేయిస్తున్నారు. కాలనీలో వీధికుక్కల సంచారం ఎక్కువైందని, మున్సిపల్ అధికారులు వాటిని పట్టణానికి దూరంగా తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

నీట్ 'స్థానిక' విద్యార్థులకు ఊరట

• పిటిషనర్లు కౌన్సిలింగ్‌కు హాజరుకావొచ్చు
• సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు.. 135 మందికి లబ్ధి
• ఈ ఒక్కసారి అవకాశం ఇస్తామన్న ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'స్థానికత' వివాదంలో విద్యార్థులకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. పిటిషనర్లు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. ఇదే సమయంలో ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికతను నిర్ధారిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-33ను సవాల్ చేస్తూ దాదాపు 135 మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థులకు అనుకూలంగా హైకోర్టు ఈ నెల 5న తీర్పు వెలువరించగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై శుక్రవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ వ్యవహారంలో రాజ్యాంగ ధర్మాసనంతోపాటు నాలుగు తీర్పులు తమకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. తెలుగు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు విదేశాల్లో చదివి, తెలంగాణలో నీట్ పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఏపీ విద్యార్థులు తెలంగాణలో నీట్‌కు హాజరుకావొచ్చని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఏపీలో ఆ అవకాశం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో స్థానికతను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-33 తీసుకువచ్చిందని, దీనిని హైకోర్టు నిలిపివేసిందని తెలిపారు. సెప్టెంబర్ చివరివారంలో నీట్ కౌన్సెలింగ్ మొదటి రౌండ్, అక్టోబర్ మొదటి వారంలో రెండో విడత కౌన్సెలింగ్ ఉన్నదని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు, కౌన్సెలింగ్‌కు తక్కువ సమయం ఉన్న నేపథ్యంలో పిటిషనర్లు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. అయితే ఈ మినహాయింపు ఈ ఒక్కసారికి మాత్రమేనని స్పష్టం చేశారు. విద్యార్థుల తరపు న్యాయవాది మురళీధర్ వాదనలు వినిపిస్తూ.. నీట్ ఫలితాలకు వారం రోజుల ముందు తెలంగాణ ప్రభుత్వం కొత్త జీవో తెచ్చిందన్నారు. ఆగస్టు 26న నీట్ ఫలితాలు రాగా, 19వ తేదిన జీవో 33 తెచ్చారని తెలిపారు. రెండు, మూడు సంవత్సరాలు చదువుల కోసం రాష్ట్రానికి దూరంగా ఉంటే స్థానికతను దూరం చేయకూడదని వాదించారు. ఇరువైపు వాదనలు విన్న అనంతరం.. రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిన నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన విద్యార్థులు నీట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మూడు వారాల్లో సమాధానం చెప్పాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. కేసును వచ్చే నెల 13వ తేదీకి వాయిదా వేసింది.



సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో మరమ్మతు చేసిన బోరు వద్ద గ్రామ మహిళలు

చిన్నలింగాపూర్‌కు నీళ్లొచ్చినయ్

సమస్యను పరిష్కరించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 20: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో నీటి సమస్య తీరింది. మూడు నెలలుగా నీటి సమస్య ఉన్నా.. పంచాయతీ కార్యదర్శి, అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో 'మంచీనీళ్ల మహాప్రభో' శీర్షికన శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. గ్రామంలోని బోర్లు మరమ్మతు చేసి, నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎంపీటీసీ బైరినేని రాము చొరవతో జీపీ కార్యదర్శి నీరజ, సిబ్బంది బోర్లను మరమ్మతు చేయించి కొత్త బోరు మోటర్ బిగించి శుక్రవారం నీటిని సరఫరా చేశారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

రైస్‌మిల్లుల మాయాజాలం

• భారీగా సీఎంఆర్ మాయం
• పెంచికల్ పేట మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు
• క్రిమినల్ కేసులకు సిఫారసు

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 20: ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యంలో రైస్‌మిల్లుల యజమానులు భారీగా అవినీతికి పాల్పడ్డారు. కోట్లాది రూపాయల విలువ చేసే ధాన్యాన్ని ప్రైవేట్‌కు అమ్ముకున్నట్టు తేలింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేటలోని శ్రీ బాలాజీ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లుపై శుక్రవారం పొద్దుపోయిన తర్వాత సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. మిల్లులో నిల్వ ఉన్న సీఎంఆర్‌ను లెక్కించగా భారీ ఎత్తున బస్తాలు మాయమైనట్టు తేలింది. ఈ సందర్భంగా సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. బాలాజీ మిల్లుకు 2021-22, 2022-23 సంవత్సరాలకు మొత్తంగా 6,339 టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్‌కు కేటాయించగా, దీనికిగాను 4,310 టన్నుల బియ్యాన్ని తిరిగి మిల్లు యజమాని ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1,889 టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చినట్టు తెలిపారు. మిగతా 3,521 టన్నుల ధాన్యం మిల్లులో ఉండాల్సి ఉండగా, కేవలం 205 టన్నుల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. మిగతా ధాన్యం మిల్లు యజమాని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నట్టు తేలిందని అన్నారు. కనపడని ధాన్యం విలువ సుమారు రూ.7.50 కోట్లు ఉంటుందని చెప్పారు. ధాన్యం లేనిపక్షంలో డబ్బు చెల్లించేందుకైనా ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. అయినప్పటికీ మిల్లుల యజమానులు స్పందించకపోవడంతో తనిఖీలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. మిల్లు యజమాని రవీందర్‌రెడ్డిపై క్రిమినల్ కేసులకు సిఫారసు చేయనున్నట్టు తెలిపారు.



మిల్లులో సీఎంఆర్ ధాన్యాన్ని లెక్కిస్తున్న సివిల్ సప్లయీస్ అధికారులు



తాడ్వాయి సహకార సంఘంలో పాలకవర్గ సభ్యులను నిర్బంధించిన రైతులు

రుణమాఫీ చేయాలని సొసైటీకి తాళం

• పాలకవర్గ సభ్యుల నిర్బంధం
• కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో ఘటన

లింగంపేట (తాడ్వాయి), సెప్టెంబర్ 20: వ్యవసాయ రుణాలు పొందిన ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘ పాలకవర్గ సభ్యులను రైతులు శుక్రవారం నిర్బంధించారు. సొసైటీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లారు. సహకార సంఘం చైర్మన్ కపిల్‌రెడ్డి, సీఈవో నర్సింహులు, డైరెక్టర్లను విండో కార్యాలయంలో నిర్బంధించారు. రుణమాఫీ మాఫీ చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ హోదాలో కౌలు రైతులకు, ఉపాధి హామీ కూలీలకు రైతు భరోసా కల్పిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు నర్సింహులు, సుధాకర్, గంగారెడ్డి, రమేశ్, నారాయణ, స్వామి, సుధాకర్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

ఫోర్జరీ కేసులో బీజేపీ నాయకుడి అరెస్టు

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 20 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు అజ్మీరా హరినాయక్‌ను ఫోర్జరీ సంతకాల కేసులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. లక్షెట్టిపేటలో ఏసీపీ ప్రకాశ్ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. అల్లీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు అనే పట్వారి 1998లో సుమారు 7.26 గుంటల భూమిని తనకు అమ్మినట్టు అజ్మీరా హరినాయక్ దొంగ పత్రాలు తయారు చేశాడు. ఆపై ఆ భూమిని కబ్జా చేశాడు. కానీ, పట్వారి ఆ భూమిని 1990లోనే తన నలుగురు కుమారులకు పట్టా చేశాడు. ఈ క్రమంలో భూమి వద్దకు వస్తే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని అజ్మీరా హరినాయక్ పలుమార్లు ఆయన కుమారులను బెదిరించాడు. ఈ క్రమంలో దొంగ పత్రాలు పట్టుకొని తమను బెదిరిస్తున్నాడంటూ పట్వారీ కొడుకు మురళీధర్‌రావు అజ్మీరా హరినాయక్‌పై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో గత ఆగస్టు 17న ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పట్వారి చదువుకున్న వ్యక్తి కావడం, ఫోర్జరీ పత్రాలపై వేలి ముద్రలు ఉండటం.. సాక్షులుగా ఉన్న వారిలో ఏ ఒక్కరు బతికి లేకపోవడంతో పక్కగా ఫోర్జరీ చేసినట్టు తేల్చారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని చీటింగ్, ఫోర్జరీతోపాటు మరికొన్ని సెక్షన్ల కింది కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. నిందితుడిపై ఇప్పటికే సమారు ఏడు కేసులు ఉన్నాయని, ఇంకా చాలా ఆరోపణలు కూడా ఉన్నట్టు తెలిసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.